ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 21, జనవరి 2025



ఏఎంసీల రిజర్వేషన్లు కొలిక్కి..

త్వరలో ఖరారు

వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల పాలక మండళ్ల రిజర్వేషన్ల వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ఈ విషయంలో అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల అభ్యంతరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీరియస్‌గా స్పందించడంతో అడుగు ముందుకు పడింది. ఆయా జిల్లాల వారీ ఉన్న ఏఎంసీ చైర్మన్ల పదవుల్లో సగం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు.. అందులోనూ మహిళలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంబంధిత ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల ఇన్‌చార్జిలతో మాట్లాడి రిజర్వేషన్లు ఖరారు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఆ మేరకు రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు సమాచారం.


ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం



సీఎం హెచ్చరికతో సైలెంట్ అయిన ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఏఎంసీల రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కివచ్చింది. అందుకు సంబంధించిన కసరత్తు పూర్తయ్యింది. వాటిని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. తొలుత అత్యధిక జిల్లాల కలెక్టర్ల ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. ఎక్కువ మంది తమ పరిధిలోని ఏఎంసీ చైర్మన్ పదవులను జనరల్ కేటగిరీలో ఉంచాలని పట్టుబట్టారు. దీంతో పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతలను ఇన్‌చార్జి మంత్రులకు టీడీపీ అధిష్ఠానం అప్పగించింది. తదనుగుణంగా జిల్లాకు సంబంధించి ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రంగంలోకి దిగారు. అయినప్పటికీ కొత్త జిల్లాతోపాటు ఉమ్మడి

- వారితో మంత్రులు ఆనం, డోలా చర్చలు
- అటు మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి జోక్యం

ప్రకాశంలో కూడా రిజర్వేషన్లపై స్పష్టత రాలేదు. అనేక మంది ఎమ్మెల్యేలు తమ ఏఎంసీని జనరల్ కేటగిరీలో ఉంచాలని పట్టుబట్టడంతో తిరిగి సమస్య ముఖ్యమంత్రి వద్దకు వెళ్లింది. అలా సీఎం దృష్టికి వెళ్లిన జిల్లాల్లో ఉమ్మడి ప్రకాశం కూడా ఉంది.

జనాభా ప్రాతిపదికనే..

మొత్తం పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటు ఇన్‌చార్జి మంత్రులు, అటు కలెక్టర్లకు రిజర్వేషన్ల విధానాలను తూచా తప్పకుండా

మిగతా 6వ పేజీలో

ఎస్సీ ఎమ్మెల్యే ఉంటే ఓసీలకు..

ఒంగోలు ఏఎంసీ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రిజర్వు అయినందున తిరిగి వారికే ఇస్తే తనకు అభ్యంతరం లేదని ఎమ్మెల్యే దామచర్ల తెలిపినట్లు తెలిసింది. దీంతో ఆ విధంగానే రిజర్వు చేయాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే పదవులు దళితులకు రిజర్వు అయినందున తమ నియోజకవర్గాల్లోని ఏఎంసీలను జనరల్ కేటగిరీలో ఉంచాలని మంత్రి స్వామి, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబులు కోరారు. తాజా సమాచారం మేరకు కొండపి జనరల్ కేటగిరీలో ఉంచినప్పటికీ అవసరమైతే మహిళకు రిజర్వు చేయాలని భావిస్తున్నారు. ఎస్ఎన్ పాడులోని మద్దిపాడు ఏఎంసీ జనరల్‌కు కేటాయించినట్లు తెలిసింది. వైపాలెం ఏఎంసీ పదవిని మాత్రం ఎస్టీలకు రిజర్వు చేసినట్లు సమాచారం. మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం జనరల్ కేటగిరీలో ఉంచి, పొదిలి ఎస్సీలకు రిజర్వు చేయాలని భావించారు. కుదరని పక్షంలో పొదిలి బీసీకి రిజర్వు చేయొచ్చు. గిద్దలూరు నియోజకవర్గంలో గిద్దలూరు ఏఎంసీ జనరల్ కేటగిరీలో ఉంచి, కంభం ఏఎంసీ చైర్మన్ పదవిని బీసీలకు రిజర్వు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

పాఠశాల విద్యార్థులకు కొత్త మెనూ

- జోన్ల వారీగా మార్పు
- వెంటనే అమలుకు ఆదేశం



ఒంగోలు విద్య, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం మెనూలో ప్రభుత్వం మార్పులు చేసింది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల విద్యార్థులకు ఒకే మెనూను అమలు చేసేవారు. అయితే రాష్ట్రంలో ఆయా ప్రాంతాలను బట్టి అక్కడి ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పులు ఉన్నాయి. ఈనేపథ్యంలో జోన్ల వారీగా మెనూను ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులకు ఆయా ప్రాంతాల్లో తినే ఆహారాన్ని అందిస్తే మరింత మంది పాఠశాలల్లో భోజనం చేస్తారన్న ఆలోచనతో జోన్-3 పరిధిలో ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాల విద్యార్థులకు ప్రత్యేకంగా మెనూను ప్రకటించింది. ఆ ప్రకారం పాఠశాలల్లో విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తినేలా వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

కొత్త మెనూ వివరాలు ఇవీ..

సోమవారం : తెల్ల అన్నం, కూరగాయల సాంబారు, చిక్కీ, ఎగ్‌ఫ్రై
మంగళవారం : చింతపండు లేదా నిమ్మకాయ పులిహోర, టమాటా/పుదీనా చట్నీ, ఫ్రైడ్ ఎగ్, రాగిజావ
బుధవారం : తెల్ల అన్నం, కూరగాయల మిశ్రమం కూర, ఎగ్‌ఫ్రై, చిక్కీ
గురువారం : పలావు/కూరగాయల అన్నం, ఉర్లగడ్డ కుర్మ, ఉడికించిన గుడ్డు, రాగిజావ
శుక్రవారం : తెల్ల అన్నం, కోడిగుడ్డు కూర, చిక్కీ
శనివారం : తెల్ల అన్నం, టమాటా పప్పు/ పప్పుచారు, తీపి పొంగలి, రాగి జావ ఇస్తారు.


ముండ్లమూరు మండలం మారెళ్ల వద్ద సాగులో ఉన్న నేరేడు

7

సిరులు పండుతున్నాయ్!



- ముండ్లమూరు మండలంలో విస్తారంగా పండ్ల తోటలు
- డ్రాగన్ ఫ్రూట్, నేరేడు, సీతాఫలం, జామ, దానిమ్మ సాగు
- ఇతర రాష్ట్రాల్లో చూసి అదే తరహాలో పండిస్తున్న రైతులు
- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందుతున్న కర్షకులు

రీసర్వే ప్రారంభం

రైతుల సమక్షంలో భూముల కొలతలు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 38 గ్రామాల్లో సోమవారం నుంచి రీసర్వే ప్రారంభమైంది. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారుల బృందాలు సర్వే ప్రారంభించాయి. ప్రభుత్వ భూములతోపాటు దేవదాయ, రైతుల భూములను రీసర్వే చేసి రికార్డులను పకడ్బందీగా తయారుచేసేందుకు సర్కారు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా జిల్లాలో 38 మండలాలు ఉండగా మండలంలో ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి కార్యక్రమం

మిగతా 6వ పేజీలో


ఒంగోలు మండలం యరజర్లలో భూమి కొలతలు చూస్తున్న సర్వేయర్లు


పెంపకందారులు ఇచ్చిన గొర్రెపిల్లతో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పశుగణాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

7

పశుగణాభివృద్ధికి ప్రభుత్వం చేయూత ఇస్తున్నదని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని పొదిలి రోడ్డులో గొర్రెల మండీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోనే మన జిల్లాలో అత్యధికంగా గొర్రెలు, మేకల పెంపకంచేస్తూ లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. వారంతా పరాయి ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా తమ జీవాలను అమ్ముకునేందుకు వీలుగా సంత (గొర్రెల మండి) ప్రారంభించినట్లు చెప్పారు.

పోలీస్.. శభాష్

మార్కాపురంలో వినూత్న ప్రయోగం

ప్రమాదాల నివారణకు కూలీలను ఆర్టీసీ బస్సుల్లో తరలింపు

మార్కాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పోలీసులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. రెండు మాసాలుగా మిరప కోతలు ఉధృతంగా సాగుతుండడంతో పట్టణం నుంచి కూలీలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కి ప్రయాణం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. పలువురు మృత్యువాతపడిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈనేపథ్యంలో ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు నడుం బిగించారు. నాలుగు రోజులుగా పోలీసు, రవాణా, ఆర్టీసీ


మిరప కోతకు వెళ్లే కూలీలను ఆర్టీసీ బస్సులో ఎక్కిస్తున్న పోలీసు, రవాణా, ఆర్టీసీ అధికారులు

అధికారులు కసరత్తు చేశారు. డ్రైవర్లు, కూలీలను తరలించే మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ప్రైవేటు వాహనాల్లో పరిమితికి లోబడి కూలీలను తరలించాలంటే ఇబ్బందులు

మిగతా 6వ పేజీలో

టైరు పగిలి కూలీల ఆటో బోల్తా

14 మందికి గాయాలు

వివరాలు 7వ పేజీలో



కర్ణాటకలో మార్కెట్ మందగమనం

- ఇప్పటివరకు కొన్నది 45 మిలియన్ కిలోలు మాత్రమే
- ఇంకా రైతుల వద్ద 55 మిలియన్ కిలోల పొగాకు
- ఆంధ్రలో ప్రస్తుత సీజన్‌పై ప్రభావం
- కొనుగోళ్లు ఆలస్యమయ్యే అవకాశం

ఒంగోలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సీజన్ ఆంధ్రలో ప్రత్యేకించి దక్షిణాదిలోని వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అందుకు కర్ణాటకలో కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండటమేనని తెలుస్తోంది. సాధారణంగా ఏటా ఆంధ్రలో పొగాకు నాట్లు వేసే సమయంలో కర్ణాటకలో కొనుగోళ్లు మొదలవుతాయి. ఇక్కడ పొగాకు క్యూరింగ్ మూడొంతులు పూర్తయ్యే సమయానికి అక్కడ దాదాపు కొనుగోళ్లు తుదిదశకు చేరుకుంటాయి. అలా ఫిబ్రవరి ఆఖరుకు కర్ణాటకలో చివరి దశకు చేరితే ఆ వెంటనే దక్షిణాదిలో కొనుగోళ్లను పొగాకు బోర్డు ప్రారంభిస్తుంది. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. సంక్రాంతి వెళ్లినా కర్ణాటకలో పండిన పంటలో సగం విక్రయాలు కూడా పూర్తికాలేదు. మెరుగైన ధరల కోసం అక్కడి రైతులు ఎదురుచూస్తూ త్వరితగతిన పంట అమ్మకాలకు మొగ్గుచూపడం లేదు. మరోవైపు అక్కడ లోగ్రేడ్ అధికంగా ఉత్పత్తి కావడంతో మేలురకం పొగాకు ధరలు బాగానే ఉన్నా రైతులు మాత్రం లోగ్రేడ్ బేళ్లను ఎక్కువగా వేలం కేంద్రాలకు తెస్తున్నారు. దీంతో నోబిడ్‌లు కూడా ఒకింత అధికంగా ఉంటుండటంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి.

కర్ణాటకలో అక్టోబరు 7న వేలం ప్రారంభం

కర్ణాటకలో 2024-25 సీజన్‌కు పొగాకు బోర్డు అంతకు ముందు సీజన్ వలే 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. ఇంచుమించు అంతే పరిమాణంలో పంట ఉత్పత్తి జరిగినట్లు అంచనా. గత ఏడాది అక్టోబరు 7న కర్ణాటకలోని మొత్తం పది కేంద్రాల్లోనూ వేలంను అధికారులు ప్రారంభించారు. తొలిరోజు మేలురకం కిలోకు రూ.230 ఇచ్చిన వ్యాపారులు క్రమంగా డిసెంబర్ రెండో వారం నాటికి గరిష్ఠ ధర కిలో రూ.290 వరకూ.. లోగ్రేడ్‌లకు

మిగతా 6వ పేజీలో

గుండ్లకమ్మలో పూర్తిస్థాయి నీటి నిల్వ

ప్రాజెక్టుల ఎస్ఈ నాగమురళీ మోహన్

ప్రస్తుత పరిస్థితిపై అధికారులతో సమీక్ష

ఒంగోలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ప్రాజెక్టులో దాదాపు రెండున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నీటి నిల్వ చేసే అవకాశం వచ్చింది. గతంలో వలే 3.40 టీఎంసీలు నిల్వ చేయనున్నట్లు ప్రాజెక్టుల ఎస్ఈ నాగమురళీమోహన్ తెలిపారు. ఇప్పటివరకు జలవనరుల శాఖ ఎన్నెస్పీ అద్దంకి డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ఆయన్ను మూడు రోజుల క్రితం ఒంగోలులోని ప్రాజెక్టుల ఎస్ఈగా ప్రభుత్వం నియమించింది. ఆదివారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఉదయం గుండ్లకమ్మ ప్రాజెక్టుపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. తొలుత గుండ్లకమ్మ ప్రాజెక్టు డివిజన్-2 యూనిట్ ఈఈ రవికుమార్, డివిజన్-1, 2 యూనిట్లలోని డీఈలు, జేఈలు ఇతర సిబ్బంది ఎస్ఈని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాజెక్టులపై చర్చ సాగింది. మొత్తం 15గేట్లు ఉన్న గుండ్లకమ్మ ప్రాజెక్టులో నాటి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 2022 ఆగస్టు 31న ఒక గేటు, 2023 డిసెంబరులో మూడో నంబరు గేటు కొట్టుకుపోయిన విషయం విదితమే. దాని వల్ల రెండేళ్లపాటు ఆయకట్టుకు నీరు విడుదల చేసే అవకాశం లేక రైతులు, ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్న జాలర్ల కుటుంబాలు

మిగతా 6వ పేజీలో


ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన నాగమురళీ మోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గుండ్లకమ్మ ఈఈ రవి కుమార్, సిబ్బంది

ఏఎంసీ రిజర్వేషన్లు కొలిక్కి..

(5వ పేజీ తరువాయి)

అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇన్‌చార్జి మంత్రులతో ఆయన ప్రత్యేకంగా టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పల్నాడు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి రవికుమార్ ఎమ్మెల్యేలను తన ఇంటికి పిలిపించుకొని అందర్నీ సమావేశపర్చి ఏకాభిప్రాయంతో పదవుల రిజర్వేషన్లు పూర్తిచేశారు. అదే పద్ధతిలో మీరూ చేయాలి' అని ఆదేశించారు. అప్పటికీ వినకపోతే తానే జోక్యం చేసుకొని ఆయా ఏఎంసీల పరిధిలో ఉన్న జనాభా ప్రాతిపదికన ఖరారు చేస్తానని స్పష్ట చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇటు ప్రకాశం ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి స్వామి.. అటు బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి రవికుమార్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఇన్‌చార్జి మంత్రులు గత ఐదు రోజుల నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులతో సీఎం ఆదేశాలు చెప్పి అనేక ఏఎంసీల రిజర్వేషన్లపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.

మీరే అర్థం చేసుకోకపోతే ఎలా..?

దర్శి, కనిగిరి ఏఎంసీలను ఎస్సీలకు రిజర్వు చేశారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి నియోజకవర్గ పరిస్థితిని వివరించగా మీరు కూడా పరిస్థితి అర్థం చేసుకోకపోతే ఎలా అని మంత్రులు ఆనం, స్వామిలు ఒత్తిడి చేసినట్లు తెలిసింది. కందుకూరు పదవిని బీసీలకే రిజర్వు చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించినట్లు ప్రచారంలో ఉంది. అందుకు అనుగుణంగా ఆర్థికంగా బలవంతుడైన ఒక బీసీ నాయకుడికి ఛైర్మన్ పదవిపై హామీ కూడా ఇచ్చినట్లు నియోజకవర్గంలో ప్రచారం జరుగుతోంది. అద్దంకి నియోజకవర్గంలో రెండు ఏఎంసీలు ఉండగా మంత్రి రవికుమార్ సూచనలు పరిగణనలోకి తీసుకొని అద్దంకిని ఎస్సీకి, సంతమాగులూరు (మార్టూరు) ఏఎంసీని జనరల్ కేటగిరీకి రిజర్వు చేసినట్లు సమాచారం. పర్చూరు ఏఎంసీని జనరల్ కేటగిరీలో ఉంచాలని భావిస్తున్నప్పటికీ జిల్లా మొత్తంపై రిజర్వేషన్ల వ్యవహారం కొలిక్కి వచ్చిన తర్వాత ఖరారు కావచ్చని తెలిసింది. దాన్ని జనరల్ మహిళకు కేటాయిస్తున్నట్లు సమాచారం. చీరాల నియోజకవర్గం విషయంలో ఎమ్మెల్యే కొండయ్య బీసీ అయినందున వేరే వర్గంకు రిజర్వు చేయాలని కలెక్టర్ ప్రతిపాదించినట్లు తెలిసింది. చివరకు బీసీ మహిళకు కేటాయించనున్నట్లు సమాచారం. రానున్న మూడు, నాలుగురోజుల్లో ఈ రిజర్వేషన్లపై అధికారికంగా తుది నిర్ణయం తీసుకొని ప్రకటించే అవకాశం ఉంది.

గుండ్లకమ్మలో పూర్తిస్థాయి నీటి నిల్వ

(5వ పేజీ తరువాయి)

నష్టపోయాయి. ఏడాది క్రితం గేట్ల మరమ్మతులు ప్రారంభం కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ పనులు ఊపందుకున్నాయి.

13 గేట్ల పనులు పూర్తి

సంబంధిత పనులపై అధికారులతో ఎస్ఈ సమీక్ష చేయగా మొత్తం 15లో 13 గేట్ల పనులు పూర్తయినట్లు అధికారులు వివరించారు. ఇక 4, 13 గేట్లు మాత్రమే చేయాల్సి ఉండగా బిల్లుల పెండింగ్‌తో కాంట్రాక్టర్ తాత్కాలికంగా పనులు ఆపేశారన్నారు. అయితే ఆ రెండింటి వద్ద స్టాప్ లాక్ గేట్లను అమర్చి నీటిని నిల్వ చేస్తున్నట్లు వివరించారు. ఆ రెండు గేట్లకు కొత్తవి అమర్చకపోయినా స్టాప్‌లాక్ గేట్లను పెట్టడం ద్వారా పూర్తిస్థాయిలో ప్రాజెక్టులో నీటి నిల్వకు ఎలాంటి ఇబ్బంది లేదని ఈఈ రవికుమార్ చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 24.38 మీటర్లు, నీటి నిల్వ సామర్థ్యం 3.859 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.52 మీటర్ల మట్టంతో 3.024 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. ఎగువ నుంచి 389 క్యూసెక్కులు నీరు వస్తుండగా కపవర్తి ఎత్తిపోతల రైతుల విజ్ఞప్తి మేరకు మూడు రోజులు దిగువకు 100 క్యూసెక్కులు వదిలినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం ప్రాజెక్టు ఆయకట్టు రైతుల నీటి అవసరాల కోసం కుడి కాలువకు 20 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 94 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నట్లు తెలిపారు.

నెలాఖరుకు నింపేస్తాం..

ఎగువ నుంచి వస్తున్న నీటితో నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో రిజర్వాయర్‌ను నింపే అవకాశం ఉందని ఇంజనీర్లు వివరించారు. కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 3.859 టీఎంసీల మేర నీటిని నింపితే మోదేపల్లి సమీపంలో దోర్నపువాగు ప్రాంతంలోని కొన్ని వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఉన్నందున గతంలో ఉన్నతాధికారులు 3.40 టీఎంసీలు వరకు నింపాలని ఆదేశించారన్నారు. ఆ ప్రకారం ఏటా గతంలో నీటిని నిల్వ చేస్తున్నామని చెప్పారు. ఆమేర నీటిని నిల్వచేస్తే డెడ్‌స్టోరేజీ 1.36 టీఎంసీలు పోను రెండు టీఎంసీలకుపైగా నీరు రిజర్వాయర్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. దాని వల్ల ఆయకట్టు రైతుల వ్యవసాయ అవసరాలు, అలాగే తాగునీటి అవసరాలు తీరుతాయన్నారు. దిగువన కాలువలకు నీటిని వదులుతున్న దానికి అనుగుణంగా ఎగువ నుంచి వస్తున్న నీటిని నదిలోకి విడుదల చేయకుండా నిల్వ చేసుకోవాలని సూచించారు.

కర్ణాటకలో మార్కెట్ మందగమనం

(5వ పేజీ తరువాయి)

కూడా రూ.230 నుంచి రూ.250 వరకూ తీసుకెళ్లారు. అనంతరం మేలురకం ధరలు ఎంతోకొంత పెరుగుతున్నా లోగ్రేడ్ ధరలు అప్పటి వరకు ఉన్న దాని కన్నా తగ్గించడం ప్రారంభించారు. అసలే ఈ ఏడాది అక్కడ లోగ్రేడ్ అధికంగా ఉత్పత్తైంది. సుమారు 100 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తి అంచనా కాగా అందులో నికరంగా 40శాతం లోగ్రేడ్, 35శాతం మీడియం గ్రేడ్ ఉండగా మేలురకం కేవలం 25శాతం మాత్రమేనని సమాచారం.

అంతా లోగ్రేడ్ తేవడంతోనే..

సాధారణంగా లోగ్రేడ్ 25శాతం ఉంటుంది. అలాంటిది 40శాతం వరకు ఉత్పత్తి కావడంతోపాటు ఆ గ్రేడ్‌లకు ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందడమేకాక మేలురకం బేళ్లను ఇళ్లలో ఉంచుకొని లోగ్రేడ్, మీడియం గ్రేడ్ బేళ్లను అమ్మకాలకు ఆ నెలలో తెచ్చారు. ఆ పరిస్థితి అక్కడ కొనుగోళ్లపై తీవ్రంగా చూపింది. ఫలితంగా రోజువారీ కొనుగోలు పరిమాణం తగ్గి మొత్తం సీజన్ కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యంగా నడుస్తోంది. సంక్రాంతి వరకు దాదాపు మూడున్నర మాసాల కాలంలో కర్ణాటకలో కేవలం 45 మిలియన్ కిలోల పంట మాత్రమే కొనుగోలు చేసినట్లు సమాచారం. మేలురకం గ్రేడ్ గతం కన్నా పెరిగి గరిష్ఠ ధర కిలో రూ.315కు చేరుకోగా, కనిష్ఠ ధరలు కిలో రూ.220గా ఉన్నాయి. అలా సగటు ధర కిలో రూ.265 వరకూ లభిస్తోంది. గత ఏడాది మొత్తం 83 మిలియన్ కిలోల ఉత్పత్తి జరగ్గా సగటున కిలోకు రూ.254 ధర లభించింది. ఆ ప్రకారం చూస్తే గత ఏడాది కన్నా ఈ ఏడాది సగటు ధర ఎక్కువగానే ఉండటంతోపాటు మేలురకం ధరలు గతం కన్నా అధికంగానే లభిస్తున్నాయి. అయినప్పటికీ ఈ ఏడాది లోగ్రేడ్ ఉత్పత్తి అధికంగా ఉండటంతో అక్కడి రైతులు ఆ ధరల కోసం పట్టుపడుతూ బేళ్లను సక్రమంగా తీసుకురావడం లేదని సమాచారం. అక్కడ ఇంకా 55 మిలియన్ కిలోల పంట రైతుల వద్ద ఉండటంతో దాని విక్రయాలకు మరో మూడు మాసాలు పట్టే అవకాశం కనిపిస్తోంది. అలా అయితే ఆంధ్రలో ఈ ఏడాది కనీసం మార్చి ఆఖరుకు కూడా వేలం ప్రారంభించే పరిస్థితి ఉండదు. దాని వల్ల ఇక్కడి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

రీ సర్వే ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. రీసర్వే జరిగే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రైతుల సమక్షంలో కొలతలు వేయడం ప్రారంభించారు. రైతుల వద్ద నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి వాటిని నమోదు చేస్తున్నారు. ఆ విధంగా జిల్లావ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించేందుకు 136 బ్లాకులుగా విభజించి 126 మంది ఫీల్డ్ వర్క్ టీంలను, 38 కమ్యూనికేషన్ టీంలను ఏర్పాటుచేశారు. ఆయా బృందాల నేతృత్వంలో గ్రామాల్లో రీసర్వే మొదలైంది.

పోలీస్.. శభాష్!

(5వ పేజీ తరువాయి)

తప్పవని డ్రైవర్లు, మేస్త్రీలు తెలిపారు. ప్రత్యామ్నాయంగా ఆర్టీసీ బస్సుల ప్రతిపాదనను పోలీసులు వారికి వివరించారు. ఉదయం మార్కాపురం నుంచి పనిచేసే గ్రామానికి చేర్చడం మళ్లీ సాయంత్రం గమ్యస్థానానికి తీసుకువచ్చేందుకు అవసరమైన బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో కూలీలను తరలించడానికి మార్గం సుగమమైంది.



ఆటో డ్రైవర్లు, కూలీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు

ఎనిమిది బస్సుల్లో కూలీల తరలింపు

మార్కాపురం నుంచి మిరప, పొగాకు కోతలకు వెళ్లే కూలీలకు పలు ప్రాంతాల్లో సోమవారం 8 బస్సులను ఆర్టీసీ డీఎం నరసింహులు ఏర్పాటు చేశారు. స్థానిక కళాశాల రోడ్డు, తర్లుపాడు రోడ్డు, శ్రీనివాస థియేటర్, కోమటి కుంటల నుంచి 8 బస్సుల్లో కూలీలను తరలించారు. మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్ని ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ప్రైవేటు వాహనాల్లో కూలీలు ఎక్కకుండా నిఘా ఏర్పాటు చేశారు. రవాణాశాఖ నుంచి ఎంవీఐ మాధవరావు, ఆర్టీసీ డీఎం నరసింహులు దగ్గరుండి ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. కోమటికుంట వద్ద కూలీలను బస్సుల్లో ఎక్కించే క్రమంలో రెండు అప్పీ ఆటోల్లో కూలీలను తరలిస్తుండటాన్ని గుర్తించి వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయించారు. అదేవిధంగా ఆయా కూలీలను అక్కడ నుంచి పని ప్రదేశానికి ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించారు. ఈ సీజన్ ముగిసే వరకు ఆర్టీసీ బస్సులు క్రమం తప్పకుండా ఏర్పాటు చేస్తామని కూలీలకు తెలిపారు. కార్యక్రమంలో టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు, పోలీసు, రవాణాశాఖ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకున్నట్లు పోలీసులు వివరించారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4.2 కోట్లు

సంతమగులూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అంతర్గత మట్టిరోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చే సేందుకు రూ.4.2 కోట్లు నిధులు మం జూరైనట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సంతమగులూరు మండలం సజ్జాపురంలో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. సంతమాగులూరు మండలంలో అన్ని గ్రా మాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను నిర్మించేందుకు రూ.4.2 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. సజ్జాపురం గ్రామంలో 2, కాలనీలో 1 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని మంత్రిని గ్రామస్థులు కోరారు. వెంటనే ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కావాలని కోరగా రెవెన్యూ అధికారులతో మాట్లాడారు.



సజ్జాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి

పశుపోషకులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలి

అద్దంకి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశు వైద్యంపై పశుపోషకులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సోమవారం నుంచి ప్రారంభమై 31వ తేదీ వరకు జరిగే పశువైద్య శిబిరాల పోస్టర్, కరపత్రాలను మంత్రి రవికుమార్ సోమవారం అద్దరోడ్డు వద్ద గెస్టహౌస్ వద్ద ప్రారంభించారు. పశువైద్య శిబిరాల షెడ్యూల్‌ను మంత్రికి వివరించారు.

ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మోహనరావు, బొమ్మనంపాడు, మేదరమెట్ల, కొరిశపాడు పశువైద్యాధికారులు అశోక్, సైదయ్య, వెంకటరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

బల్లికురవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రెవెన్యూ పరం గా రైతులకు ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కారం చూపాలని చీరాల ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడు ఆదేశించారు. సోమవారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో తనిఖీ చే శారు. ఈ సందర్భంగా ఆయన రెవె న్యూ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుం డా సర్వే పనులు చేపట్టాలని చెప్పా రు. భూముల ఆన్‌లైన్ పనుల కోసం రైతులను కార్యాలయాల చుట్టూ తి ప్పించుకోవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్ పాల్గొన్నారు.



భూములను రీసర్వే చేస్తున్న రెవెన్యూ టీంలు

రీసర్వే పనులు ప్రారంభం

బల్లికురవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లి రెవిన్యూ పరిధిలో సోమవారం నుంచి భూముల రీసర్వే పనులు ప్రారంభమయ్యాయి. సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష మాట్లాడుతూ మొత్తం ఏడు టీంలను ఏర్పాటు చేశామని, రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. రైతులు కూడా దగ్గర ఉండి తమ భూములకు కొలతలు వేయించుకోవాలన్నారు. నెల రోజుల లోపు అన్ని సర్వే నెంబర్లలో కొలతలు పూర్తి చేయిస్తామన్నారు.

బైటమంజులూరులో...

పంగులూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైటమంజులూరు గ్రామంలో సోమవారం నుంచి భూముల రీసర్వే ప్రారంభించినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు. గ్రామ రెవెన్యూ పరిధిలో మొత్తం 550 మంది రైతులు, 1675 ఎకరాల భూ విస్తీర్ణం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. రీ సర్వే ప్రారంభానికి ముందు రెండు విడతలుగా గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించామన్నారు.

గ్రీవెన్స్ ద్వారా ఐదు దరఖాస్తులు

రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ ద్వారా రైతుల నుండి ఐదు దరఖాస్తులు అందాయని తహసీల్దార్ సింగారావు తెలిపారు.

చినగంజాంలో...

చినగంజాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు, డీటీ సుజాత, మండల సర్వేయర్ జీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

యద్దనపూడి మండలంలో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

యద్దనపూడి/మార్టూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సోమవారం యద్దనపూడి మండలంలో పర్యటించారు. ఆయన పార్టీనాయకులతో కలిసి మున్నంగివారిపాలెంలో ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ చెరుకూరి పెద్దనాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిమటావారిపాలెం, తనుబొద్దివారిపాలెం తారురోడ్డును పరిశీలించారు. తరువాత యద్దనపూడి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాంబాబు ఇంటికి వెళ్లి అతనిని పరామర్శించారు. అనంతరం సూరవరపుపల్లిలో ఇటీవల మృతి చెందిన డీఎస్పీ మద్దులూరి రత్తయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. తరువాత గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో గుదే తారకరామారావు, కనపర్తి నాగేశ్వరరావు, కోయ సతీష్, రావిపాటి సీతయ్య, కొర్రపాటి వంశీ, నల్లపనేని రంగయ్యచౌదరి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సోమవారం మార్టూరు మండలంలో ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



మాజీ ఎంపీపీ రాంబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

బల్లికురవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్ చెప్పారు. సోమవారం మండలంలోని అంబడిపూడి, గుంటుపల్లి గ్రామాలను మలేరియా అధికారి పరిశీలించారు. గతంలో డెంగ్యూ జ్వరాలు సోకిన గ్రామాలను పరిశీలిస్తున్నామని, ఈ ఏడాది ఎలాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు చేపడతామని తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామాలను పరిశీలిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది కూడా గ్రామాలలో ఇంటింటా సర్వేలను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం గుంటుపల్లి పీహెచ్‌సీని సందర్శించి వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి రమీజ్‌అహ్మద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలో శ్రీనివాసరెడ్డి ప్రతిభ

చినగంజాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామపంచాయతీ పరిధిలోని సుందరయ్యనగర్ గ్రామానికి చెందిన సూరిన శ్రీనివాసరెడ్డి అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలో మూడో బహుమతి సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన కోనసీమ చిత్రాకళాపరిషత్ ఆధ్వర్యంలో 34వ చిత్రాకళా బ్రహ్మోత్సవం, 35వ అంతర్జాతీయ చిత్రకళాప్రదర్శన 2025లో తృతీయ బహుమతి మెగా బ్రహ్మోత్సవం అవార్డును శ్రీనివాసరెడ్డి అందుకున్నాడు. సంక్రాంతి పండుగ సంబరాలను ప్రతిబింబిస్తూ గీసిన చిత్రానికి మూడో బహుమతి లభించినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీనివాసరెడ్డికి జిల్లా చిత్రకారుల సంఘం అధ్యక్షులు బండారి త్యాగరాజు, కార్యదర్శి అచ్యుతశ్రీనివాస్(మణిఆర్ట్స్)లు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు గ్రంథాలయ రుసుం చెల్లింపు

చీరాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలంలో దేశాయిపేట పంచాయతీ పరిధిలోని వేటపాలెం శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుకునేందుకుగాను హైస్కూల్ విద్యార్థులు 20 మందికి రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య గ్రంథాలయ రుసుంను సోమవారం చెల్లించారు. దీంతో సభ్యత్వ నమోదు కార్డులను గ్రంథపాలకులు ఆ విద్యార్థులకు అందజేశారు. చిన్నప్పటి నుంచి గ్రంథాలయాలకు వెళ్లి చదవటం అలవాటు చేసుకుంటే ఒనగూరే ప్రయోజనాలను వారు వివరించారు.

డీకే పట్టాలు మంజూరు చేయాలి

యద్దనపూడి/మార్టూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గ్రామానికి చెందిన 50 మంది షెడ్యూలు కులాలు వారికి డీకే పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం బాపట్లలో గ్రీవెన్స్‌లో ఆర్డీవో గ్లోరియాకు వినతిపత్రం అందజేశారు. యనమదల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మూడు సర్వేనంబర్లలో సుమారు 20 ఎకరాలు భూమిని షెడ్యూలు కులాలు వారికి పంపిణీ చేయాలని వా రు కోరారు. ఈ కార్యక్రమంలో నలమాల తిరుపతిరావు, కోపూరి వెంకట్రావు, మొలతోటి శేఖర్, విపర్ల అబ్రహం, పల్లెపోగు రాధిక, సౌజన్య, సరోజిని, సరళ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

రూ.9లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

ఇంకొల్లు, జనవరి 20,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు బస్టాండు నుంచి కడవకుదురు రోడ్డుకు వెళ్లే రహదారిలో రూ.9లక్షలతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ ఆనంద్ తెలిపారు. ఈ రహదారిలో నెలరోజుల క్రితం బ్రిడ్జి కుంగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయని, కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఇంకొల్లు పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని పూర్తిగా తొలగించాలని పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లకు సూచించారు.

మందు పిచికారీలో జాగ్రత్త తీసుకోవాలి

లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిభశ్రీ

పంగులూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పైరులో కలుపు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, కలుపు మందు పిచికారీ చేసే సమయంలో నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలని లాం ఫాం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రతిభశ్రీ చెప్పారు. మండలంలోని కొండమూరు, రేణంగివరం గ్రామాలలో కలుపు మందు పిచికారీ కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటను లాం ఫాం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిభశ్రీ, డాక్టర్ దయానాగ్రేస్‌లు సోమవారం పరిశీలించారు. అట్రాజిన్ అనే కలుపు మందు పిచికారీ కారణంగా మొక్కజొన్న పంట పాడైందని రైతులు, వ్యవసాయాధికారి ఇచ్చిన సమాచారం మేరకు సాగులో ఉన్న మొక్కజొన్నను పరిశీలించారు. కలుపు మందు పిచికారీ చేసిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీడీవో భుక్యాశాంతిబాయి అధ్యక్షత వహిస్తారని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

అంతర్ జిల్లా టెన్నిస్ టోర్నీలో గిద్దలూరు క్రీడాకారుల ప్రతిభ

గిద్దలూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జనవరి 18, 19 తేదీలలో పల్నాడు జిల్లా నర్సరావుపేటలో జరిగిన అంతర్ జిల్లా టెన్నిస్ టోర్నమెంటులో గిద్దలూరు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు పి.వి.రావు, తిరుపతిరెడ్డిలపై గిద్దలూరు క్రీడాకారులు కె.కోటయ్యగౌడ్, శశిభూషన్‌రెడ్డి 7-2 స్కోరుతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. కంభం ప్రాంతానికి చెందిన అశోక్‌దత్తు రన్నర్స్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజేతలను లాన్‌టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి అభినందించారు. గిద్దలూరు లాన్‌టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.రంగారెడ్డి విజేతలకు అభినందనలు తెలిపారు.

నారాయణరెడ్డికి అవార్డు

గిద్దలూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణానికి చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి సావిత్రిబాయి జ్యోతిరావుపూలె ఐకాన్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ 5వ వార్షికోత్సవం సందర్భంగా అవార్డు ఫంక్షన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సరోజమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్, సినినటులు మాణిక్యరావు, జ్యోతిస్వరూప్, డాక్టర్ సరోజమ్మల చేతుల మీదుగా నారాయణరెడ్డి అవార్డు అందుకున్నారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి జ్యోతిరావుపూలె ఐకాన్ అవార్డు 2025కు తీసుకోవడం పట్ల ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డును పలురకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ఇచ్చారు. ముఖ్యంగా అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం, పేదవారికి మిగులు భోజనం ఏర్పాటు చేయడం, చెట్లు నాటే కార్యక్రమం, ప్రకృతి వ్యవసాయం గురించి అవగాహన కల్పించడం కోసం ఈ అవార్డును అందిస్తున్నారు. నారాయణరెడ్డిని గిద్దలూరు ప్రాంతానికి చెందిన డాక్టర్ ఖాదర్‌వలి, మున్నంగి, చిన్నసుబ్బారెడ్డి, బిజెపి నాయకులు సరస్వతి, సింగర్ తమన్నముదిరాజ్, దివ్యా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు లొక్కు శరత్ అభినందించారు.

ఏజీ-బీఎస్సీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి మార్గదర్శకాలు

అమరావతి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం జారీ చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి బీ) సీట్లును భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ (హానర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో నింపాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45 శాతానికిపైన మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ,ఎస్సీ,ఎస్టీలకు 40శాతంపైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

వెయిట్ లిఫ్టింగ్‌లో మహేష్‌కు వెండిపతకం

ఒంగోలు విద్య, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో జిల్లా విద్యార్థి ఎన్. మహేష్ వెండి పతకం సాధించాడు. పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీలో జరిగిన జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సీఎస్‌పురంలోని బెల్లంకొండ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న మహేష్ పాల్గొని తన ప్రతిభను ప్రదర్శించి వెండి పతకాన్ని సాధించాడు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరుపున జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్న మహేష్ 73 కేజీల విభాగంలో విజేతగా నిలిచారని యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ దేవీ వరప్రసాద్ తెలిపారు. వెండిపతకం సాధించిన మహేష్‌ను యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ డీవీఆర్‌మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, కళాశాల ఛైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, కరస్పాండెంట్ ఎం. శ్రీనివాసులు అభినందించారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీలో మహేష్

సొసైటీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె



ధర్నాలో పాల్గొన్న కాలం సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె చేసేందుకైనా వెనుకాడేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా అధ్యక్షుడు వి. మనోజ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ధర్నాలో సుబ్బారావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం నుంచి సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీని అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. 2019లో ఇవ్వాల్సిన పీఆర్‌సీని ఇంత వరకు అమలు చేయకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే సహకార ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, జి. శేషయ్య, కార్తీక్ రెడ్డి, రామిరెడ్డి, కృష్ణచైతన్య, వీరబ్రహ్మం, రమణారెడ్డి. రమేష్, శ్రీనివాసరావు, రంగయ్య, ప్రసాదరావు, పవన్‌కుమార్, సందీప్, సతీష్, బాలాజీ తదితరులు ఉన్నారు. అనంతరం నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు.

ఇతర రాష్ట్రాల పంటలు సాగు చేస్తూ..

కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పండించే పండ్లను కొన్నింటినీ ముండ్లమూరు మండలంలో శంకరాపురం, మారెళ్ల, పసుపుగల్లుతో పాటు చింతలపూడి, బొప్పూడివారిపాలెం, కెల్లంపల్లి గ్రామాల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. మారెళ్లలో నేరేడు, సీతాఫలం, డ్రాగెన్ ఫ్రూట్స్, పీఎస్ఆర్ జామ, పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. పసుపుగల్లులో సీతాఫలం, జామ, కెల్లంపల్లిలో జామ, దానిమ్మ లాంటి పండ్ల తోటలు సాగు చేశారు. రెండు సంవత్సరాల నుంచి పండ్ల తోటలు సాగు చేసిన రైతులకు లాభాలు రావటంతో ఈ ఏడాది కొత్తగా ఎక్కువ మంది రైతులు పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. మహారాష్ట్ర, కర్నాటకలో ఎక్కువగా పండే నేరేడు, సీతాఫలం పండ్ల తోటలను కూడా ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేశారు. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండగా సీతాఫలం మాత్రం కోయటానికి సిద్ధంగా ఉంది. దిగుబడులు కూడా ఆశాజనకంగా వచ్చే అవకాశాలు కనపడుతున్నాయి. దీంతో వచ్చే ఏడాది ఇంకా ఎక్కువ మంది రైతులు పండ్ల తోటలు సాగు చేసేందుకు ఇప్పటి నుంచే సిద్ధ పడుతున్నారు. సహజంగా ఎక్కువ మంది రైతులు వ్యవసాయ బోర్ల కింద వరితో పాటు మిర్చి, పొగాకు, పత్తి సాగుచేసే రైతులు సైతం ఆ పంటలకు స్వస్తి చెప్పి పండ్ల తోటల వైపు మొగ్గు చూపారు. మండలంలో పలు గ్రామాల్లో బత్తాయి, నిమ్మతోటలు గత దశాబ్దంన్నర కాలంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వాటికి తోడుగా వివిధ రకాలైన పండ్ల తోటలు సాగు చేశారు. పండ్ల తోటలు సాగు చేసిన రైతులు బిందు సేద్యం ద్వారా పండిస్తున్నారు. మెట్ట పొలాల్లో సైతం వ్యవసాయ బోర్లు వేసి 2014 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం పండ్ల తోట రైతులను ప్రోత్సహిస్తూ వారికి 90 శాతం సబ్సిడీపై డ్రిప్‌లు అందజేయటంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, లాభాలు వచ్చాయి. దీంతో రైతులు పండ్ల తోటలపై మక్కువ చూపుతున్నారు. బత్తాయి 93 ఎకరాల్లో, నేరేడు 28 ఎకరాలు, సీతాఫలం 20 ఎకరాల్లో, డ్రాగెన్ ఫ్రూట్స్ 35 ఎకరాల్లో, వీఎస్ఆర్ జామ 11, హైబ్రీడ్ జామ 25 ఎకరాల్లో సాగు చేశారు.

ముండ్లమూరు మండలంలో పలు గ్రామాలకు చెందిన రైతులు సంప్రదాయ పంటలు సాగుచేసి నష్టాలు మూట గట్టుకోవటమేకాక ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక ఇబ్బందుల పాలై ఉద్యానవన పంటలవైపు మరలుతున్నారు. వారు కొత్త తరహాలో పంటలను సాగుచేసి రెండేళ్లుగా లాభాలు గడిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సాధించాలన్న ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. మన రాష్ట్రానికి కొత్తయిన పంటలను పండిస్తున్నారు. ప్రధానంగా పండ్లతోటలపై మక్కువ చూపుతున్నారు.



మారెళ్లలో రైతు సాగు చేసిన డ్రాగెన్ ఫ్రూట్స్ పండ్ల తోట

సిరులు పండుతున్నాయ్!

- ముండ్లమూరు మండలంలో విస్తారంగా పండ్ల తోటలు
- డ్రాగన్ ఫ్రూట్, నేరేడు, సీతాఫలం, జామ, దానిమ్మ సాగు
- ఇతర రాష్ట్రాల్లో చూసి అదే తరహాలో పండిస్తున్న రైతులు
- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందుతున్న కర్షకులు



మారెళ్ల వద్ద యాపిల్‌బేర్ కాపును చూపుతున్న యువ రైతు మండలపు మాధవరావు

ముండ్లమూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మొత్తం 3,187 ఎకరాల్లో పండ్ల తోటలు, కూరగాయల సాగు, పూల తోటలు, మిరప, కరివేపాకు సాగు చేస్తున్నారు. బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, నేరేడుతో పాటు వివిధ రకాల పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. మారెళ్ల, ముండ్లమూరు, చంద్రగిరి, జమ్మలమడక, పూరిమెట్ల, నాయుడుపాలెం గ్రామాల్లో బత్తాయి, సపోట పండ్ల తోటలను కూడా రైతులు సాగు చేశారు. బత్తాయి, దానిమ్మ గత దశాబ్ద కాలానికిపైగా సాగు చేస్తున్నారు. కొత్త తరహా పండ్ల తోటలు నేరేడు, డ్రాగెన్ ఫ్రూట్స్, సీతాఫలం, వీఎస్ఆర్ జామ పంటలు మాత్రం రెండు సంవత్సరాల నుంచి సాగుచేసి రైతులు లాభాలు గడిస్తున్నారు. దిగుబడితో పాటు లాభాలు వస్తుండటంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు పండ్ల తోటలపై దృష్టి పెట్టారు. మండలంలో పండ్ల తోటలు 168 ఎకరాలు, కరివేపాకు 40 ఎకరాలు, కూరగాయలు 16 ఎకరాలు, ఎండు మిరప 2,961 ఎకరాలు సాగు చేశారు.



పసుపుగల్లు వద్ద సాగు చేసిన సీతాఫలం



రైతు రంగనాయకులు

ఎనిమిదేళ్లుగా బత్తాయి తోట సాగు చేస్తున్నాను

ఎనిమిదేళ్లుగా బత్తాయి సాగు చేస్తున్నాను. మొదట దిగుబడితో పాటు లాభాలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం ఖర్చుతో కూడిన పని అయినా పండ్ల తోటలపై మక్కువతో బత్తాయి సాగు చేస్తున్నాను. ఇతర పంటలు సాగు చేసి అనేకసార్లు నష్టపోయాం. పండ్ల తోటలే మేలనుకొని సాగు చేస్తున్నాను.

- గుంటుపల్లి రంగ నాయకులు, రైతు, ముండ్లమూరు

లాభాలు బాగున్నాయి



రెండు సంవత్సరాల నుంచి డ్రాగెన్ ఫ్రూట్స్ పండిస్తున్నా. దిగుబడి బాగుంది. ధరలు కూడా బాగా ఉండటంతో ఆశించిన మేర లాభాలు వచ్చాయి. వచ్చే ఏడాది మరింత సాగు చేయాలనుకుంటున్నా.

- పాశం వెంకటేశ్వరరావు, డ్రాగెన్ ఫ్రూట్స్ రైతు, మారెళ్ల

కొత్త పండ్ల తోటలకు శ్రీకారం చుట్టాం



ఇతర రాష్ట్రాల్లో పండించే పంటలను చూసి కొత్తగా పది ఎకరాల్లో సీతాఫలం పండ్ల తోటలను సాగు చేశాను. ప్రస్తుతం తోటలు ఆశాజనకంగా ఉన్నాయి. మరో ఆరు నెలలు ఆగితే పంట దిగుబడి వస్తుంది. ఒక్క సీతాఫలమే కాక కొత్త తరహా పండ్ల తోటలను సాగు చేయాలనుకుంటున్నా.

- చింతా శ్రీనివాసరెడ్డి, రైతు, పసుపుగల్లు

పండ్ల తోటల రైతులను ప్రోత్సహిస్తాం



పండ్ల తోటలను సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నాం. ప్రభుత్వపరంగా రాయితీలు అందిస్తున్నాం. ఇప్పటికే ముండ్లమూరు మండలంలో బత్తాయి, దానిమ్మ, బొప్పాయితోపాటు డ్రాగెన్ ఫ్రూట్స్, సీతాఫలం, నేరేడు, రేగి లాంటి పంటలను పలు గ్రామాల్లో సాగు చేశారు. వచ్చే రెండేళ్లలో ఎక్కువ మంది రైతులను పండ్ల తోటలను సాగు చేసేందుకు తయారుచేస్తున్నాం.

- రవి వెంకన్నబాబు, ఉద్యానవన శాఖ అధికారి, దర్శి

పశుగణాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి
- కనిగిరిలో గొర్రెల మండి ప్రారంభం



గొర్రెల మండిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పశుగణాభివృద్ధికి ప్రభుత్వం చేయూత ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని పొదిలి రోడ్డులో గొర్రెల మండి ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లాలో అత్యధికంగా గొర్రెలు, మేకల పెంపకంచేస్తూ లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. అందులో ప్రశ్చిమప్రాంత ప్రకాశం జిల్లాలో కనిగిరి నియోజకవర్గంలో ఐదు లక్షలకుపైగా గొర్రెలు, మేకలు ఉన్నాయన్నారు. వాటి పోషణే అధారంగా ఎన్నోవేల కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. తాను 2009లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కనిగిరి ప్రాంతంలో గొర్రెల పెంపకం దారులకు చేయూత అందించినట్టు చెప్పారు. ఆక్రమంలో గొర్రెలను పోషించుకుంటూ పరాయి ప్రాంతాలకు తమ జీవాలను అమ్ముకునేందుకు వీలుగా సంత (గొర్రెల మండి) ప్రారంభించినట్టు చెప్పారు. అందుకోసం ప్రత్యేకంగా షెడ్లు, బోరు వేయించినట్లు చెప్పారు.

గత వైసీపీ ప్రభుత్వంలో గొర్రెల మండిని పూర్తిగా విస్మరించారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ధ్వజమెత్తారు. గొర్రెల పెంపకందారులకు నష్టం కల్గించారన్నారు. ప్రస్తుతం చాలామంది పోషకులకు అమ్మకం ద్వారా సరైన గిట్టుబాటు రాక, పెంచిన జీవాలు అనారోగ్యంతో మృత్యువాత పడుతూ నష్ట పోతున్నారన్నారు. తాను మళ్ళీ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తిరిగి గొర్రెల మండి ప్రారంభించినట్టు చెప్పారు. గొర్రెల పెంపకందారుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గొర్రెలమండి అభివృద్ధితో పాటు కనిగిరిలో మాంసం ఫ్యాక్టరీని నెలకొల్పి ఎగుమతి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ బేబిరాణి, వెటర్నరీ ఏడీఏ శ్రీనివాసరెడ్డి, అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణంపై సమీక్ష

- మంగళగిరి ఏపీ మారిటైం బోర్డు కార్యాలయంలో సమావేశం



సమావేశంలో పాల్గొన్న మంత్రి జనార్దన్, దామచర్ల సత్య, అధికారులు

కొండపి, జనవరి20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫేజ్-2 కింద ఆరు చోట్ల తక్కువ ఖరీదుతో ఈపీసీ పద్ధతిలో (పూర్తిగా కాంట్రాక్టరే పూర్తి చేసేవిధంగా) ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణంపై సమీక్ష జరిగింది. రాష్ట్ర ఆర్అండ్‌బీ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్, ఏపీ మారిటైంబోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరిలోని ఏపీ మారిటైంబోర్డు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. పెదగంజాం వద్ద నౌకాశ్రయం నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై సమీక్షించారు. ప్రస్తుతం పోర్టు వద్ద ఉన్న గోడౌన్‌ల దీర్ఘకాలిక లీజులు, తాత్కాలిక లీజులు, లీజుల పొడిగింపుపై సమీక్షించారు. పులికాట్ సరస్సు ముఖద్వారం తెరవడానికి కావాల్సిన నిధుల సమీకరణపై కూడా సమీక్షించారు. సమావేశంలో ఏపీ మారిటైంబోర్డు ఛైర్మన్ సత్య, ఆశాఖ అధికారుల ప్రతిపాదిత అంశాలపై మంత్రి జనార్ధన్ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో మారిటైంబోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, సీఎఫ్‌వో డోలా శంకర్, మారిటైంబోర్డు చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు, కాకినాడ పోర్టు ఆఫీసర్ ధర్మశాస్త్ర, సంబంధిత ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్‌ను మారిటైంబోర్డు తరుపున ఛైర్మన్ సత్య, అధికారులు సన్మానించారు.

సేవా కార్యక్రమాలతో వేడుక

- జన్మదినోత్సవం సందర్భంగా జీజీహెచ్‌కు వీల్‌చైర్లు బహూకరణ
- అభిమానుల మధ్య కేక్ కట్ చేసి ఎమ్మెల్యే దామచర్ల



ట్రస్టు ద్వారా తోపుడు బండ్లను అందిస్తున్న జనార్దన్



రిమ్స్ ఆస్పత్రికి వీల్‌చైర్స్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ జన్మదినం సందర్భంగా సోమవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దామచర్ల పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. జీజీహెచ్‌కు స్ట్రెక్చర్‌లు, వీల్ ఛైర్స్ బహూకరించారు. పార్టీ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో ఆయన అభిమానుల ఆప్యాయతల మధ్య కేక్‌కట్ చేసి, సంతోషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జనార్దన్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నేరుగా కలిసి పుష్పగుచ్ఛం అందించడంతోపాటు, పలువురు శాలువాలు కప్పి సత్కరించారు. టీడీపీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను దామచర్ల కట్ చేశారు. ఉదయం తూర్పు నాయుడు పాలెంలోని తన స్వగృహంలో తల్లిదండ్రుల ఆశీస్సులు తీసుకున్న జనార్దన్ దంపతులు, అనంతరం వల్లూరమ్మ దేవస్థానంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అర్ధరాత్రి టీకే ఎన్‌క్లేవ్‌లో కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసిన దామచర్ల సోమవారం ఉదయం నుంచి అభిమానుల రాకతో అటు దామచర్ల నివాసం, ఇటు పార్టీ కార్యాలయం కిక్కిరిసిపోయింది.

టైరు పగిలి కూలీల ఆటో బోల్తా

- 14 మందికి గాయాలు



అంబులెన్స్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాదానికి గురైన ట్రాలీ ఆటో

త్రిపురాంతకం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కూలీలతో వేగంగా వెళుతున్న నాలుగు చక్రాల ఆటో టైర్ పగలడంతో బోల్తాపడింది. దీంతో పద్నాలుగు మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని దీవేపల్లి వద్ద జాతీయ రహదారి 544డిపై సోమవారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా మంత్రాలయం నుండి నాలుగు చక్రాల ట్రాలీ వాహనంలో వ్యవసాయ పనుల కోసం 31 మంది కూలీలు పల్నాడు జిల్లాకు వెళుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదం చోటుచేసుకొంది. ఈప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108, హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను మార్కాపురం వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్ర గాయాలైన వారిలో తలారి జ్యోతి, దొడ్డి భీమేష్, పి.గుండమ్మలను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

నయన మనోహరంగా కృష్ణవేణి చరితం



కృష్ణవేణి చరితం నృత్యరూపకంలో ఒక దృశ్యం

ఒంగోలు కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రదర్శిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలలో భాగంగా సోమవారం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఇందులో భాగంగా సాయంత్రం పునుగోడుకు చెందిన మంజునాథ నాదస్వర బృందంతో నాదస్వర కచ్చేరి, వినుకొండ, ఈదర గ్రామాలకు చెందిన 36 మంది మహిళలతో కోలాట ప్రదర్శన జరిగాయి. శ్రీ లక్ష్మీనారాయణ కోలాట బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో పలు జానపద, పల్లెగీతాలకు మహిళలు చక్కటి హావభావాలతో కోలాటాన్ని ప్రదర్శించారు. అనంతరం ఒంగోలు చందు డాన్స్ అకాడమికి చెందిన విద్యార్థులు శ్రీ కృష్ణవేణి చరితం నృత్యరూపకాన్ని నయన మనోహరంగా ప్రదర్శించారు. అకాడమీ నిర్వాహకులు త్రోవగుంట చందు పర్యవేక్షణలో ప్రదర్శితమైన ఈ నృత్య రూపకంలో 30 మంది విద్యార్థులు కథాంశానికి అనుగుణంగా నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకున్నారు. కార్యక్రమాలను కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు పర్యవేక్షించి మాట్లాడారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడారు. అనంతరం ఆయన కోలాట ప్రదర్శన బృందానికి ప్రదర్శన పారితోషికాన్ని, జ్ఞాపికను అందజేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కలికివాయికి చెందిన సాయినాథ నాదస్వర బృందంచే నాదస్వర కచ్చేరి, 5 గంటలకు కోలాట ప్రదర్శన, రాత్రి 7 గంటలకు విజయవాడ దృశ్యవేదిక వారిచే కనక పుష్యరాగం సాంఘిక నాటకం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు

గిద్దలూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మస్కట్‌లో కడప వాసి మృతిపై ఎక్స్ ద్వారా మృతదేహాన్ని తెప్పించాలని విజ్ఞప్తి చేయగా మంత్రి లోకేశ్ చొరవ చూపారు. మృతదేహాన్ని త్వరితగతిన దేశానికి తెప్పించి మానవత్వం చాటుకున్నారని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరూఖ్‌సిబ్లి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

అవీ..ఇవీ


ఉల్లాస్‌పై మాట్లాడుతున్న వయోజనవిద్య సూపర్ వైజర్ జ్యోతి

గ్రామాలలో నూరు శాతం అక్షరాస్యత సాధించాలి

ఒంగోలు(రూరల్), జనవరి20 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నూరు శాతం అక్షరాస్యత సాధించాలని వయోజన విద్య సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. ఒంగోలు మండల వెలుగు కార్యాలయంలో సోమవారం డ్వాక్రా గ్రూపు వీవోఏలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాలలో విద్యకు దూరంగా ఉన్న 60 సంవత్సరాల లోపు వారికి తెలుగులో రాయటం, చదవటం, చిన్నపాటి లెక్కలు తెలుసుకోవటం లాంటి వాటిపై శిక్షణ ఇవ్వాలన్నారు. వయోజన విద్యాకేంద్రాలను సాయంత్రం 4నుంచి 8గంటల లోపు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎం.విజయమ్మ, ఏపీఎం బలగాని శ్రీనివాసప్రసాదు, వీవోఏలు, వలంటీర్‌లు పాల్గొన్నారు.


వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మినీస్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక మినీస్టేడియంలో జరిగిన ప్రథమ సర్వసభ్య సమావేశంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మస్తాన్‌రావు పెసల, ఉపాధ్యక్షుడిగా ఆర్. రమాదేవి, కార్యదర్శిగా ఎస్. అప్పలరాజు, ఉప కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్, కోశాధికారిగా ఎన్. రాధాకృష్ణమూర్తి, గౌరవ సలహాదారులుగా ఎం. విజయలక్ష్మి, వీవీ. సుజాతారావు, ఎన్. పున్నయ్యలను ఎన్నుకున్నారు. సభ్యులుగా ఎస్. రాజేశ్వరరావు, ఎన్. ప్రభావతి, వి. రమణారెడ్డి, ఎ. జ్యోతి, టి. బలరాం రెడ్డి, ఎస్ విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కేవీపీఎస్ రాష్ట్ర వర్క్‌షాపును విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో వచ్చేనెల 14,15 తేదీల్లో జరగనున్న కేవీపీఎస్ రాష్ట్ర వర్క్‌షాపును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురాం, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

తైక్వాండోలో జాతీయస్థాయికి ఎంపిక

ఒంగోలు(విద్య), జనవరి20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు - కొప్పోలు రోడ్డు డ్రీమ్స్ స్కూల్‌కు చెందిన విద్యార్థి షేక్ అబ్దుల్ ముజీర్ కిడ్స్ విభాగంలో జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యాడు. గుంటూరు జిల్లా రేపల్లెలో జరిగిన కిడ్స్ చాంపియన్స్ ఆఫ్ కోర్యోగి విభాగం (తైక్వాండో) పోటీలలో ఈ విద్యార్థి బంగారుపతకం సాధించాడు. విద్యార్థిని డ్రీమ్స్ స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన

మద్దిపాడు, జనవరి20(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు సహకరించాలని మద్దిపాడు ఎస్సై శివరామయ్య అన్నారు. సోమవారం ట్రాక్టర్ డ్రైవర్లకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాలీ డోరు తెరచి ప్రయాణం చేయకూడదని, పచ్చాకు కూలీలు ట్రాక్టర్‌పై కూర్చోకూడదని అన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన సూచించారు.

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

టంగుటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు అరుంధతీనగర్‌లోని సామాజిక భవనంలో ఉచిత ట్యూషన్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. స్థానికుల సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు బక్కా సుదర్శన్‌బాబు, గర్నిపూడి సుధీర్‌బాబు, కొమ్ము భానుచందర్, చావల శ్యాంసంగ్, శ్రీకాంత్, కొమ్ము ఉదయ్, గర్నిపూడి బ్రహ్మయ్య, తలారి కోటేశ్వరరావు, జల్లి నవీన్ శిఖాకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన సీఐ

పొన్నలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పొన్నలూరు పోలీస్ స్టేషన్‌ను కొండపి సీఐ జి.సోమశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన విచారించాలని ఎస్సై అనూక్‌ను ఆదేశించారు. బెల్టుషాపులను అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని సూచించారు. రాత్రిపూట గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

టంగుటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్లపాడులో నడుస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద రూ27,440 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

అభిమానుల మధ్య అట్టహాసంగా...

ఘనంగా జనార్దన్ జన్మదిన వేడుకలు
టీడీపీ కార్యాలయంలో సందడి వాతావరణం

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తమ అభిమాన నాయకుడు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల దంపతులకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. వల్లూరమ్మ గుడిలో ప్రత్యేక పూజల అనంతరం అధికసంఖ్యలో కార్లు ఏర్పాటు చేసి, కాన్వాయ్‌తో ఒంగోలులోని పార్టీ ఆఫీస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచే వందలాదిమంది అభిమానులు అక్కడికి చేరుకోగా అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. దీంతో పార్టీ కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. దామచర్లకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు విచ్చేసిన వారితో కార్యాలయం కళ కళలాడింది. పార్టీ నాయకులు వలవర్తి శేషం రాజు, నరిశెట్టి భాను, ఎన్ఆర్ఐ కేసీ చెరుకూరి, మండువ మురళీకృష్ణ, దుగ్గినేని వెంకట్రావు, అబ్బూరి నవీన్ కుమార్, ఆలా హనుమంతరావు, పావులూరి బాపయ్య చౌదరి, కాట్రగడ్డ రఘపతి రావు, పావులూరి నాగేశ్వరరావు, వీరగంధం దేవేంద్రనాథ్ చౌదరి, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, నల్లూరి రవి, కిలారి కొండపనాయుడు, బండారు మదన్, ఎస్. వెంకట్, మాలెంపాటి కృష్ణారావు, రావిపాటి శ్రీనివాసరావు, నాదెండ్ల శ్రీనివాసరావు, కరిచేటి సుధాకర్, యడ్లపల్లి పోతూలరయ్య, మన్నం వీరరాఘవ, ఎస్. అల్లూరయ్య, పల్లపోతు దుర్గాప్రసాద్, పమిడి రవితేజ, అల్లూరు టీడీపీ ఇన్‌చార్జి పాటిబండ్ల సుధాకర్ బాబు, లింగంనేని వెంకటరామయ్య, శ్యామల కాశిరెడ్డి, మేడికొండ మోహన్ రావు, గుమ్మళ్ళ సుబ్బారావు, దామచర్ల నరసింహారావు, సోమినేని రవిచంద్ర, 37వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణు, ప్రసాద్, చాగంటి శ్రీహరి, శింగమనేని కృష్ణ, గాదె శివాజి రెడ్డి, శింగమనేని తేజ సుధాచరణ్, బొర్రా సురేష్ బాబు, సింగమనేని చంద్రశేఖర్‌రావు, వీరపనేని వెంకన్న చౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, చుండూరి రఘురామ్, పాలపర్తి లక్ష్మీనారాయణ, పాలపర్తి సురేంద్ర, పిడికిటి వెంకటేశ్వర్లు, పిల్లుట్ల సుధాకర్‌రావు, పెద్దిశెట్టి చంద్ర, పెద్దిశెట్టి వరలక్ష్మి, జి. నాగిరెడ్డి, వేమూరి కొండలరావు, పి. గోపిచంద్, పాటిబండ్ల అజయ్ బాబు, మండవ గోపిచంద్, దేవబత్తిన ప్రసాదరావు, చింతల శ్రీనివాసరావు, చుండూరి రఘురామ్, మండువ వెంకటసుబ్బయ్య, మారెళ్ల రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, శ్రీధర్ బాబు, కోమటనేని ఉదయ్ భాస్కర్, పావులూరి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి రమాదేవి, మద్దిన రవికిరణ్, నిడదాల ఆంజనేయులు, మన్నం శ్రీనివాసరావు, మండువ రాఘవరావు, పోలవరపు వెంకటరామయ్య, కామేపల్లి శ్రీనివాసరావు, నార్నె శ్రీనివాస్, షేక్ పిచ్చా సాహెబ్ జనార్దన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


జన్మదినోత్సవం సందర్భంగా జనార్దన్‌కు బుద్ధుని విగ్రహాన్ని అందజేస్తున్న జిల్లా కమ్మవారి సేవా సంఘం సభ్యులు


బొకే ఇస్తున్న పమిడి రమేష్, మోహన్,రాజు


దామచర్లకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పల్లపోతు దుర్గాప్రసాద్



దామచర్లతో కేక్‌కట్ చేయిస్తున్న మాలెంపాటి కృష్ణారావు తదితరులు


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నేతలు

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

● రైతు సంఘాల నేతల డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంట ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉత్పత్తులకు డాక్టర్ స్వామినాథన్ సూచించిన విధంగా ధరలు నిర్ణయించాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం నిరవధిక దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం రోజు రోజుకు క్షీణిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరిచాలని పార్లమెంట్ సభ్యులకు వినతిపత్రాలను ఈమెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు చుండూరి రంగారావు, దడాల సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎంఎస్ సాయి, వడ్డె హనుమారెడ్డి, జి. పద్మ, పమిడి వెంకటరావు, బాలకోటయ్య, లలితకుమారి, పరిటాల కోటేశ్వరరావు, కోడూరి నాంచార్లు, యు. ప్రకాశరావు, జే జయంతిబాబు, చీకటి శ్రీనివాసరావు, పిన్నిక శ్రీనివాసరావు, లింగా అంజనేయులు, పోలవరపు సీతారామయ్య, గద్దెల శ్యాంసన్ తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ధర్నాకు కొత్తకోట వెంకటేశ్వర్లు, విద్యుత్ రీడర్స్ యూనియన్ కార్యదర్శి సిద్దయ్యలు అధ్యక్షత వహించారు. ధర్నాలో రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో గత 15 ఏళ్ళనుంచి 250 మంది మీటర్‌రీడర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తెచ్చిన స్మార్ట్ మీటర్ల విధానం వల్ల వారి ఉపాధి దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర నాయకులు శ్రీరామ శ్రీనివాసులు, శివారెడ్డి, అనిల్‌కుమార్, సతీష్‌కుమార్, బి. నారాయణ, శ్రీను తదితరులు ఉన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

● కలెక్టర్ అన్సారియా


మీకోసంలో అర్జీదారుల సమస్యపై మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్కఅర్జీపై ప్రత్యేక శ్రద్ధపెట్టి, వాటికి సమర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అధికారులు రోజూ లాగిన్ అయ్యి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలని, అలాగే వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా జిల్లా అధికారులకు 320 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, విజయజ్యోతి, కుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

● ఆక్రమణలు తొలగించి రక్షణ కల్పించాలని నాలుగున్నర పాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన కొలకలూరి రమేష్ కోరారు. నాలుగున్నర అడుగుల పంచాయతీరోడ్డును ఆక్రమించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందువల్ల ఆ ఆక్రమణలు తొలగించి న్యాయం చే యాలని కలెక్టర్‌కు విన్నవించారు.

● ఒక ఉపాధ్యాయుడి రోస్టర్ పాయింట్‌పై ఇంత వరకు జిల్లా విద్యాశాఖాధికారి నివేదిక ఇవ్వలేదని బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొటికలపూడి జయరాం ఫిర్యాదు చేశారు.

● సంతనూతలపాడు వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడుకు చెందిన కుంచాల వీరబ్రహ్మయ్య కోరారు. వ్యవసాయ మార్కెట్‌లో ఇష్టారీతిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు చేసి భారీ అక్రమాలకు పాల్పడ్డారని, వాటన్నింటిపై సమగ్ర విచారణ చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

● ఏస్పీ ఏఆర్ దామోదర్ ● గ్రీవెన్స్‌లో 81 అర్జీలు

ఒంగోలు క్రైం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): ప్రజలనుంచి వచ్చిన ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని ఎస్పీ ఏఆర్ .దామోదర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో జిల్లా నలుమూల నుంచి 81 మంది తమ ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

● తన కుమారుడికి యూనివర్శిటీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కృష్ణాజిల్లాకు చెందిన ఒక వ్యక్తి రూ.3.45 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని తాళ్లూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు.

● కొండపి మండలానికి చెందిన ఐదుగురు వ్యక్తులు దర్శి సమీపంలో చేపల చెరువులను లీజుకు ఇప్పిస్తామని స్థానిక భాగ్యనగర్‌కు చెందిన ఒక వ్యక్తి వద్ద రూ.13.10 లక్షలు తీసుకొని మోసం చేశారని బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ఇలా అనేక రకాల ఫిర్యాదులు ఎస్పీకి విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీకాంత్‌బాబు, సూర్యనారాయణ, దేవప్రభాకర్, పాండురంగారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల లక్ష్యాలను పూర్తి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులలో లేబర్ బడ్జెట్ లక్ష్యాలు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కందకాల తవ్వకాలు, నీటి వనరులలో పూడిక తీత పనులు, అమృత్ సరోవర్ పథకం కింద చెరువుల అభివృద్ధి, పశుపోషకులకు గోకులం షెడ్డుల నిర్మాణాలను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా పనుల పురోగతిని ఏపీవోలు నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఉపాధి పనులను వేగవంతం చేసేందుకు ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉన్నందున ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. మీ కోసం కార్యక్రమంలో వస్తున్న అర్జీలలో పంచాయతీరాజ్‌శాఖకు చెందినవి రెండో స్థానంలో ఉన్నట్లు తెలిపారు. అర్జీలను పరిష్కరించడంలో పంచాయతీ సెక్రటరీలు, ఈవోఆర్డీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హౌసింగ్ పథకంలో భాగంగా మార్చి ఆఖరులోపు 3,594 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కాపురం అర్బన్, పొదిలి, పుల్లలచెరువు, వైపాలెం, ఒంగోలు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. ఆ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ సేవా సర్వీసులకు సంబంధించి వచ్చిన డబ్బులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు జోసఫ్‌కుమార్, చిరంజీవి, వెంకటేశ్వర్లు, వెంకట నాయుడు, శ్రీనివాస ప్రసాద్ తదితరులు ఉన్నారు.


క్రికెట్ విజేతకు బహుమతి అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కుమార్, సీఐ సోమశేఖర్ తదితరులు

టెన్నిస్ బాల్ క్రికెట్ విజేత కారుమంచి

కొండపి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ కొండపి నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో కారుమంచి జట్టు విజయం సాధించింది. కొండపి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. గొడుగుపాలేనికి చెందిన తలైవార్ జట్టు తృతీయ స్థానం సాధించింది. సోమవారం ఏర్పాటు చేసిన ముగింపు సభలో విజేతలైన జట్లకు వరుసగా రూ.50,116, రూ.30,116, రూ.15,116 డిప్యూటీ కలెక్టర్ ఎ.కుమార్, తహసీల్దార్ పి.మురళి, సీఐ జి.సోమశేఖర్ అందజేశారు. కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, ఎన్ఆర్‌కే యూత్ అధ్యక్షుడు, పోటీల నిర్వాహకుడు నేతి రవికుమార్ పాల్గొన్నారు.

కనిగిరి డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

ఒంగోలుక్రైం, జనవరి20 (ఆంధ్రజ్యోతి): కనిగిరి డీఎస్పీగా పి.సాయిఈశ్వర్ యశ్వంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు.

ఎస్పీని కలిసిన విజిలెన్స్ అదనపు ఎస్పీ

జిల్లా విజిలెన్స్అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీగా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను ఎస్పీ కార్యాలయంలో కలిసి బొకే అందజేశారు.

భూముల రీసర్వే ప్రారంభం

చీమకుర్తి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవరపాలెం గ్రామంలో భూముల రీసర్వే పనులను సోమవారం ప్రారంభించారు.రీసర్వేకు చెందిన గ్రౌండ్ ట్రూత్ఇంగ్ పనులను తహసీల్దార్ బ్రహ్మయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు,గ్రామ నాయకులు పాల్గొన్నారు.


సర్వే పనులను ప్రారంభిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

కొలచనకోటలో..

మద్దిపాడు :మండల పరిధిలో భూముల రీ సర్వే కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. మండలంలో వీఆర్వో, వీఆర్ఏలు ఒక టీంగా ఉండేవిధంగా మొత్తం ఐదు టీములను ఏర్పాటుచేశారు. కొలచనకోట గ్రామంలో రీ సర్వే నిర్వహించారు. సర్వేను మండల సర్వేయర్ అంజనా దేవి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రఫి పర్యవేక్షించారు.

విశాఖ ఉక్కు ఆంధ్రకు మణిహారం : బీఎన్

సంతనూతలపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కుకర్మాగారం యావత్ ఆంధ్రకు మణిహారమని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ఉక్కుకర్మాగారానికి ఎన్డీఏ ప్రభుత్వం పునరుజ్జీవం పోసేందుకు అన్ని విధాలుగా సహకరిస్తుందని ఆయన తెలిపారు. నేడు సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్ని గట్టెక్కిస్తున్న ఘనత టీడీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్నారు.

పొగాకు రైతులకు పట్టల పంపిణీ

కొండపి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బేలు పట్టల పంపిణీని సోమవారం స్థానిక వేలం కేంద్రంలో సూపరింటెండెంట్ జి.సునీల్‌కుమార్ ప్రారంభించారు. తొలిరోజు పది మంది రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సభ్యుడు బొడ్డపాటి బ్రహ్మయ్య, వేలం కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా అక్షరాస్యతతో అభివృద్ధి

నాగులుప్పలపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి):: మహిళల సంపూర్ణ అక్ష్యరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ నలమలపు అంజమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో ఎంపీడీవో వై.మహాలక్ష్మి అధ్యక్షతన ఉల్లాస్ (వయోజన విద్య) బోధనపై శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నూరు శాతం మహిళాఅక్ష్యరాస్యత సాధించేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాదన్నారు. ఎంఈవో టి.రవి, వెలుగు ఏపీఎం బత్తుల నరేంద్రకుమార్, వయోజనవిద్య శాఖ ఉమ్మడి ప్రకాశం జిల్లా డివిజన్ పర్యవేక్షకులు టి.శ్రీనివాసరావు అంగన్‌వాడీ,ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోతవరంలో రీసర్వే గ్రామ సభ

భూముల రీసర్వే గ్రామ సభ మంగళవారం పోతవరం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు.గ్రామ సభ అనంతరం 60 రోజుల పాటు గ్రామంలో అన్ని భూములను రీసర్వే చేస్తామని ఆయన తెలిపారు.

అక్రమాలపై విచారణ జరిపించండి

సంతనూతలపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయమార్కెట్ కార్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు కుంచాల వీరబ్రహ్మయ్య సోమవారం ఒంగోలులో జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. అలాగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలోను పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని వీటిపై విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

మద్దిపాడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు సోమవారం నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. ఎంఈవో 1, ఎంఈవో 2 ఆంజనేయులు, శ్రీనివాసరావు, మద్దిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ

తండాలో పక్కా గృహాలు నిర్మించాలని వినతి


సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంత్రునాయక్

మార్కాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పుల్లల చెరువు మండలంలోని పీఆర్సీ తండాలో నిరుపేదలైన ఎస్టీలకు పక్కా గృహాలు నిర్మించాలని సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు మంత్రునాయక్ అనే గ్రామస్థుడు సోమవారం అర్జీ అందజేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో మొత్తం 23 మంది సమస్యలపై అర్జీలను అందజేశారు. తండాలో 24 కుటుంబాలు ఉన్నా పక్కా గృహాలు లేవని మంత్రునాయక్ తెలిపారు. అభివృద్ధికి దూరంగా ఉన్న ఎస్టీ కుటుంబాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు పూర్ణకంటి తిరుమలయ్యలు ఉన్నారు.

'ఏకలవ్య'లో ప్రవేశం కోసం దరఖాస్తులు

పెద్దదోర్నాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో 2025-26వ విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశం కోసం అర్హులైన గిరిజన బాలబాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఈశ్వర్ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25లో 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఫిబ్రవరి 19వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 25న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం ఏకలవ్య పాఠశాలలో ప్రిన్సిపాల్ 9416094165 నంబరును సంప్రదించాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

మార్కాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠినచర్యలు తప్పవని మార్కాపురం టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో జవహర్‌నగర్ కాలనీలోని వెంకచ్చమ్మ దేవస్థానికి సమీపంలో ఆటోలో యథేచ్ఛగా మద్యం సేవిస్తున్న ముగ్గురిని గుర్తించారు. వారిని వెంటనే అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు.

జూదరుల అరెస్టు

పెద్దారవీడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని రాజంపల్లి శివారులో పేకాట స్థావరంపై ఎస్సై అనిల్‌కుమార్ సిబ్బందితో దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకొని రూ.23,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారుసైకిల్‌ను ఢీ కొన్న కారు

● వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన ప్రభాకర్

పెద్దదోర్నాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటన కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిపై మొట్ల మల్లికార్జునపురం సమీపంలో సోమవారం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో నంద్యాలకు చెందిన ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ప్రభాకర్ మోటారు సైకిలుపై నంద్యాల నుంచి దోర్నాల వస్తున్నాడు. మొట్లమల్లికార్జునపురం వద్ద గుర్తు తెలియని కారు వెనుక వైపున ఢీ కొట్టింది. దీంతో మోటారుసైకిలిస్టు క్రింద పడ్డాడు. దీంతో ఆయన కాలికి గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సమీపంలోని కొర్రప్రోలు ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రున్ని కొర్రప్రోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్సలు నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం దోర్నాల ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

పింఛన్‌లపై నేడు, రేపు పరిశీలన

మార్కాపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలోని పలు చోట్ల ఈ నెల 21, 22 తేదీల్లో మంచాలకే పరిమితమై ప్రభుత్వం నుంచి పింఛన్ పొందుతున్న వారి పింఛన్లను పరిశీలించనున్నట్లు మార్కాపురం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.రాహుల్ తెలిపారు. ఈ నెల 21న మార్కాపురం, పొదిలి పట్టణాలు, కొనకనమిట్ల, పొదిలి మండలాల పరిధిలో, ఈ నెల 22న మార్కాపురం, పెద్దారవీడు మండలాల పరిధిలో ప్రత్యేక బృందాలను పరిశీలిస్తాయన్నారు. మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో 17, మండల పరిధిలో 34, పొదిలి పట్టణంలో 6, మండలంలో 7, కొనకనమిట్ల మండలంలో 21, పెద్దారవీడు మండలంలో 46 మంది మంచానికే పరిమితమైన పలు రుగ్మతలు ఉన్న రోగులు నెలకు రూ.15 వేల ఫింఛన్ పొందుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి వారి భౌతిక పరిస్థితి, సర్టిఫికేట్లు, వైద్యశాల వివరాలు టీమ్‌లు క్షుణ్ణంగా పరిశీలిస్తాయన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

● ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల డిమాండ్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో ఈఈ నాగేశ్వరరావు సోమవారం యూనియన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు, కార్యదర్శి రవికాంత్‌లు మాట్లాడుతూ, సంవత్సర కాలంగా ఆగివున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరిం చాలని జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2లకు వార్షిక ఇంక్రిమెంట్, ఎన్‌క్యాష్‌మెంట్ ఇప్పించాలన్నారు. జేఎల్‌ఎం గ్రేడ్-2లకు రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి భద్రతా పరికరాలు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తన పరిధిలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని, మిగతా సమస్యలు ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కారం దిశగా పనిచేస్తామన్నారు. సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు, కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 డివిజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారెడ్డి సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ ఉస్మాన్, నాయకులు టి.జాన్సన్, ఆర్.మోహన్ రావు నాయక్, మునుస్వామి, ఎల్.కొండయ్య, జి.మంత్రునాయక్, ఏ.బాల నాగయ్య, పి.కాశయ్య, సప్తగిరి, రామ్‌ప్రసాద్, షేక్ అన్వర్ బాషా, ఎన్.ఖాదర్ బాషా, పి.రమణమూర్తి, జాషువా, వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

● తహసీల్దార్ శైలేంద్రకుమార్

పెద్దారవీడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రీసర్వేతో గ్రామాలలో భూసమస్యలకు శాశ్వత పరిష్కరం లభిస్తుందని తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ అన్నారు.


చిన్నదోర్నాలలో సర్వే ప్రారంభిస్తున్న తహసీల్దార్

మండలంలోని ప్రగళ్లపాడులో సోమవారం రీసర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శైలేంద్రకుమార్ మాట్లాడుతూ గతంలో జరిగిన సర్వే మొక్కుబడిగా సాగిందన్నారు. ప్రస్తుతం రైతుల సమక్షంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా సర్వే చేస్తున్నామన్నారు. ప్రగళ్లపాడులో మొత్తం 148 సర్వే నెంబర్లలో 1804 ఎకరాల భూమిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వేయర్లు, వీఆర్వోలు, సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి 60 రోజుల వ్యవధిలో సర్వే పూర్తిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపి, సర్వేయర్ గోపాల్‌రెడ్డి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నదోర్నాలలో రీసర్వే ప్రారంభం

పెద్దదోర్నాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నదోర్నాలలో రెవిన్యూ అధికారులు భూముల రీ సర్వే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కిన్నెర శాంతి మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధారు కార్డు తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్ధారు సాలమ్మ, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో రాణి, సర్వేయరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రగళ్లపాడులో రీసర్వే ప్రారంభిస్తున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్

అధికారులు ఉండరు.. అర్జీలు రావు!

అధికారులు లేకుండా 'మీ కోసం' ఎందుకు అని ప్రశ్నిస్తున్న ప్రజలు


మీకోసంలో పాల్గొన్న డీటీ, సీనియర్ అసిస్టెంట్లు

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించేందుకు ప్రతి సోమవారం మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమం చేపట్టింది. అయితే ఈ మీకోసం కార్యక్రమంలో పూర్తిస్థాయిలో అధికారులు ఉండరు ఆర్జీదారులు ఉండరు అని విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు ఉదాహరణగా ఎర్రగొండపాలెం తహసీల్దార్ కార్యాలయంలో. సోమవారం నిర్వహించినా మీకోసం కార్యక్రమానికి కేవలం ఇద్దరు అధికారులు మాత్రమే హాజరయ్యారు. వారు కూడ రెవెన్యూ డీటీ, సీనియర్ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. మాధ్యహ్నం 12.20 గంటల సమయంలో వారు ఇరువురు మాత్రమే ఉన్నారు. ఆ సమయానికి కేవలం ఒకే ఒక్క ఆర్జీ వచ్చినట్లు డీటీ నలగాటి మల్లికార్జున నాయుడు తెలిపారు. మీ కోసంలో అధికారుల గైర్హాజరుపై 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, పూర్తి స్థాయిలో ఆధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు.

ముత్తుములకు మాజీ సైనికుల కృతజ్ఞతలు


మాజీ సైనికులతో ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాజీ సైనికులు, సైనిక ఉద్యోగులకు ఏర్పాటు చేసిన క్యాంటీన్ వద్దకు రోడ్డుసౌకర్యం లేకపోవడంతో ఆగుంతల రోడ్డులో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి ఇటీవల మాజీ సైనిక ఉద్యోగులు విజ్ఞప్తి చేయగా నంద్యాల-ఒంగోలు మెయిన్ రోడ్డు నుంచి క్యాంటీన్ వరకు తక్షణమే మెటల్ రోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో మాజీ సైనికులందరూ సోమవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వద్దకు వెళ్లి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శాలువా, పూలమాలలు కప్పి సన్మానించారు. మాజీ సైనికులు మాట్లాడుతూ దేశ సైనికుల పట్ల ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఎంతో అభిమానంతో ఉన్నా డని, తమ సమస్యను తెలియచేయగానే స్పందించి ఆర్మీ క్యాంటీన్ వరకు రోడ్డు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ జి.సి.అంకన్న, మాజీ సైనిక ఉద్యోగులు కెప్టెన్ ఎం.కోటారెడ్డి, ఎస్.ఎం.దేవ సహాయం, హవల్దార్ అంకన్న, సుబేదార్ శాంసన్, కె.పి.వెంకటేశ్వర్లు, బి.చంద్రశేఖర్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


దూపాడులో పశువులకు మందులు వేస్తున్న ఏడీ శ్రీరాములు

త్రిపురాంతకం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఏడీ శ్రీరాములు సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని దూపాడు గొల్లపల్లి గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడిగేదెలకు, ఆవులకు ఇతర పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. పశువులలో వచ్చే పలు రకాల సీజనల్ వ్యాధులతో పాటు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కేతగుడిపిలో పశువైద్య శిబిరం

తర్లుపాడు : మండలంలోని కేతగుడిపిలో పశువైద్యాధికారిణి సౌజన్య ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గొర్రెలు, మేకలు, లేగదూడలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. పాడి గేదెలకు సీజనల్ వ్యాధులు, యద పరీక్షలు, గర్భకోశవ్యాధి చికిత్సలు చేశారు. అవసరమైన మందుల కోసం రూ.15వేలను గ్రామ సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్ ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది కవిత, స్వేత, మనోజ్, భార్గవి, గోపాలమిత్ర రామయ్య, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మండలంలోని అమాని గుడిపాడు, మురారిపల్లి గ్రామాలలో వైద్యులు ఏ.శివారెడ్డి, మంత్రునాయక్ ఆధ్వర్యంలో పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో 20 గొర్రెలకు, 12 ఆవులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణకు ఆవసరమైన మందులను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎనిమల్ హెల్త్ అసిస్టెంట్లు షేక్ షాబీర్, నారాయణ, షేక్ రజీద్, ఎం యల్లారెడ్డి, షేక్ బాజీవలీ, షేక్‌వలి పాల్గొన్నారు.

మండలంలో శిబిరాల వివరాలు

21న వాదంపల్లి, 22న గుర్రపుశాల, 23న తమ్మడపల్లి, 24న కొలుకుల, 25న గంజివారిపల్లి, 27న వీరభద్రాపురం, 28న వెంకటాద్రిపాలెం, 29న పాలుట్ల గ్రామాలలో జరగనున్నట్లు తెలిపారు. కావున ఆయా తేదీలలో జరిగే గ్రామాలలో పశువుల యజమానులు ఈ పశుఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

ఇరువురికి తీవ్రగాయాలు


ఘటన స్థలంలో ఢీకొన్న బైకులు

కొనకనమిట్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా రెండు మోటారు బైకులు ఢీకొన్న ఘటన మండలంలోని చినారికట్ల జంక్షన్ సమీపంలో సోమవారం చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం చినారికట్ల జంక్షన్ సమీపంలో నంద్యాల- ఒంగోలు రహదారిలో గొట్లగట్టు గ్రామానికి చెందిన ప్రతాప్ పొదిలి నుండి స్వగ్రామం గొట్లగట్టు వెళుతున్నాడు. మరో వ్యక్తి రంగస్వామి పొదిలి వైపు మోటర్‌బైక్‌లపై వెళుతున్న తరుణంలో ప్రమాదవశాత్తు ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇరువురు మోటర్‌బైక్‌లపై నుండి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ఇరువురికి తలకు బలమైన గాయా లయ్యాయి. స్థానికుల 108కు సమాచారం అందివ్వడంతో 108 సిబ్బంది ఘటన స్థలం చేరుకొని ప్రథమ చికిత్స చేసి క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రాజ్‌కుమార్ సంఘటన స్థలం చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రతి మహిళకు అక్షరజ్ఞానం అవసరం : ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో

మార్కాపురం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి). ప్రతి మహిళకు అక్షర జ్ఞానం తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎస్సీ బీసీ, కాలనీలోని డ్వాక్రా బజారులో సోమవారం నిరక్షరాస్యులైన మహిళలకు చదువు నేర్పించేందుకు ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. విద్యా వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం పిచ్చయ్య ఆధ్వర్యంలో విద్యా వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు.

చెరువు కట్టపై ఆక్రమణలను వెంటనే తొలగించాలి

పుల్లలచెరువు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పుల్లలచెరువు కాటి వీరన్న చెరువు కట్టపై వున్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని మార్కాపురం ఇరిగేషన్ ఈఈ పి. పురార్ధనరెడ్డి సంబంధిన అధికారులను ఆదేశించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' మీనీలో ఆక్రమణ చెరలో చెరువుకట్ట అన్న కథనంపై ఇరిగేషన్ అధికారులు స్పందించారు. తక్షణమే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పోలీసుల సహకారంతో దిబ్బలను, బంకులను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు.

ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు

అధికారులపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

కొనకనమిట్ల, జనవరి, 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలను అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని గ్రామసభలకు ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారని ఎంపిటీసీ సభ్యులు అధికారులపై ధ్వజమెత్తారు. మండల పరిషత్ సమావేశపు హాలులో సోమవారం ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్యసమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్బంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఇబ్బడి ముబ్బడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని వాటిని కట్టడి చేయాలని ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గొట్లగట్టు ఎంపిటీసీ సభ్యులు ఉడుముల రామనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్న సమయంలో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

అదేవిదంగా మండల సమావేశం దృష్టికి తీసుకురాకుండా సభ్యులకు చెప్పకుండా వివిధ అభివృద్ధి పనుల మంజూరు చేయడం దారుణమన్నారు. చినమనగుండం గ్రామంలో పీఎంఈజీపీ పథకం కింద చిక్కి తయారి, ఆయిల్ తయారి, పిండిమర వంటి మూడు యూనిట్‌లు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపిడీవో ఈశ్వరమ్మ, ఇరిగేషన్ ఏఈ విశ్వనాద్, విద్యుత్ ఏఈ, పశువైద్యాధికారి, స్త్రీశిశుసంక్షేమశాక అధికారి, ఏపివో బులెన్‌రావు, వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి, ఎంఈవో డాంగేషరీఫ్, ఏపిఎం సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం


గెలుపొందిన విద్యార్థులతో తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంఈవో శ్రీనివాసరెడ్డి

పొదిలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండలంలో పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఎంఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పలురకాల రాతపోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన, డిబెట్, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు వ్యాసరచనలో సీహెచ్ షారోనురాణి ప్రథమ బహుమతి గెలుచుకోగా ద్వితీయ, తృతీయ బహుమతులు సాయిదీక్షిత, ప్రసన్నలు గెలుచుకున్నారు. డిబెట్‌లో ఎం సుమయ ప్రథమ బహుమతి, ఎస్‌కేవీ మాహీన్, సాయిదీక్షితలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు. క్విజ్‌లో ఎస్.సాహితి, బి.సహస్రా, పి నిరుపమ్‌తేజ్‌లు ప్రథమస్థానంలో నిలిచారు. వీరికి తహసీల్దార్ కృష్ణారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మీ, సీఆర్‌పీ సుబ్బారెడ్డి, మోహనకృష్ణ, మల్లికార్జునరావు, రమణారెడ్డి, పద్మాకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చాపల బహూకరణ


పాఠశాలకు చాపలను బహూకరిస్తున్న రమేష్‌బాబు

కంభం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోర్డు స్కూలు విద్యార్థులకు, అదే ఆవరణలోని అంగన్‌వాడి కేంద్రానికి పట్టణానికి చెందిన దాత అరవీటి రమేష్ బాబు చాపలను బహూకరించారు. ఈసందర్భంగా హెచ్ఎం వరికుంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ఉపయుక్తమైన వస్తు సేవలను అందించడం ఆయన ఔనత్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ మురళీమోహన్, ఐఈఆర్‌పీలు ఈశ్వరి, అరుణ్‌కుమార్, అంగన్‌వాడి కార్యకర్తలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ దివస్


పోలీసు స్టేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్న పోలీసులు

కంభం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కంభం పోలీసుస్టేషన్ ఆవరణలో ఎస్సై నరసింహారావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై పోలీసులతో కలిసి పోలీసుస్టేషన్ పరిసరాలను శుభ్రపరిచారు. పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రజలు కూడా పరిసర ప్రాంతాలను శుభ్రం ఉంచుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

26న జరిగే ర్యాలీని విజయవంతం చేయండి

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, విత్తన చట్టాన్ని అమలుచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 26న జరిగే ట్రాక్టర్, బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డిమాండ్ల పరిష్కారం కోసం జనవరి 26న దేశ వ్యాప్తంగా ర్యాలీ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో చేపట్టనున్న ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున రైతులు, కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, రైతు సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ.కృష్ణగౌడ్, మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య, నూర్జహాన్, ఏఐటియూసి నాయకులు ఆవుల యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీల లెక్కింపు


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

త్రిపురాంతకం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో హుండీలను సోమవారం లెక్కించారు. స్వామివారి హుండీలు రూ. 10,93,676 అమ్మవారి హుండీలు రూ. 18,73,825, అన్నదానం 96,092 కాగా మొత్తం రూ 30,63,593 వచ్చినట్లు ఆలయ ఈవో రజనీకుమారి తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయాల ఇన్‌స్పెక్టర్ బి.నాగమల్లేశ్వరరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివదీక్షధారులకు అన్నసంతర్పణ ప్రారంభం

పెద్ద దోర్నాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి):స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలోని ఉపాలయం శ్రీ గంగా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో శివదీక్ష స్వాముల సేవా సమితి ఆధ్వర్యంలో మాలధారులకు సోమవారం నుండి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ రోజు నుండి 41 రోజుల పాటు నిర్వహించనున్నట్లు శివ స్వాములు శ్రీను, పందు నాయుడు తెలిపారు.

తిరుగు ప్రయాణంలో తప్పని తిప్పలు

దొనకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను ముగించుకొని ప్రజలు తిరుగు ప్రయాణమయ్యారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, వివిధ పనుల నిమిత్తం దొనకొండ మండలంలోని పలు గ్రామాలకు చెందినవారు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరంతా సంక్రాంతి వేడుకలు జరుపుకునేందుకు స్వగ్రామాలకు చేరుకున్నారు. తిరిగి వారి ప్రదేశాలకు చేరేకునేందుకు బయలుదేరారు. ఈప్రాంత ప్రజలకు రోడ్డుమార్గాన రవాణా సౌకర్యం లేకపోవటంతో రైలు ప్రయాణం తప్పనిసరి. దీంతో దొనకొండ మీదుగా గుంటూరు, విజయవాడ, నంద్యాల, గుంతకల్లు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో సోమవారం రైళ్లు కిటకిటలాడాయి. రైళ్లల్లో కాలుపెట్టేందుకు వీలులేకపోవటంతో కొందరు వారి ప్రయాణాలను మానుకొని ప్రైవేట్ వాహనాల్లో రోడ్డుమార్గాన బయలుదేరారు. మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో రైళ్లల్లో కిక్కిరిసి ప్రయాణాలు కొనసాగించారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్న పలువురు ప్రయాణికులు రైలు ఎక్కేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రజల సౌకర్యార్థం పండుగ సమయంలోనైనా రైల్వే అధికారులు ఒకటి రెండు ప్రత్యేక రైళ్లు ఏర్పాటుచేస్తే రవాణా కష్టాలు తప్పేవని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు.


ప్రయాణికులతో కిక్కిరిసిన దొనకొండ రైల్వేస్టేషన్

భార్యను వేధిస్తున్నాడంటూ ఇంటిపై దాడి


రుద్రసముద్రంలో ధ్వంసమైన రేకుల షెడ్డు

దొనకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తన భార్యను వేధిస్తున్నాడని ఘర్షణకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని రుద్రసముద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. గ్రామంలోని మాట వెంకటేశ్వర్లు, తనపక్క ఇంట్లో నివసిస్తున్న దుగ్గెంపూడి మల్లికార్జున భార్యను తరచూ వెంటపడి వేధిస్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్వర్లును మందలించేందుకు మల్లికార్జున , మరికొందరు అతని ఇంటి వద్దకు వెళ్లారు. ఆసమయంలో వెంకటేశ్వర్లు లేకపోవటంతో అతని భార్య శివమ్మతో గొడవపడి కులంపేరుతో దూషించారు. అనంతరం మల్లికార్జున, అతని వర్గీయులు వెంకటే శ్వర్లు ఇంటిపక్కన ఉన్న రేకులషెడ్డును ధ్వంసం చేసి నిప్పుపెట్టారు. రేకులషెడ్డులో ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు, ఆటో దగ్ధమయ్యాయి. వెంకటేశ్వర్లు భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. అలాగే, మల్లికార్జున భార్య ఫిర్యాదు మేరకు మాట వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువర్గాల కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న త్రిపురాంతకం సీఐ హస్సాన్ రుద్రసముద్రం గ్రామాన్ని సందర్శించారు. సంఘటన జరిగిన తీరును విచారించారు. గ్రామంలో ఉద్రిక్త త పరిస్థితులు నెలకొనకుండా సోమవారం పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు.

వైద్యశాల అభివృద్ధికి విరాళం

పామూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన పోకా వెంకటేశ్వర్లు రూ.10వేల నగదును ప్రకటించారు. ఈమేరకు సోమవారం ఉగ్రను కలిసి నగదు అందజేశారు. ఈసందర్భంగా దాతను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఉప్పుగండ్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


పులిపాడులో రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేస్తున్న పశువైద్యాధికారి విజయలక్ష్మి

ముండ్లమూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని పశు పోషకులు పాడి పరిశ్రమ ద్వారా వృద్ధిచెందాలని పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని పులిపాడులో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 45 పశువులకు పరీక్షలు నిర్వహించి పశుపోషకులకు మందులు సరఫరా చేశారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముక్కమళ్ల శ్రీనివాసరెడ్డి, ఏరేసి వెంకటేశ్వరరెడ్డి, రమేష్, కె.కోటిలింగం, గోపాలమిత్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు


రెడ్డినగర్ - శ్రీనివాసనగర్ రహదారి దుస్థితి

ముండ్లమూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కెల్లంపల్లి పంచాయతీలోని రెడ్డినగర్ నుంచి శ్రీనివాసనగర్ వరకు, కెల్లంపల్లి ఎస్సీ కాలనీ నుంచి జగన్ నగర్ వరకు వెళ్ళే గ్రామీణ రహదారులను తారురోడ్లుగా మార్చేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టి ఆతరువాత పత్తా లేకుండాపోయారు. దీంతో బసవాపురం, శ్రీనివాసనగర్, కెల్లంపల్లి, నందమూరి నగర్, పలుకురాళ్ళ తండా, జగన్‌నగర్ గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకాన్ని అనుభవిస్తున్నారు.

గతంలో కెల్లంపల్లి నుంచి జగత్‌నగర్ వరకు వెళ్ళే ఆరు కిలో మీటర్ల పంచాయతీ రోడ్డను తారు రోడ్డుగా మార్చేందుకు ఐఐబీ గ్రాంటు నుంచి రూ 5.07 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రెడ్డినగర్ నుంచి శ్రీనివాస నగర్ గ్రామం వరకు వెళ్ళే రోడ్డుకు రూ.2.05 కోట్లు మంజూరయ్యాయి. ఐదు సంవత్సరాలు గడిచినా ఇంతవరకు అతీగతీ లేదు. ఈ రెండు రహదారులు అధ్వానస్థితికి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డినగర్ నుంచి బసవాపురం వరకు వెళ్ళే రహదారి గోతులమయంకావడంతో వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెండు పంచాయతీరాజ్ రహదారులను అభివృద్ధిపరచాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

సమాచార హక్కు చట్టంపై స్పందించని అధికారులు

దొనకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై దొనకొండ గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన గంగవరపు విజయ్‌కుమార్ ఆరోపించారు. 2020 నుంచి 2024 వరకు మంజూరైన గ్రాంట్లు, ఖర్చులు తదితర వివరాలను సమాచారం హక్కు చట్టం ద్వారా గత సెప్టెంబరులో కోరినట్టు చెప్పారు. స్పందన లేకపోవడంతో గత నవంబరులో ఈవోఆర్డీ, జిల్లా పంచాయతీ అధికారి, సమాచార శాఖ కమిషనర్‌కు విన్నవించుకున్నా నేటికీ ఎటువంటి ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రకటించటమే తప్పా ఆచరణలో పాటించటం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం ద్వారా తాము కోరిన సమాచారాన్ని అందజేయాలని కోరారు. ఈవిషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తిని వివరణ కోరగా తాను రెండు నెలల క్రితమే విధుల్లో చేరినట్టు చెప్పారు. సమాచార హక్కు చట్టంపై ఎటువంటి సమాచారం తమ దృష్టికి రాలేదని ఆయన పేర్కొన్నారు.

రవాణాశాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు

దర్శి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు సోమవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 36వ జాతీయ రహదారి రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గీతాపద్మ సుమారు 60 మంది డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి పి. రవికుమార్, లయన్స్ క్లబ్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి నారపుశెట్టి మధు, ఉపాధ్యక్షుడు స్వాములు తదితరులు పాల్గొన్నారు.

రాజంపల్లి - బొద్దికూరపాడు మార్గాన్ని డబుల్ రోడ్డుగా మార్చాలి

దర్శి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజంపల్లి -బొద్దికూరపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని తెలుగుయువత నియోజకవర్గ అధికార ప్రతినిధి గుర్రం బాలకృష్ణ ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం మంత్రిని బాలకృష్ణ, స్థానిక నాయకులు కలిశారు. ఈసందర్భంగా వినతిపత్రం సమర్పించగా ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే, ఉయ్యాలవాడ - త్రిపురసుందరీపురం మెటల్ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

అంకాలమ్మకు బంగారు తాళిబొట్టు బహూకరణ

పామూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పామూరులోని అంకాలమ్మ వీధిలోగల శ్రీఅంకాలమ్మ తల్లికి గుంటూరుకు చెందిన సూరరామసుబ్బరావు కుమార్తె పది గ్రాముల బంగారు తాళిబొట్టును సోమవారం బహూకరించారు. ఈసందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు ఓగూరి నరసింహారావు, పేరం రఘునాథరెడ్డి, ఓగూరి ఏడుకొండలు, గుత్తి కొండలరావు, పసుపులేటి రఘురాం, నాగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్‌ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జీసీఅండ్‌వైపీఎస్ (ఎంఎస్‌ఎం) డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించే జాబ్ మేళాలో ఆరు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. 18 నుంచి 28 సంవత్సరాల వయసులోపు యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇందులో పాల్గొనేవారు తమవెంట పదో తరగతి, డిగ్రీ, ఐటీఐ, డిప్లోమా కోర్సులకు సంబంధించిన సర్టిఫికెట్‌లను తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 80088 22821 నెంబరును సంప్రదించాలని కోరారు.

పాడిరైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయం

పామూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పశువైద్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పామూరు, సీఎస్‌పురం మండలాల పశువైద్యాధికారులు ఇమని శ్రీసాయి, షేక్ మునీర్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలాల్లో ప్రతిరోజు రెండు పంచాయతీల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. సోమవారం నుంచి ఈనెల 31వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయ ని తెలిపారు. వీటిని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పామూరు మండలంలోని దూబగుంట, సీఎస్‌పురం మండలంలోని వి.బైలు, కొత్తపల్లి గ్రామాల్లో జరిగిని శిబిరాల్లో నట్టల నివారణ మందు తాపించినట్టు వారు తెలిపారు. పశువులకు సాధారణ జబ్బులకు చికిత్సచేసి ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో తెలుగురైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, ఉపసర్పంచ్ కందుల శ్రీనివాస రెడ్డి, దైండె శివశంకర్, పూనాటి వెంకటేశ్వర్లు, ఖాదర్‌బాషా, పశుసంవర్ధ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వీసీపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని వెంగళాపురం సమీపాన ఉన్న గంగమ్మ గుడికి వెళ్లే మార్గం కొన్నేళ్లుగా అధ్వానంగా ఉంది. ఈ గుడికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు రోజూ వస్తుంటారు. ఈక్రమంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఉగ్ర సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయించారు. దీంతో అధికారులు పనులు చేపట్టారు.

సోమవారం పనులను పరిశీలించిన డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దీర్ఘకాలం పటిష్టంగా ఉండేలా రోడ్డును నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట నాగోతు శ్రీనివాసులు, పరిమి ఈశ్వరరావు, వడ్డెంపూడి మాధవరావు, వడ్డెంపూడి వెంకటసుబ్బయ్య, పువ్వాడి మల్లికార్జున తదితరులు ఉన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న డాక్టర్ ఉగ్ర

పక్కాగా రీసర్వే చేయాలి

పామూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించిన భూవిస్తీర్ణాన్ని సమగ్రంగా రీసర్వే చేసి తప్పులను సరిచేయాలని ఆర్డీవో కేశవర్ధనరెడ్డి సూచించారు. మండలంలోని చింతలపాలెంలో రోవర్ జీస్ ద్వారా జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించి తగు సూచనలు చేశారు. రోజుకు 20 ఎకరాల వంతున భూములను రీసర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో పరుసు రమేష్, మండల సర్వేయర్ స్నేహ, విలేజ్ సర్వేయర్లు అమరాన్, బ్రహ్మయ్య, రైతులు పాల్గొన్నారు.


పామూరు: చింతలపాలెంలో రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి


తాళ్లూరు: రామభద్రాపురంలో రీసర్వే కొలతలు తీస్తున్న రెవెన్యూ అధికారులు

రామభద్రాపురంలో ప్రారంభమైన రీసర్వే

తాళ్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామభద్రాపురం గ్రామంలో రెవెన్యూ అధికారులు రీసర్వే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. రీసర్వే చేపట్టేందుకు రామభద్రాపురంను మోడల్ గ్రామంగా ఎంపికచేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం పకడ్బందీగా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా రీసర్వే నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. గ్రామంలోని రైతులకు నోటీస్‌లు జారీ చేశారు. రైతులకు వాట్సాప్ మెసేజ్ పెట్టి సమాచారం అందజేశారు. ఆయా పొలాలకు చెందిన సమీప రైతుల సమక్షంలో సర్వేయర్ వై.శ్రీనివాసరావు, విలేజ్ సర్వేయర్లు భూముల కొలతలు తీశారు. రైతుల వద్ద ఉన్న భూముల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాలి

» ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశం

పామూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేవాలయ భూములను ఆక్రమించుకొని ఉన్నవారికి నోటీసులు జారీచేసి భూములను స్వాధీనం చేసుకొంటామని ఆశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. పామూరులోని వేణుగోపాలస్వామి, భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు సంబంధించిన వివాదాస్పద భూములను, ఆలయ షాపులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన ఆలయ భూములను ఆక్రమణదారుల చెర నుంచి విముక్తి చేస్తామని చెప్పారు. అందుకు సంబంధించి ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఈవో నరసింహాబాబుకు ఆదేశించారు. పట్టణంలోని అనుమాలశెట్టి ధర్మసత్రం, వీర బ్రహ్మం గారి మఠానికి సంబంధించిన ఆస్తులను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఈవోను ఆదేశించారు. వ్యాయామశాల కోసం దేవాలయానికి చెందిన భూముల్లో కొంతభాగాన్ని కౌలుకు కేటాయించాలని భజరంగ్‌దళ్ సభ్యులు ఆర్జేసీకి వినతిపత్రం అందజేశారు. దేవాలయ భూముల్లో ఇతరులు కట్టడాలు నిర్మించారని బీజేపీ నాయకుడు కేవీ రమణయ్య ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని ఈవోకు సూచించారు. కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు, సిద్ధవటం నరసింహులు, బండ్ల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


దేవదాయ భూముల్లో అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న ఆర్జేసీ ఆజాద్

నారాయణస్వామిని దర్శించుకొన్న ఆజాద్

సీఎస్‌పురం(పామూరు), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాన్ని దేవదాయ ధర్మాదాయ, తిరుపతి మల్టీ జోన్-2 ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎంఎం.చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం సందర్శంచారు. ఈసందర్భంగా ఈవో నరసింహాబాబు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దేవస్థానానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు తగిన ఏర్పాట్లుచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ, వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య కేంద్రాలు

» గత పాలకుల నిర్లక్ష్యంతో ఒనగూరని సౌకర్యాలు
» మరికొన్నిచోట్ల అర్ధంతరంగా ఆగిన నిర్మాణాలు
» గ్రామీణులకు అందని సత్వర వైద్య సేవలు


చిలంకూరులో అసంపూర్తిగా విలేజ్ క్లీనిక్

పామూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఆయుస్మాన్ ఆరోగ్య కేంద్రాలు(విలేజ్ క్లీనిక్) ప్రారంభానికి నోచుకోలేదు. మరికొని చోట్ల పునాదుల దశలోనే నిలిచిపోయాయి. గతప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇవి మంజూరయ్యాయి. పామూరు మండలంలో 19 గ్రామ సచివాలయాలకుగాను 18చోట్ల విలేజ్ క్లీనిక్‌లు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు సత్వరమే వైద్య సేవలు అందించేందుకు వీటిని ఏర్పాటుచేశారు. ఒక్కో కేంద్రానికి రూ.9.80 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించారు.

మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి, చింతలపాలెం, దూబగుంట, నుచ్చుపొద, ఇనిమెర్ల, బలిజపాలెం, తూర్పుకట్టకిందపల్లి, పామూరులో ఒకచోట మాత్రమే నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చిలంకూరు, పడమటకట్టకిందపల్లి, పామూరు 3లో అసంపూర్తిగా ఉన్నాయి. పామూరు 1, 2 సచివాలయాల పరిధిలో స్థల సమస్యతో నిర్మాణ పనులు చేపట్టలేదు.

అయితే, నిర్మాణాలు పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. తూర్పుకట్టకిందపల్లిలో నీటి మడుగులో నిర్మించారు. దీంతో అక్కడికి వెళ్లేందుకు దారిలేక నిరుపయోగంగా పడి ఉంది. ఆరోగ్యకేంద్రాల నిర్మాణాలకు గ్రామాల్లో అనువైన స్థలాలు ఎంపిక చేయడంలో అప్పటి పాలకులు, ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన విలేజ్ క్లినిక్‌లలో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం లేదు. ఈ సౌకర్యాలను పంచాయతి నిధుల నుంచి కల్పించాల్సి ఉంది. అప్పట్లో పంచాయతీల్లో నిధుల లేక కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత పాలకులు, అధికారులు చొరవ తీసుకొని నిర్మాణాలు పూర్తయిన విలేజ్ క్లీనిక్‌లో కనీస సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


తూర్పు కట్టకిందపల్లిలో నీటి మడుగులో నిర్మించిన ఆరోగ్య కేంద్రం

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తీసుకెళ్లొద్దు!


పామూరు: వాహన దారులకు సూచనలు చేస్తున్న పోలీసులు


ముండ్లమూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రజలను ఎక్కించుకొని వెళితే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వై.నాగరాజు అన్నారు. సోమవారం సాయంత్రం వేంపాడు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. రెండు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉండటంతో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. అత్యాశకు పోయి ఎక్కువమందిని ఎక్కించుకొని ప్రమాదాలకు గురైతే వారిపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో ఉన్న రైతులకు కూలీల అవసరం ఉండటంతో వాహన చోదకులు ఎక్కువ మందిని ఎక్కించుకొని వెళ్తున్నారన్నారు. దీనివల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతిరోజు తనిఖీలు చేయటం వల్ల ప్రమాదాలు తగ్గే అవకాశాలు ఉన్నాయని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోల్లో ఎక్కిస్తే చర్యలు

పామూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సోమవారం గోపాలపురం జాతీయ రహదారి వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న మైనర్లను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలులేని పలు వాహనాలపై కేసులు నమోదుచేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ టికిశోర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



అడిగింది ఇస్తేనే.. అప్రూవల్





కేంద్రం ప్రవేశపెట్టిన ఇ-వాహన్ యాప్

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తేచాలు క్షణాల్లో మీ వాహనాల రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి బదిలీల వరకు ఇట్టే వేళ్లమీద చేసేసుకోవచ్చు. వీటికోసం ఇకపై మీ సమయాన్ని, శ్రమను వృథా చేసుకోవలసిన పనిలేదు. అంతా ఆన్‌లైన్‌లోనే జరిగిపోతాయి... ఇదీ కేంద్ర ప్రభుత్వ రవాణా మంత్రిత్వశాఖ చెబుతున్న మాట. దీనికోసమే గతంలో ప్రతి రాష్ట్రానికి ఉన్న యాప్‌లను తొలగించేసి, వాటి స్థానంలో ఈ-వాహన్ అనే యాప్‌ను తీసుకొచ్చింది. దేశంలో ఉన్న వాహనాలకు సంబంధించిన అన్ని సేవలు ఎక్కడైనా పొందేలా, కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లో క్షణాల్లో పూర్తిచేసుకునేలా వెసులుబాటు కల్పించామనేది కేంద్ర ప్రభుత్వ శాఖల మాట. అయితే ఇది కేవలం మాటలకే పరిమితమయింది. పర్యవేక్షణ కొరవడటమో! లేక మామూళ్లకు అలవాటుపడటంవల్లో కానీ, చేతులు తడపకుండా అప్రూవల్ ఇవ్వటానికి ఆ చేతులు రావటం లేదు.


- ఈ - వాహన్‌లో వాహనదారుల కష్టాలు
- ఆర్టీవో కార్యాలయానికి వెళ్లకుంటే ఫైల్ కదిలేది లేదు
- ఆన్‌లైన్ సేవలపైనా నిలువు దోపిడీ
- నెలల తరబడి ఆన్‌లైన్ దరఖాస్తుల పెండింగ్
- పర్యవేక్షణ కొరవడటంతో ఆర్టీవోల ఇష్టారాజ్యం
- ఆర్‌సీ కార్డ్‌కోసం ఫీజు చెల్లించినా రెండేళ్లుగా అందని కార్డులు

తెనాలి, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు ఆర్టీఓలు ఆన్‌లైన్ దరఖాస్తులను తొక్కిపెట్టి మరీ, దరఖాస్తుదారులను కార్యాలయాలకు పిలిపించుకుని లంచాలు దండుకున్న తర్వాతే వాటిని ఒకే చేయటం, లేదంటే ఆ కాగితం లేదు... ఈ కాగితం లేదంటూ తిప్పుతూనే ఉన్న పరిస్థితి. చివరకు ఇన్సూరెన్స్ వివరాలు ఆన్‌లైన్‌లోనే కనిపిస్తున్నా, దానికి సంబంధించిన పేపర్ చూపాల్సిందేనంటూ తిప్పిపంపటం వంటివి వీరి వసూళ్లకు పరాకాష్ఠ. చివరకు ఆన్‌లైన్‌లో ఒక్క బటన్ క్లిక్‌తో ఓకే చేయగలిగిన ఈ-కేవైసీ, ఫోన్, ఆధార్ నంబర్‌ల అప్‌డేషన్, మండల, జిల్లాల వివరాల సవరణ వంటివాటినీ వదలకుండా ప్రతి పనికీ రేటు పెట్టేసి దోచేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసిన ఈ-ప్రగతి యాప్ ద్వారా అయితే మొదటి దరఖాస్తు పరిష్కారం చూపాకే రెండో దరఖాస్తు ఓపెన్ అయ్యేది. దీనివల్ల మామూళ్లు అందినా, లేకున్నా దరఖాస్తులన్నీ వరుస క్రమంలోనే క్లియర్ చెయ్యాల్సివచ్చేది. కానీ ఈ-వాహన్ యాప్‌లో ఆ పరిస్థితిలేదు అప్లికేషన్ నంబర్ కొడితే ఓపెన్ అవుతుండటంతో వారికి డబ్బు ముట్టిన దరఖాస్తులను క్లియర్‌చేసి, అందని వాటిని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో నెలల తరబడి ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగ్ పడిపోతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసినవారు నెలల తరబడి ఎదురుచూసి, చివరకు ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లక తప్పటంలేదు. దీంతో కేంద్రం ప్రతిష్ఠాత్మకగా తీసుకొచ్చిన వాహన్ యాప్ కొందరు వసూళ్ల అధికారులకు వరంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ఆర్టీఓ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ దోపిడీ యథేచ్ఛగా సాగిపోతూనే ఉంది. దీంతో దరఖాస్తుదారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి.

ఆఫ్‌లైన్‌లో చేతులు తడిపితేనే...

కేంద్రం దేశవ్యాప్తంగా తీసుకొచ్చిన ఈ-వాహన్ యాప్ ద్వారా కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, యాజమాన్య బదిలీ, జాతీయ, అంతర్రాష్ట్ర పర్మిట్‌ల మంజూరు, రెన్యువల్స్

(మిగతా 6వ పేజీలో)



రాష్ట్రంలో ఎక్కడి ఆర్టీవో కార్యాలయంలోనయినా సేవలు పొందేలా ఆన్‌లైన్ యాప్‌లోనే ఇచ్చిన ఆప్షన్

కృష్ణా జిల్లా వంటి కొన్ని జిల్లాల్లోని ఆర్టీఓ కార్యాలయాల్లో ఏ రోజుకారోజు దరఖాస్తులన్నీ పరిశీలించి, వాటికి అప్రూవల్ ఇవ్వాల్సిందేనని ఆదేశాలున్నాయి. ప్రతి విభాగంలోనూ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా జీరో చూపించి, దానిని ఫోటోతీసి ఉన్నతాధికారులకు ప్రతి రోజూ అప్‌లోడ్ చెయ్యాలి. కానీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో మాత్రం అది కనిపించటంలేదు.

> కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలంటే రూ. 1065 ప్రభుత్వ చలానా చెల్లించాలి. ఇవికాక రూ. 1000 నుంచి రూ. 1800 అదనంగా అందిస్తేనే ఆ ఫైల్ ముందుకు వెళుతుంది. ఇవన్నీ సాధారణంగా జరుగుతున్న తంతే. ఇవికాక ఈ-కేవైసీ వంటివి, ఫోన్ నంబర్ అప్డేట్, కొత్త జిల్లాలు వచ్చాక మండలం, జిల్లా పేరు మార్పుల వంటివి ఆధార్ కార్డు జతచేస్తే దాని ఆధారంగా చేసేవే అయినా, వాటికీ మామూళ్లు ఇచ్చుకోవలసిన పరిస్థితి. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో రూ. 600 నుంచి రూ. 700 వరకు ప్రతి దరఖాస్తుకు ఒక రేటు నిర్ణయించారు. ఈ మొత్తం చెల్లిస్తేనే ఈ-కేవైసీ వంటివి కూడా ఓకే చేస్తున్నారంటే దోపిడీ పరిస్థితి అర్థమవుతుంది. మేమేమీ లంచాలు తీసుకోవటంలేదని, నిబంధనల ప్రకారం పనిచేస్తున్నామని కొందరు అధికారులు చెబుతుంటే, ఏరోజుకారోజు పరిష్కారంచూపాల్సిన దరఖాస్తులు నెలల తరబడి వందల సంఖ్యలో ఎందుకు పెండింగ్ ఉంటున్నాయనేది అంతుబట్టని విషయం. పైగా ఒకదాని తర్వాత ఒకటి వరుస క్రమంలో పరిష్కారం కావలసిన దరఖాస్తులు అక్కడక్కడ ఒక్కోటి అవుతున్నాయంటే... దీనివెనకున్న కారణాలేమిటనేది అధికారులే చెప్పాల్సిన మాట.

చెరువులను బలోపేతం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వీటి నిల్వ సామర్థ్యం పెంచేవిధంగా పూడికతీత పనులకు శ్రీకారం చుట్టాలని సంకల్పించింది. కట్టలను పటిష్ఠం చేసి కంప చెట్లను తొలగింపు పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి జిల్లాలో పంచాయతీకి ఒక కుంట లేదా ఒక చెరువును ఎంపిక చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బంది చెరువులకు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

చెరువులకు మహర్దశ

- రెండో విడత అమృత్ సరోవర్ పనులకు శ్రీకారం
- పంచాయతీకి ఒకటి చొప్పున ఎంపిక


అధ్వాన స్థితిలో ఉన్న చెరువు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమృత్ సరోవర్ రెండో విడత కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రెండేళ్ల కిందట ప్రతి జిల్లాలో మండలానికి ఒకటి నుంచి మూడు చెరువుల వరకు అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. మూడు జిల్లాలో 223 చెరువులను అభివృద్ధి చేశారు. పల్నాడు జిల్లాలో 75, గుంటూరు జిల్లాలో 75, బాపట్ల జిల్లాలో 73 చెరువులను అమృత్ పథకం మొదట విడతలో అభివృద్ధి చేశారు. ఉపాధిహామీ, నీటిపారుదలశాఖ పర్యవేక్షణలో ఆయా పనులు పూర్తి చేశారు. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో పంచాయతీలో ఒక చెరువు లేదా ఒక కుంటను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న సాగుకు నీరందించే చెరువులను బలోపేతం చేయాలని నిర్ణయించారు.

తాజాగా మళ్లీ పంచాయతీకి ఒక కుంట లేదా చెరువును గుర్తించాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులు అందాయి. ఒక్కో చెరువు లేదా కుంటలో నీరు నిల్వ చేయడానికి కనీసం ఒక ఎకరా విస్తీర్ణంలో ఉండాలి. 10 వేల క్యూబిక్ మీటర్ల నీరు నిల్వ చేసేవిధంగా పనులు చేయనున్నారు. ఇందు కోసం ఉపాధి హామీ పథకం నిధులు కేటాయించనున్నారు. కట్టలపై కంప చెట్లు తొలగించి మరింత పటిష్ఠం చేయనున్నారు. గత కొన్నేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో కట్టలు బలహీనంగా ఉన్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు వచ్చిన వరదనీటి ఉధృతికి గండ్లు పడుతున్నాయి. సమీపంలో ఉన్న భూములు కోతకు గురవుతున్నాయి. ఇసుక, మట్టి మేటలు వేయడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చెరువులను మరింత బలోపేతం చేయనున్నారు. మండలాల వారీగా కుంటలు, చెరువులను ఎంపిక చేస్తున్నారు. ఈ ప్రక్రియ వేగవంతం చేశారు. చెరువులు.. కుంటలను త్వరగా గుర్తించి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఒక్కో చెరువులో పనులు చేయాలంటే ఉపాధి హామీ పథకం కింద రూ.5 నుంచి రూ. 10 లక్షల వరకు మంజూరు చేసే అవకాశం ఉంది.

రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు అంచనాలు రూపొందించే ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రతిపాదనలు అందగానే పనులు చేపట్టడానికి అనుమతులిస్తారు. మూడు జిల్లాల్లో 1172 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 223 పంచాయతీల్లో అమృత్ పథకం తొలివిడతలో చెరువులను అభివృద్ధి చేశారు. పల్నాడు జిల్లాలో 434, బాపట్ల జిల్లాలో 353, గుంటూరు జిల్లాలో 152 చెరువులను అమృత్ -2 పథకం కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రెడీ అవుతున్నాయి.

ఉడతా ఉడతా ఊచ్... ఆహారం దొరికిందోచ్...

ఆహారం కోసం వెతుకుతున్న ఉడతకు ఓ ఇంటిపై ఉంచిన పూరీ ముక్క దొరకటంతో నోటితో కరుచుకొని వెళ్లి ప్రశాంతంగా తింటున్న దృశ్యం.



నకిలీ డ్వాక్రా గ్రూపులతో.. రూ.1.16 కోట్లు స్వాహా

నల్లపాడు జీడీసీసీలో మరో కుంభకోణం

బ్యాంకును అప్రమత్తం చేసిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

గుంటూరు సిటీ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో చోటుచేసుకున్న మరో ఘోరం వెలుగులోకి వచ్చింది. నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి రూ. 1.16 కోట్లు కొట్టేశారు. ఈ విషయాన్ని గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ గుర్తించింది. మొత్తం 10 నకిలీ డ్వాక్రా సంఘాలను సృష్టించి బ్యాంకును మోసగించారు. ఆ సంఘాలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందినవి కాదని పీడీ టీవీ విజయలక్ష్మీ స్పష్టం చేశారు. అదే విషయాన్ని జీడీసీసీ బ్యాంకు దృష్టికి తీసుకెళ్లారు. నకిలీ డ్వాక్రా గ్రూపులతో కొందరు వ్యక్తులు జీడీసీసీలో రూ. 1.16 కోట్లు దారిమళ్లించిన విషయానికి సంబంధించిన సమాచారాన్ని పీడీ విజయలక్ష్మీ పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఈ వ్యవహారంలో జిల్లా అధికారులు సీరియస్‌గా వున్నారు.

23 నుంచి మిర్చియార్డులో.. ఉచిత భోజనం

- ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం మీల్స్
- డైనింగ్ హాల్స్‌ని సిద్ధం చేసిన అధికారులు
- టిఫిన్, లంచ్ కలిపి ఒక్కో వ్యక్తికి రూ. 132.65 పైసల ఖర్చు
- గత వైసీపీ హయాంలో రూ. 150 చెల్లింపు

గుంటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మిర్చి సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరుకు వచ్చే రైతులు భోజనం కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఉచిత భోజన పథకాన్ని ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించింది. రోజుకు ఎంతమంది రైతులు వచ్చినా భోజనం వడ్డించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఈ నెల 23వ తేదీన జిల్లా ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. యార్డు నల్లపాడు గేటు వైపున ఉన్న రెండు భోజన శాలల్లో ఉదయం 11 గంటల నుంచే రైతులకు మధ్యాహ్న భోజనం వడ్డించడం ప్రారంభిస్తామని అధికారవర్గాలు తెలిపాయి. ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడే కార్యక్రమంగా పేర్కొన్నాయి.

అల్పాహారం, భోజనం ఇలా...

ప్రతీ రోజు రెండు ఇడ్లీ, చట్నీ, కారంపొడి, టీ సోమ, బుధ, శుక్రవారాలలో అయితే కట్టె పొంగలి(సాంబారుతో), మంగళ, గురువారంలో టమాటబాత్ వడ్డిస్తారు. మధ్యాహ్న భోజనంలో ఒక స్వీటు, గుడ్డు, అన్నం, పప్పు, వేపుడు కూర, రోటీ పచ్చడి, సాంబారు, ఇగురు కూర(శాకాహారం), పెరుగు వడ్డన చేస్తారు.

వైసీపీ హయాంలో కంటే ఛార్జీలు తక్కువ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేశారు. అయితే ఇందుకు గాను ఒక్కో ప్లేటుకు రూ. 150 వరకు వసూలు చేశారు. అయితే ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వ అధికారులు సంప్రదింపులు జరిపి ధరలు తగ్గించేలా ఒప్పించారు. తద్వారా అల్పాహారం రూ. 42.75 పైసలు, భోజనం రూ. 89.90 పైసలకు సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకొన్నారు. దీంతో రెండూకలిపి రూ. 132.65 పైసలకు తగ్గిపోయింది. తొలి రెండు రోజులు మధ్యాహ్న భోజన పథకం మాత్రమే అమలు చేస్తామని, వచ్చే సోమవారం నుంచి ఉదయం అల్పాహారం కూడా ప్రారంభమౌతుందని మార్కెట్ కమిటీ సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు తెలిపారు.


మిర్చియార్డులో రైతులకు ఉచితంగా అల్పాహారం, భోజనం వడ్డించేందుకు సిద్ధం చేసిన భోజన శాల

కార్మికులందరికీ ప్రమాద బీమా సభ్యత్వం నమోదు చేయించాలి

బాపట్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అసంఘటితరంగ కార్మికులందరికి అధికారులు ఉచిత ప్రమాదబీమా సభ్యత్వనమోదు చేయించాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. వివిధ సంక్షేమ పథకాల అమలుతీరుపై జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రమ పోర్టల్ ద్వారా ప్రమాద బీమా ఉచిత సభ్యత్వం నమోదు చేయించాలని తెలిపారు. 16నుంచి 60 సంవత్సరాల లోపు వయసున్నవారంతా పేర్లు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. భవననిర్మాణ కార్మికులు, వ్యవసాయకూలీలు, వలసకార్మికులు, రిక్షాకార్మికులు ఇళ్ళల్లో పనిచేసేవారు మత్స్యకారులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపా ధిహామీకూలీలు, చిరువ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేనివారు ఆదాయపన్ను పరిధిలోకి రానివారంతా అర్హులే అన్నారు. విద్యార్థులు తమపేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం కింద 4,81,711మందికి బీమా వర్తింపచేయాలని లక్ష్యాలను నిర్దేశించినట్లు వివరించారు. కార్యక్రమంలో జేసీ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీఆర్వో, ఆర్డీవో పాల్గొన్నారు.

నిధుల్లేక నిలిచిన పనులు!

- అసంపూర్తిగా నాడు నేడు పాఠశాల భవనాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

రేపల్లె, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడునేడు పథకంలో చేపట్టిన అదనపు తరగతి గదుల భవనాలు ఎక్కడికక్కడ అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాడు నేడు కింద వచ్చిన నిధులను జగన్ రెడ్డి పక్కదారిపట్టించడంతో నియోజకవర్గంలోని పాఠశాలల భవన నిర్మాణాలు రెండు సంవత్సరాల క్రితమే నిలిచిపోయాయి. ఆ భవనాలు అసంపూర్తిగా ప్రస్తుతం దర్శనమిస్తున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇలాంటి నిర్మాణాల పరిస్థితిపై విద్యా శాఖ ఆదేశాలమేరకు నివేదికలు అందజేశారు.


చెరుకుపల్లి మండలం నడింపల్లిలో సగంలో నిలిచిపోయిన ఎంపీపీ పాఠశాల భవనం


రేపల్లె: 11వవార్డులో ఆంధ్రరత్న స్కూల్లో నాడు-నేడు కింద నిధులు మంజూరుకాక నిలిచిపోయిన పాఠశాల భవనం


40 పాఠశాలలకుపైగానే..

రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, రూరల్, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని 40 పాఠశాలలకు పైగానే నాడునేడు కింద అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ఆ యా భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నా యి. రేపల్లె పట్టణంలోని 3వవార్డులో మున్సిపల్ హైస్కూల్లో 10 గదుల నిర్మాణం లెంటల్ శ్లాబ్‌తోనే ఆగిపోయింది. భవనం చుట్టూ, గదుల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. 11వ వార్డులోని ఆంధ్రరత్న ఉన్నత పాఠశాలల్లో 10 తరగతి గదుల భవ నం లెంటల్ శ్లాబ్‌తోనే ఆగిపోయింది. నగరం మం డలంలో పెద్దవరం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో గదు లు నిర్మించారే తప్ప 2వ అంతస్తు పిల్లర్స్‌తో ఆపివేశారు. గోడలకు కనీసం ప్లాస్టింగ్ చేసిన దాఖలాలు లేవు. చేసేది లేక అసంపూర్తి భవనంలోనే విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. చెరుకుపల్లి మండలంలో జడ్పీ ఉన్నత పాఠశాల్లో భవనం నిర్మించారే తప్పా దర్వాజాలు, కిటికీలు, ఫ్లోరింగ్, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. చెరుకుపల్లి మండలం నడింపల్లి గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల భవనం లెంటల్ శ్లాబ్‌తో ఆగిపోయింది. చెరుకుపల్లి కొత్తపేటలో రెండు గదుల భవనం, గుళ్ళపల్లి పాఠశాలల్లో రెండు గదులు, కనగాల రెండు, 13 పాఠశాలలు భవనాలు మధ్యలోనే నిలిచిపోయాయి. నిజాంపట్నం మండలంలో 11 పాఠశాలల భవనాలు మధ్యలో ఆగిపోయాయి. బేస్‌మెంట్‌లెవల్లో కొన్ని నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌవుతున్నారు.

కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్లకు నగదు చెల్లించలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మొదటి బిల్లు మాత్రమే వచ్చిందనీ, 40 పాఠశాలలకు రూ.30 కోట్లుపైనే నిధులు కావాల్సి ఉందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలను పూర్తి చేయాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు.


చెరుకుపల్లి: గుళ్ళపల్లి జడ్పీ హైస్కూల్లో పూర్తికాని పాఠశాల భవనం


రేపల్లె 3వ వార్డులోని మున్సిపల్ హైస్కూల్లో మధ్యలో నిలిచిపోయిన నాడు-నేడు పాఠశాల భవనం

అడిగింది ఇస్తేనే.. అప్రూవల్

(5వ పేజీ తరువాయి)

వాహన బీమా, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటివి మంజూరు చేయటం దగ్గర నుంచి ఈ-కేవైసీ వంటివాటి వరకు వాహనదారులు అన్నీ ఆన్‌లైన్‌లో చేసుకునే వెసుబాటు ఉంది. కేంద్రం కొత్త యాప్ తీసుకొచ్చి సేవలన్నీ ఆన్‌లైన్‌లో అందిస్తోంది కదా! ఎంచక్కగా ఇంటిదగ్గరే ఉండి అన్నీ చేసుకోవచ్చునుకునే వారికి మాత్రం నిరాశ తప్పటంలేదు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కొన్ని కార్యాలయాల్లో రెండు నుంచి నాలుగు నెలలుగా ఆన్‌లైన్ దరఖాస్తులు పెండింగింగ్‌లోనే ఉంటున్నాయంటే పరిస్థితి అర్థమవుతుంది. లారీలు, బస్సుల వంటి వాహనాలు బ్రేక్ చసి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ప్రభుత్వ చలానా రూ. 970 చెల్లించాలి. ఇది రెండు నెలల ఫీజు. ఈ మొత్తం చెల్లించి అన్ని కాగితాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, వాహనాన్ని చూపితే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. కానీ చలాన మొత్తం కాకుండా అదనంగా రూ. 3వేలు మామూళ్ల కింద చెల్లించాలి. ఇది ఎప్పటి నుంచో ఉన్న ఆనవాయితీనే. అయితే వాహన్ యాప్ ద్వారా కేంద్రం కొత్త అవకాశాన్ని తీసుకొచ్చింది. నేషనల్ పర్మిట్, అంతర్రాష్ట్ర అనుమతులున్న లారీలకు పర్మిట్ అయిపోతే దానిని ఎక్కడ ఉంటే ఆ దగ్గర్లోని ఆర్టీఓ కార్యాలయంలో రెన్యువల్ చేయించుకునే అవకాశాన్ని కల్పించింది. అయితే ఎక్కడో విశాఖ జిల్లా బండి తెనాలిలో రెన్యువల్ చేసుకోవాలంటే అన్ని ఫీజులు, గతంలోనే నిర్ణయించిన లంచాలకు తోడు అదనంగా రూ. 1500 నుంచి రూ. 2వేల వరకు చెల్లించుకోవలసిందే. అదేమని ఎవరైనా అడిగితే ఎక్కడి వాహనం అక్కడ చేయించుకునేందుకు వెళితే ఆయిల్ ఖర్చు చాలా అవుతుంది కదా! మీకు అదంతా ఆదా చేస్తున్నాముకదా అన్నట్టు చూపించి వసూలు చేయటం విశేషం.

ఫీజు చెల్లించినా ఆర్‌సీ కార్డులేవ్

కొత్త వాహన రిజిస్ట్రేషన్ చేసుకుంటే దానికి సంబంధించిన ఆర్‌సీ కార్డ్ వాహన యజమానికి అందాలి. దీనికోసం 2023 నుంచి కొత్త వాహనాలు కొన్నవారంతా ఎదురు చూస్తున్న పరిస్థితి. కార్డ్ కావాలంటే రూ. 225 చెల్లించాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వ కాలంలో కార్డ్‌తో పనిలేకుండా ఆర్‌సీ పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని దానిని కార్డ్‌లాగా తయారు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే అప్పటికే కార్డ్ కోసం డబ్బు చెల్లించనవారి పరిస్థితిపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా కార్డు తీసుకునేలా రూ. 225 చెల్లించాల్సిన విధంగా యాప్‌లో మార్పులు చేశారు. ఆ సమయంలో వాహనాలు కొన్నవారంతా చెల్లించారు. కానీ వారికీ కార్డులు లేవు. ఇటీవల మళ్లీ దానిలోనూ మార్పులు చేసి, కార్డు కావాలా, వద్దా అనే ఆప్షన్‌ను ఆన్‌లైన్‌లో ఇచ్చారు. కావాలనుకునే వారు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. లేనివారు పేపర్ డౌన్‌లోడ్ చేసుకుని దానినే ఆర్‌సీ కింద చూపించవచ్చు. అయితే కార్డు కావాలని మళ్లీ డబ్బు చెల్లించనవారికీ కష్టాలు యధావిధిగానే కొనసాగుతున్నాయి. కార్డులు రాకపోగా ఆ వాహనాన్ని అమ్మాలంటే కొర్రీలు పడుతున్న పరిసితి. కార్డు రానివారు వాహనం అమ్మబోతే, యాజమాన్య బదిలీకి కుదరదు. మీ కార్డు ప్రింట్ కాలేదు కనుక ముందు కార్డ్ ప్రింటింగ్ అయ్యేలా చూసుకోవాలంటూ ఎర్రర్ చూపిస్తుండటంతో వాహనదారులు రెండు రకాలుగా అవస్థలు పడుతున్నారు. అసలు ఆకార్డులు ఎక్కడ ముద్రితమవుతాయో! ఎక్కడి నుంచి వస్తాయో కూడా అంతుబట్టని విషయం. వీటి కోసం కార్యాలయాల్లో అడిగితే మాకూ ఏ సమాచారం లేదనే సమాదానం మినహా దానికి పరిష్కారం మార్గం చూపినవారేలేరు. దీంతో వాహనాల అమ్మకాలూ పెండింగ్‌పడిపోతున్నాయి. వాహనాలు కొనాలన్నా, అమ్మాలన్నా రెండో వాహనం ఉండటం వల్ల ఎక్కువ పన్నులు చెల్లించాల్సిరావటంతో ఆ నష్టాన్నీ వాహనదారులు భరించాల్సిన పరిస్థితి. ఈ-వాహన్ యాప్ వచ్చి చాలా కాలం అయినా, దీనిలో బాలారిష్టాలు అధికమించినా అధికారుల అలసత్వం, మామూళ్ల మత్తు లక్ష్యాన్ని నీరు కార్చుతోంది. దీనిపై ఉన్నతాధికారుల పూర్తిస్థాయి అజమాయిషీ ఉంటేనే ఆన్‌లైన్ సేవలు సక్రమంగా వాహనదారులకు అందే అవకాశం ఉంది. ప్రభుత్వ పెద్దలు దీనిపై దృష్టిపెడితేనే కొత్త, పాత వాహనాలు ఏ అడ్డంకులూ లేకుండా రోడ్డెక్కే అవకాశం ఉంది.

కర్ణాటకలో మార్కెట్ మందగమనం

ఇప్పటివరకు కొన్నది 45 మిలియన్లు మాత్రమే

ఇంకా పొగాకు రైతుల వద్ద 55 మిలియన్ల పంట

ఆంధ్రలో ఈ సీజన్‌పై ప్రభావం

కొనుగోళ్లు ఆలస్యమయ్యే అవకాశం



ఒంగోలు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్ ఆంధ్రలో ప్రత్యేకించి దక్షిణాదిలోని వేలం కేంద్రాలలో పొగాకు కొనుగోళ్ల ఆలస్యంగా ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అందుకు కర్ణాటకలో కొనుగోళ్ల మందగమనంగా సాగుతుండటమేనని తెలుస్తోంది. సాధారణంగా ప్రతి ఏటా ఆంధ్రలో పొగాకు నాట్లు వేసే సమయంలో కర్ణాటకలో కొనుగోళ్ళు ప్రారంభమవుతాయి. అలాగే ఇక్కడ పొగాకు క్యూరింగ్ మూడొంతులు పూర్తయ్యే సమయానికి అక్కడ దాదాపు కొనుగోళ్లు తుదిదశకు చేరుకుంటాయి. అలా ఫిబ్రవరి ఆఖరుకు కర్ణాటకలో చివరిదశకు చేరితే ఆ వెంటనే దక్షిణాదిలో కొనుగోళ్లను పొగాకు బోర్డు ప్రారంభిస్తుంది. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. సంక్రాంతి వెళ్లినా కర్ణాటకలో పండిన పంటలో సగం విక్రయాలు కూడా పూర్తికాలేదు. మెరుగైన ధరల కోసం అక్కడి రైతులు ఎదురు చూస్తూ త్వరితగతిన పంట అమ్మకాలకు మొగ్గుచూపడం లేదు. మరోవైపు అక్కడ లోగ్రేడ్ అధికంగా ఉత్పత్తి కావడంతో మేలు రకం గ్రేడ్‌కు ధరలు బాగానే ఉన్నా రైతులు మాత్రం మేలు రకం కన్నా లోగ్రేడ్ బేళ్లను ఎక్కువగా వేలంకేంద్రాలకు తెస్తున్నారు. దీంతో నోబిడ్‌లు కూడా ఒకింత అధికంగా ఉంటుండటంతో కొనుగోళ్లలో మందగమనం సాగుతోంది.

అక్టోబరు 7న ప్రారంభం

కర్ణాటకలో 2024-25 సీజన్‌కు పొగాకు బోర్డు అంతకు ముందు సీజన్ వలే 100 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అలా నాలుగైదేళ్లగా ఇస్తుండగా 2023-24లో సుమారు 60 మిలియన్లు 2023-24లో 83 మిలియన్లు ఉత్పత్తి జరగ్గా ఫిబ్రవరి ఆఖరుకు ఆ రెండేళ్లు దాదాపుగా కొనుగోళ్లు పూర్తయ్యాయి. అయితే ప్రస్తుత సీజన్‌లో ఇంచుమించు 100 మిలియన్ల పంట ఉత్పత్తి జరిగినట్లు అంచనాతో గత ఏడాది అక్టోబరు 7న కర్ణాటకలోని మొత్తం పది కేంద్రాల్లోనూ వేలంను అధికారులు ప్రారంభించారు. తొలిరోజున మేలురకం కిలో రూ.230 ఇచ్చిన వ్యాపారులు క్రమంగా డిసెంబర్ రెండవ వారం నాటికి గరిష్ఠ ధర కిలో రూ.290 వరకు అలాగే లోగ్రేడ్‌లకు కూడా రూ.230 నుంచి రూ.250 వరకు తీసుకెళ్లారు. అనంతరం మేలురకం ధరలు ఎంతోకొంత పెరుగుతున్నా లోగ్రేడ్ ధరలు అప్పటి వరకు ఉన్న దాని కన్నా తగ్గించడం ప్రారంభించారు. అసలే ఈ ఏడాది అక్కడ లోగ్రేడ్ అధికంగా ఉత్పత్తైంది. సుమారు 100 మిలియన్ కిలోలు పంట ఉత్పత్తి అంచనా కాగా అందులో నికరంగా 40శాతం లోగ్రేడ్, 35శాతం మీడియం గ్రేడ్ ఉండగా మేలురకం కేవలం 25శాతం మాత్రమేనని సమాచారం.

అంతా లోగ్రేడ్ తేవడంతోనే..

సాధారణంగా లోగ్రేడ్ 25శాతం ఉంటుంది. అలాంటిది 40శాతం వరకు ఉత్పత్తి కావడంతో పాటు ఆ గ్రేడ్‌లకు ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందడమేకాక మేలురకం బేళ్లను ఇళ్లలో ఉంచుకొని లోగ్రేడ్, మీడియం గ్రేడ్ బేళ్లను అమ్మకాలకు ఆ నెలలో తెచ్చారు. ఆ పరిస్థితి అక్కడ కొనుగోళ్లపై తీవ్రంగా చూపింది. ఫలితంగా రోజువారీ కొనుగోలు పరిమాణం తగ్గి మొత్తం సీజన్ కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యంగా నడుస్తోంది. సంక్రాంతి వరకు దాదాపు మూడున్నర మాసాల కాలంలో కర్ణాటకలో కేవలం 45 మిలియన్ కిలోలు పంట మాత్రమే కొనుగోళ్లు చేసినట్లు సమాచారం. మేలురకం గ్రేడ్ ధరలు గతం కన్నా పెరిగి గరిష్ఠ ధర కిలో రూ.315కు చేరుకోగా కనిష్ఠ ధరలు కిలో రూ.220గా ఉన్నాయి. అలా సగటు ధర కిలో రూ.265 వరకు ఉంది. గత ఏడాది మొత్తం 83 మిలియన్ కిలోలు ఉత్పత్తి జరగ్గా సగటున కిలోకు రూ.254 ధర లభించింది. ఆ ప్రకారం చూస్తే గత ఏడాది కన్నా ఈ ఏడాది సగటు ధర ఎక్కువగానే ఉండటంతో పాటు మేలురకం ధరలు గతం కన్నా అధికంగానే ఉన్నా ఈ ఏడాది లోగ్రేడ్ ఉత్పత్తి అధికంగా ఉండటంతో అక్కడి రైతులు ఆ ధరల కోసం పట్టుపడుతూ బేళ్లను సక్రమంగా తీసుకరావడం లేదని సమాచారం. అక్కడ ఇంకా 55 మిలియన్ల పంట రైతుల వద్ద ఉండటంతో దాని విక్రయాలకు మరో మూడు మాసాలు పట్టే అవకాశం కనిపిస్తోంది. అలా అయితే ఆంధ్రాలో ఈ ఏడాది కనీసం మార్చి ఆఖరుకు కూడా వేలం ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు. దాని వల్ల ఇక్కడి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

గుండ్లకమ్మలో పూర్తిస్థాయి నిల్వ

ప్రాజెక్టుల ఎస్ఈ నాగమురళీ మోహన్

ప్రస్తుత ప్రాజెక్టుల పరిస్థితిపై అధికారులతో సమీక్ష

ఒంగోలు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుండ్లకమ్మ ప్రాజెక్టులో దాదాపు రెండున్నరేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నీటి నిల్వ చేసే అవకాశం వచ్చింది. ప్రాజెక్టులో గతంలో వలే 3.40 టీఎంసీలు నిల్వ చేయనున్నట్లు ప్రాజెక్టుల ఎస్ఈ నాగమురళీమోహన్ తెలిపారు. ఇప్పటివరకు జలవనరుల శాఖ అద్దంకి డివిజన్ ఎన్నెస్పీ ఈఈగా పనిచేస్తున్న ఆయనను మూడు రోజుల క్రితం ఒంగోలులోని ప్రాజెక్టుల ఎస్ఈగా ప్రభుత్వం నియమించింది. ఆదివారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించగా సోమవారం ఉదయం గుండ్లకమ్మ ప్రాజెక్టుపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. తొలుత గుండ్లకమ్మ ప్రాజెక్టు డివిజన్-2 యూనిట్ ఈఈ రవికుమార్, అలాగే డివిజన్-1, 2 యూనిట్లలోని డీఈలు, జేఈలు ఇతర సిబ్బంది ఎస్ఈని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాజెక్టులపై చర్చ సాగింది. మొత్తం 15గేట్లు ఉన్న ప్రాజెక్టులో నాటి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 2022 ఆగస్టు 31న ఒక గేటు, 2023 డిసెంబరులో మూడో నెంబరు గేటు కొట్టుకుపోయిన విషయం విదితమే. దాని వల్ల రెండేళ్ల పాటు ఆయకట్టుకు నీరు విడుదల చేసే అవకాశం లేక రైతులు అలాగే ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్న జాలర్ల కుటుంబాలు నష్టపోయారు. కాగా ఏడాది కాలంగా గేట్లు మరమ్మత్తులు ప్రారంభం కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అ పనులు ఊపందుకున్నాయి.



ఎస్ఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న గుండ్లకమ్మ ఈఈ రవి కుమార్, సిబ్బంది

13 గేట్ల పనులు పూర్తి

సంబంధిత పనులపై అధికారులతో ఎస్ఈ సమీక్ష చేయగా మొత్తం 15 గేట్లలో 13 గేట్ల పనులు పూర్తయినట్లు అధికారులు వివరించారు. ఇక 4, 13 గేట్లు మాత్రమే చేయాల్సి ఉండగా బిల్లుల పెండింగ్‌తో కాంట్రాక్టర్ తాత్కాలికంగా పనులు ఆపేశారన్నారు. అయితే ఆ రెండింటి వద్ద స్టాప్ లాక్ గేట్లను అమర్చి నీటిని నిల్వ చేస్తున్నట్లు వివరించారు. ఆ రెండు గేట్లకు కొత్తవి అమర్చకపోయినా స్టాప్‌లాక్ గేట్లను పెట్టడం ద్వారా పూర్తిస్థాయిలో ప్రాజెక్టులో నీటి నిల్వకు ఎలాంటి ఇబ్బంది లేదని ఈఈ రవికుమార్ చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 24.38 మీటర్లు, నీటి నిల్వ సామర్థ్యం 3.859 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.52 మీటర్ల మట్టంతో 3.024 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వివరించారు. ఎగువ నుంచి 389 క్యూసెక్కులు నీరు వస్తుండగా కపవర్తి ఎత్తిపోతల రైతుల విజ్ఞప్తి మేరకు మూడు రోజులు నదిలో దిగువకు 100 క్యూసెక్కులు వదిలినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం ప్రాజెక్టు ఆయకట్టు రైతుల నీటి అవసరాల కోసం కుడి కాలువకు 20 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 94 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నట్లు తెలిపారు.

నెలాఖరుకు నింపేస్తాం..

ఎగువ నుంచి వస్తున్న నీటితో నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో రిజర్వాయర్‌ను నింపే అవకాశం ఉందని ఇంజనీర్లు వివరించారు. కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 3.859 టీఎంసీల మేర నీటిని నింపితే మోదేపల్లి సమీపంలో దోర్నపువాగు ప్రాంతంలోని కొన్ని వ్యవసాయ భూములు మనకకు గురయ్యే అవకాశం ఉన్నందున గతంలో ఉన్నతాధికారులు 3.40 టీఎంసీలు వరకు దింపాలని ఆదేశించారన్నారు. ఆ ప్రకారం ప్రతి ఏటా గతంలో నీటిని నిల్వ చేస్తున్నామని చెప్పారు. ఆమేర నీటిని నిల్వచేస్తే డెడ్ స్టోరేజీ 1.36 టీఎంసీలు పోను రెండు టీఎంసీలకు పైగా నీరు రిజర్వాయర్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. దాని వల్ల ఆయకట్టు రైతుల వ్యవసాయ అవసరాలు, అలాగే తాగునీటి అవసరాలు తీరుతాయన్నారు. దిగువన కాలువలకు నీటిని వదులుతున్న దానికి అనుగుణంగా ఎగువ నుంచి వస్తున్న నీటిని నదిలోకి విడుదల చేయకుండా నిల్వ చేసుకోవాలని సూచించారు.

ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య కేంద్రాలు

గత పాలకుల నిర్లక్ష్యంతో ఒనగూరని సౌకర్యాలు

మరికొన్నిచోట్ల అర్ధంతరంగా ఆగిన నిర్మాణాలు

గ్రామీణులకు అందని సత్వర వైద్య సేవలు



చిలంకూరులో అసంపూర్తిగా నిలిచిఉన్న విలేజ్ క్లీనిక్

పామూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గత పాలకుల నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఆయుస్మాన్ ఆరోగ్య కేంద్రాలు(విలేజ్ క్లీనిక్) ప్రారంభానికి నోచుకోలేదు. మరికొని చోట్ల పునాదుల దశలోనే నిలిచిపోయాయి. గతప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇవి మంజూరయ్యాయి. పామూరు మండలంలో 19 గ్రామ సచివాలయాలకుగాను 18చోట్ల విలేజ్ క్లీనిక్‌లు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు సత్వరమే వైద్య సేవలు అందించేందుకు వీటిని ఏర్పాటుచేశారు. ఒక్కో కేంద్రానికి రూ.9.80 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో నిర్మాణ పనులు ప్రారంభించారు.

మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి, చింతలపాలెం, దూబగుంట, నుచ్చుపొద, ఇనిమెర్ల, బలిజపాలెం, తూర్పుకట్టకిందపల్లి, పామూరులో ఒకచోట మాత్రమే నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చిలంకూరు, పడమటకట్టకిందపల్లి, పామూరు 3లో అసంపూర్తిగా ఉన్నాయి. పామూరు 1, 2 సచివాలయాల పరిదిలో స్థల సమస్యతో నిర్మాణ పనులు చేపట్టలేదు.

అయితే, నిర్మాణాలు పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. తూర్పుకట్టకిందపల్లిలో నీటి మడుగులో నిర్మించారు. దీంతో అక్కడికి వెళ్లేందుకు దారిలేక నిరుపయోగంగా పడి ఉంది. ఆరోగ్యకేంద్రాల నిర్మాణాలకు గ్రామాల్లో అనువైన స్థలాలు ఎంపిక చేయడంలో అప్పటి పాలకులు, ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన విలేజ్ క్లినిక్‌లలో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం లేదు. ఈ సౌకర్యాలను పంచాయతి నిధుల నుంచి కల్పించాల్సి ఉంది. అప్పట్లో పంచాయతీల్లో నిధుల లేక కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత పాలకులు, అధికారులు చొరవ తీసుకొని నిర్మాణాలు పూర్తయిన విలేజ్ క్లీనిక్‌లో కనీస సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



తూర్పు కట్టకిందపల్లిలో నీటి మడుగులో నిర్మించిన ఆరోగ్య కేంద్రం

తిరుగు ప్రయాణంలో తప్పని తిప్పలు

దొనకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను ముగించుకొని ప్రజలు తిరుగు ప్రయాణమయ్యారు. విద్య, ఉద్యోగ, వ్యాపార, వివిధ పనుల నిమిత్తం దొనకొండ మండలంలోని పలు గ్రామాలకు చెందినవారు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరంతా సంక్రాంతి వేడుకలు జరుపుకునేందుకు స్వగ్రామాలకు చేరుకున్నారు. తిరిగి వారి ప్రదేశాలకు చేరేకునేందుకు బయలుదేరారు. ఈప్రాంత ప్రజలకు రోడ్డుమార్గాన రవాణా సౌకర్యం లేకపోవటంతో రైలు ప్రయాణం తప్పనిసరి. దీంతో దొనకొండ మీదుగా గుంటూరు, విజయవాడ, నంద్యాల, గుంతకల్లు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో సోమవారం రైళ్లు కిటకిటలాడాయి. రైళ్లల్లో కాలుపెట్టేందుకు వీలులేకపోవటంతో కొందరు వారి ప్రయాణాలను మానుకొని ప్రైవేట్ వాహనాల్లో రోడ్డుమార్గాన బయలుదేరారు. మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో రైళ్లల్లో కిక్కిరిసి ప్రయాణాలు కొనసాగించారు. వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్న పలువురు ప్రయాణికులు రైలు ఎక్కేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రజల సౌకర్యార్థం పండుగ సమయంలోనైనా రైల్వే అధికారులు ఒకటి రెండు ప్రత్యేక రైళ్లు ఏర్పాటుచేస్తే రవాణా కష్టాలు తప్పేవని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు.



ప్రయాణికులతో కిక్కిరిసిన దొనకొండ రైల్వేస్టేషన్

అవీఇవీ

పాఠశాల విద్యార్థులకు కొత్త మెనూ

జోన్ల వారీగా మార్పు

ఒంగోలు విద్య, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పేరుతో అందిస్తున్న భోజనం మెనూలో ప్రభుత్వం మార్పులు చేసింది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల విద్యార్థులకు ఒకే మెనూతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించేవారు. అయితే రాష్ట్రంలో ఆయా ప్రాంతాలను బట్టి అక్కడి ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జోన్ల వారీగా మెనూను ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులకు ఆయా ప్రాంతాల్లో తినే ఆహారాన్ని అందిస్తే మరింత మంది పాఠశాలల్లో భోజనం చేస్తారన్న ఆలోచనతో జోన్-3 పరిధిలో ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాల విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేకంగా మెనూను ప్రకటించింది. కొత్త మెనూ వివరాలు ఇలా ఉన్నాయి..

సోమవారం : తెల్ల అన్నం, కూరగాయల సాంబరు, చిక్కి, ఎగ్‌ఫ్రై

మంగళవారం: చింతపండు లేదా నిమ్మకాయ పులిహోర, టమోటా/పుదీనా చట్నీ, ఫ్రైడ్ ఎగ్, రాగిజావ

బుధవారం: తెల్ల అన్నం, కూరగాయల మిశ్రమం కూర, ఎగ్‌ఫ్రై, చిక్కీ

గురువారం: పలావు/కూరగాయల అన్నం, ఉర్లగడ్డ కుర్మ, ఉడికించిన గుడ్డు, రాగిజావ

శుక్రవారం: తెల్ల అన్నం, కోడిగుడ్డు కూర, చిక్కి

శనివారం: తెల్ల అన్నం, టమోటా పప్పు/ పప్పుచారు, తీపి పొంగలు, రాగిజావ ఇస్తారు

కొత్త మెనూతో పాఠశాలల్లో విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తినేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

జిల్లావ్యాప్తంగా రీసర్వే ప్రారంభం



యరజర్లలో భూములు సర్వే చేస్తున్న సర్వేయర్లు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 38 గ్రామాల్లో సోమవారం నుంచి రీసర్వే కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో ఎంపిక చేసిన గ్రామాల్లో అధికారుల బృందాలు సర్వే ప్రారంభించాయి. ప్రభుత్వ భూములతోపాటు దేవదాయ, రైతుల భూములను రీసర్వే చేసి రికార్డులను పకడ్బందీగా తయారుచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందులో భాగంగా జిల్లాలో 38 మండలాలు ఉండగా మండలంలో ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసి కార్యక్రమం ప్రారంభించారు. రీసర్వే జరిగే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రైతుల సమక్షంలో కొలతలు వేస్తున్నారు. రైతుల వద్ద నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి వాటిని నమోదు చేస్తున్నారు. ఆ విధంగా జిల్లావ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించేందుకు 136 బ్లాకులుగా విభజించి 126 మంది ఫీల్డ్ వర్క్ టీంలను, 38 కమ్యూనికేషన్ టీంలను ఏర్పాటుచేశారు. ఆయా బృందాల నేతృత్వంలో గ్రామాల్లో రీసర్వే మొదలైంది.

నయన మనోహరం.. కృష్ణవేణి చరితం



కృష్ణవేణి చరితం నృత్యరూపకంలో ఒక దృశ్యం

ఒంగోలు కల్చరల్, జనవరి20 (ఆంధ్రజ్యోతి):స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రదర్శిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలలో భాగంగా సోమవారం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఇందులో భాగంగా సాయంత్రం పునుగోడుకు చెందిన మంజునాథ నాదస్వర బృందంతో నాదస్వర కచ్చేరి, వినుకొండ, ఈదర గ్రామాలకు చెందిన 36 మంది మహిళలతో కోలాట ప్రదర్శన జరిగాయి. శ్రీ లక్ష్మీనారాయణ కోలాట బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనలో పలు జానపద, పల్లెగీతాలకు మహిళలు చక్కటి హావభావాలతో కోలాటాన్ని ప్రదర్శించారు. అనంతరం ఒంగోలు చందు డాన్స్ అకాడమికి చెందిన విద్యార్థులు శ్రీ కృష్ణవేణి చరితం నృత్యరూపకాన్ని నయన మనోహరంగా ప్రదర్శించారు. అకాడమీ నిర్వాహకులు త్రోవగుంట చందు పర్యవేక్షణలో ప్రదర్శితమైన ఈ నృత్య రూపకంలో 30 మంది విద్యార్థులు కథాంశానికి అనుగుణంగా నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. కార్యక్రమాలను కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు పర్యవేక్షించి మాట్లాడుతూ మన తెలుగు కళలను మరుగున పడిపోకుండా కాపాడటం ఎన్టీఆర్ కళాపరిషత్ ముఖ్య ఉద్దేశమని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ వివిధ జానపద కళలకు ఎన్టీఆర్ కళాపరిషత్ ద్వారా ప్రోత్సాహం లభిస్తుందని, ఇటువంటి ఒక మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్న హరిబాబు అభినందనీయుడని అన్నారు. అనంతరం ఆయన కోలాట ప్రదర్శన బృందానికి ప్రదర్శన పారితోషికాన్ని, జ్ఞాపికను అందజేశారు.

నేటి కార్యక్రమాలు

మంగళవారం సాయంత్రం 4 గంటలకు కలికివాయికి చెందిన సాయినాథ నాదస్వర బృందంచే నాదస్వర కచ్చేరి, 5 గంటలకు కోలాట ప్రదర్శన, రాత్రి 7 గంటలకు విజయవాడ దృశ్యవేదిక వారిచే కనక పుష్యరాగం సాంఘిక నాటకం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న నల్లూరి వెంకటేశ్వర్లు

రవాణాశాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు కంటి పరీక్షలు

దర్శి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ ఆధ్వర్యంలో డ్రైవర్లకు సోమవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 36వ జాతీయ రహదారి రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ గీతాపద్మ సుమారు 60 మంది డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎస్ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జీసీఅండ్‌వైపీఎస్ (ఎంఎస్ఎం) డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించే జాబ్ మేళాలో ఆరు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మార్టూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీడీవో భుక్యాశాంతిబాయి అధ్యక్షత వహిస్తారని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి మండలంలో పశువైద్య శిబిరాలు

పంగులూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం నుంచి పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ చెప్పారు. ఈ నెల 21న బూదవాడ, రేణంగివరం, 22న పంగులూరు, చందలూరు, 23న కల్లంవారిపాలెం, కొండమూరు, 24న కోటపాడు, 25న జనకవరం, తూర్పుకొప్పెరపాడు, ముప్పవరం, 27న రామకూరు, 28న కొండమంజులూరు, 29న బైటమంజులూరు, 30న నూజెళ్లపల్లి గ్రామాలలో ఉదయం 8.30 నిమిషాలకు పశువైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు.

అద్దంకిలో...

అద్దంకిటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : అద్దంకి మండలంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అద్దంకి పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని 20వ తేదీ బొమ్మనంపాడు, 21న చిన్నకొత్తపల్లి, 22న చక్రాయపాలెం, 23న ధేనువకొండ, 24న ధర్మవరం, 25న కలవకూరు, 27 కొటికలపూడి, 28న తిమ్మాయపాలెం, 29న మణికేశ్వరం, 30న వెంకటాపురం, 31న ఉప్పలపాడు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని ఆయా గ్రామాల పశుపోషకులు సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు.

కొరిశపాడు మండలంలో...

మేదరమెట్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని అద్దంకి పశు వైద్యశాల ఏడీ డాక్టర్ ఎం.మోహనరావు సోమవారం తెలిపారు. 22వ దైవాలరావూరు, బొల్లవరప్పాడు, 23న కుర్రావానిపాలెం, 24న పమిడిపాడు, తమ్మవరం, 25న బొడ్డువానిపాలెం, 27న మేదరమెట్ల, సోమవరప్పాడు, ప్రాసంగులపాడు, 28న రావినూతల, 29న కనగానివారిపాలెం, 30న అనమనమూరు, 31న పి.గుడిపాడు గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని వివరించారు.

నేటి నుంచి గ్రామాలలో ఆధార్ క్యాంప్‌లు

అద్దంకిటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21, 22వ తేదీలో సింగరకొండపాలెం, 23, 24న ధర్మవరం, 27, 28న వెంపరాల, 29, 30 తేదీలలో నాగులపాడు గ్రామాల్లో మోదేపల్లి డిజిటల్ అసిస్టెంట్ డి. కార్తీక్ క్యాంప్‌లు నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు.

నేడు ఇంకొల్లులో రావిపూడి సంస్మరణ సభ

ఇంకొల్లు, జనవరి 20, (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ హేతువాది రావిపూడి వెంకటాద్రి ద్వితీయ వర్ధంతి సంస్మరణ సభ స్థానిక రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ లోని వెంకటాద్రి మీటింగుహాలులో ఉదయం 10 గంటలకు జరుగుతుందని రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ అధ్యక్షుడు మేదూరి సత్యనారాయణ తెలిపారు. సభలో హేతువాద సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి దరియావలి, ట్రెజరర్ షేక్ బాబు, అమరావతి హేతువాద సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొంటారన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4.2 కోట్లు

సంతమగులూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అంతర్గత మట్టిరోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.4.2 కోట్లు నిధులు మంజూరైనట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సంతమగులూరు మండలం సజ్జాపురంలో నూతనంగా రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. సంతమాగులూరు మండలంలో అన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను నిర్మించేందుకు రూ.4.2 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. సజ్జాపురం గ్రామంలో 2, కాలనీలో 1 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని మంత్రిని గ్రామస్థులు కోరారు. వెంటనే ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కావాలని కోరగా రెవెన్యూ అధికారులతో మాట్లాడారు.

పశుపోషకులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలి

అద్దంకి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశు వైద్యంపై పశుపోషకులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సోమవారం నుంచి ప్రారంభమై 31వ తేదీ వరకు జరిగే పశు వైద్య శిబిరాల పోస్టర్, కరపత్రాలను మంత్రి రవికుమార్ సోమవారం అడ్డరోడ్డు వద్ద గెస్ట్‌హౌస్ వద్ద ప్రారంభించారు. పశువైద్య శిబిరాల షెడ్యూల్‌ను మంత్రికి వివరించారు.

ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మోహనరావు, బొమ్మనంపాడు, మేదరమెట్ల, కొరిశపాడు పశువైద్యాధికారులు అశోక్, సైదయ్య, వెంకటరావు పాల్గొన్నారు.



సజ్జాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

బల్లికురవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రెవెన్యూ పరంగా రైతులకు ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కారం చూపాలని చీరాల ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడు ఆదేశించారు. సోమవారం బల్లికురవ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే పనులు చేపట్టాలని చెప్పారు. భూముల ఆన్‌లైన్ పనుల కోసం రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్ పాల్గొన్నారు.



భూములను రీసర్వే చేస్తున్న రెవెన్యూ టీంలు

రీసర్వే పనులు ప్రారంభం

బల్లికురవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లి రెవిన్యూ పరిధిలో సోమవారం నుంచి భూముల రీసర్వే పనులు ప్రారంభమయ్యాయి. సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష మాట్లాడుతూ మొత్తం ఏడు టీంలను ఏర్పాటు చేశామని, రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. రైతులు కూడా దగ్గర ఉండి తమ భూములకు కొలతలు వేయించుకోవాలన్నారు. నెల రోజుల లోపు అన్ని సర్వే నెంబర్లలో కొలతలు పూర్తి చేయిస్తామన్నారు.

బైటమంజులూరులో...

పంగులూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైటమంజులూరు గ్రామంలో సోమవారం నుంచి భూముల రీసర్వే ప్రారంభించినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు. గ్రామ రెవెన్యూ పరిధిలో మొత్తం 550 మంది రైతులు, 1675 ఎకరాల భూ విస్తీర్ణం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. రీ సర్వే ప్రారంభానికి ముందు రెండు విడతలుగా గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించామన్నారు.

గ్రీవెన్స్ ద్వారా ఐదు దరఖాస్తులు

రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ ద్వారా రైతుల నుండి ఐదు దరఖాస్తులు అందాయని తహసీల్దార్ సింగారావు తెలిపారు.

చినగంజాంలో...

చినగంజాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోటుపల్లి గ్రామంలో నిర్వహించిన రీసర్వేలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, డీటీ సుజాత, మండల సర్వేయర్ జీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

యద్దనపూడి మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే ఏలూరి

యద్దనపూడి/మార్టూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సోమవారం యద్దనపూడి మండలంలో పర్యటించారు. ఆయన పార్టీనాయకులతో కలిసి మున్నంగివారిపాలెంలో ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ చెరుకూరి పెద్దనాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిమటావారిపాలెం, తనుబొద్దివారిపాలెం తారురోడ్డును పరిశీలించారు. తరువాత యద్దనపూడి గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాంబాబు ఇంటికి వెళ్లి అతనిని పరామర్శించారు. అనంతరం సూరవరపుపల్లిలో ఇటీవల మృతి చెందిన డీఎస్పీ మద్దులూరి రత్తయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. తరువాత గ్రామంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో గుదే తారకరామారావు, కనపర్తి నాగేశ్వరరావు, కోయ సతీష్, రావిపాటి సీతయ్య, కొర్రపాటి వంశీ, నల్లపనేని రంగయ్యచౌదరి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సోమవారం మార్టూరు మండలంలో ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



మాజీ ఎంపీపీ రాంబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

బల్లికురవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి చేయూత ఇస్తోందని మండల పశువైద్యాధికారి మహేశ్వరరావు చెప్పారు. సోమవారం మండలంలోని వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాలలో పశుఆరోగ్య శిబిరాలను ప్రారంభించారు. 135 దూడలు, 52 గేదెలు, 316 గొర్రెలకు నట్టల నివారణ మందు అందజేశారు. 56 గర్భ కోశ వ్యాధులకు చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో అంబడిపూడి పశువైద్యాధికారి పావనీ కుమారి, గ్రామ పెద్దలు మామిళ్లపల్లి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నట్టల నివారణకు ఉచితంగా మందులు పంపిణీ

మార్టూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు ఉచితంగా నట్టల నివారణ మందులను మండలంలోని కోలలపూడిలో వైద్యాధికారి మాధవీలత, సర్పంచ్ ఎం సతీష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, రంగబాబు, గోరంట్ల లింగయ్య, వెటర్నరీ అసిస్టెంట్ అశ్విని పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

అద్దంకిటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా పశువుల ఆరోగ్యం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని బొమ్మనంపాడు పశువైద్యశాల వైద్యులు ఇ.అశోక్ తెలిపారు. సోమవారం మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో పశు ఆరోగ్యం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు చూడి పరీక్షలు, ఎద ఇంజక్షన్లు వేశారు.



పశుపోషకులకు మందులను అందజేస్తున్న డాక్టర్ అశోక్

పశువుల కోసం వైద్య శిబిరాలు

మేదరమెట్ల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పశువుల ఆ రోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని అద్దంకి పశువైద్యశాల ఏడీ డాక్టర్ ఎం. మోహనరావు చెప్పారు. మండలంలోని కొరిశపాడు, తిమ్మనపాలెం, యర్రబాలెం గ్రామాలలో మేదరమెట్ల, కొరిశపాడు పశు వైద్యశాల వైద్యులు సైదయ్య, డాక్టర్ బి. వెంకట్రావుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. యర్రబాలెంలో జరిగిన పశు ఆరోగ్యం శిబిరాన్ని ఏడీ పరిశీలించారు.

భార్యను వేధిస్తున్నాడంటూ ఇంటిపై దాడి

దొనకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తన భార్యను వేధిస్తున్నాడని ఘర్షణకు పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని రుద్రసముద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. గ్రామంలోని మాట వెంకటేశ్వర్లు, తనపక్క ఇంట్లో నివసిస్తున్న దుగ్గెంపూడి మల్లికార్జున భార్యను తరచూ వెంటపడి వేధిస్తున్నాడు. ఈక్రమంలో వెంకటేశ్వర్లును మందలించేందుకు మల్లికార్జున, మరికొందరు అతని ఇంటి వద్దకు వెళ్లారు. ఆసమయంలో వెంకటేశ్వర్లు లేకపోవటంతో అతని భార్య శివమ్మతో గొడవపడి కులం పేరుతో దూషించారు. అనంతరం మల్లికార్జున, అతని వర్గీయులు వెంకటేశ్వర్లు ఇంటిపక్కన ఉన్న రేకులషెడ్డును ధ్వంసం చేసి నిప్పుపెట్టారు. రేకులషెడ్డులో ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు, ఆటో దగ్ధమయ్యాయి. వెంకటేశ్వర్లు భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అలాగే, మల్లికార్జున భార్య ఫిర్యాదు మేరకు మాట వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువర్గాల కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న త్రిపురాంతకం సీఐ హస్సాన్ రుద్రసముద్రం గ్రామాన్ని సందర్శించారు. సంఘటన జరిగిన తీరును విచారించారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనకుండా సోమవారం పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు.



ధ్వంసమైన రేకుల షెడ్డు

టెన్నిస్ బాల్ క్రికెట్ విజేత కారుమంచి

కొండపి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ కొండపి నియోజకవర్గ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో కారుమంచి జట్టు విజయం సాధించింది. కొండపి జట్టు రన్నర్స్‌గా నిలిచింది. గొడుగుపాలేనికి చెందిన తల్వార్ జట్టు తృతీయ స్థానం సాధించింది. సోమవారం ఏర్పాటు చేసిన ముగింపు సభలో విజేతలైన జట్లకు వరుసగా రూ.50,116, రూ.30,116, రూ.15,116 డిప్యూటీ కలెక్టర్ ఎ.కుమార్, తహసీల్దార్ పి.మురళి, సీఐ జి.సోమశేఖర్ అందజేశారు. వీటితోపాటు బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మన్‌లకు జ్ఞాపికలు ఇచ్చారు. కార్యక్రమంలో కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, ఎన్ఆర్‌కే యూత్ అధ్యక్షుడు, పోటీల నిర్వాహకుడు నేతి రవి కుమార్ పాల్గొన్నారు.



కప్ అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కుమార్, సీఐ సోమశేఖర్

అవీఇవీ

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి గోపినాథ్

బల్లికురవ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపినాథ్ చెప్పారు. సోమవారం మండలంలోని అంబడిపూడి, గుంటుపల్లి గ్రామాలను మలేరియా అధికారి పరిశీలించారు. గతంలో డెంగ్యూ జ్వరాలు సోకిన గ్రామాలను పరిశీలిస్తున్నామని, ఈ ఏడాది ఎలాంటి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు చేపడతామని తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామాలను పరిశీలిస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది కూడా గ్రామాలలో ఇంటింటా సర్వేలను ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం గుంటుపల్లి పీహెచ్‌సీని సందర్శించి వ్యాక్సిన్ నిల్వలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి రమీజ్‌అహ్మద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలో శ్రీనివాసరెడ్డి ప్రతిభ



తృతీయ బహుమతి సాధించిన చిత్రం

చినగంజాం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామపంచాయతీ పరిధిలోని సుందరయ్యనగర్ గ్రామానికి చెందిన సూరిన శ్రీనివాసరెడ్డి అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలో మూడో బహుమతి సాధించాడు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన కోనసీమ చిత్రాకళాపరిషత్ ఆధ్వర్యంలో 34వ చిత్రాకళా బ్రహ్మోత్సవం, 35వ అంతర్జాతీయ చిత్రకళాప్రదర్శన 2025లో తృతీయ బహుమతి మెగా బ్రహ్మోత్సవం అవార్డును శ్రీనివాసరెడ్డి అందుకున్నాడు. సంక్రాంతి పండుగ సంబరాలను ప్రతిబింబిస్తూ గీసిన చిత్రానికి మూడో బహుమతి లభించినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. శ్రీనివాసరెడ్డికి జిల్లా చిత్రకారుల సంఘం అధ్యక్షులు బండారి త్యాగరాజు, కార్యదర్శి అచ్యుతశ్రీనివాస్(మణిఆర్ట్స్)లు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు గ్రంథాలయ రుసుం చెల్లింపు



సభ్యత్వాలు చూపుతున్న విద్యార్థులు

చీరాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలంలో దేశాయిపేట పంచాయతీ పరిధిలోని వేటపాలెం శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుకునేందుకుగాను హైస్కూల్ విద్యార్థులు 20 మందికి రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య గ్రంథాలయ రుసుంను సోమవారం చెల్లించారు. దీంతో సభ్యత్వ నమోదు కార్డులను గ్రంథపాలకులు ఆ విద్యార్థులకు అందజేశారు. చిన్నప్పటి నుంచి గ్రంథాలయాలకు వెళ్లి చదవటం అలవాటు చేసుకుంటే ఒనగూరే ప్రయోజనాలను వారు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం, గ్రంథపాలకురాలు పాల్గొన్నారు.

డీకే పట్టాలు మంజూరు చేయాలి

యద్దనపూడి/మార్టూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి గ్రామానికి చెందిన 50 మంది షెడ్యూలు కులాలు వారికి డీకే పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం బాపట్లలో గ్రీవెన్స్‌లో ఆర్డీవో గ్లోరియాకు వినతిపత్రం అందజేశారు. యనమదల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మూడు సర్వేనంబర్లలో సుమారు 20 ఎకరాలు భూమిని షెడ్యూలు కులాలు వారికి పంపిణీ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నలమాల తిరుపతిరావు, కోవూరి వెంకట్రావు, మొలతోటి శేఖర్, విపర్ల అబ్రహం, పల్లెపోగు రాధిక, సౌజన్య, సరోజిని, సరళ, నాగేంద్రమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

రూ.9లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

ఇంకొల్లు, జనవరి 20,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు బస్టాండు నుంచి కడవకుదురు రోడ్డుకు వెళ్లే రహదారిలో రూ.9లక్షలతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ ఆనంద్ తెలిపారు. ఈ రహదారిలో నెలరోజుల క్రితం బ్రిడ్జి కుంగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయని, కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఇంకొల్లు పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని పూర్తిగా తొలగించాలని పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లకు సూచించారు.

మందు పిచికారీలో జాగ్రత్త తీసుకోవాలి

లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిభశ్రీ

పంగులూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న పైరులో కలుపు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, కలుపు మందు పిచికారీ చేసే సమయంలో నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలని లాం ఫాం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎస్.ప్రతిభశ్రీ చెప్పారు. మండలంలోని కొండమూరు, రేణంగివరం గ్రామాలలో కలుపు మందు పిచికారీ కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటను లాం ఫాం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిభశ్రీ, డాక్టర్ దయానాగ్రేస్‌లు సోమవారం పరిశీలించారు. అట్రాజిన్ అనే కలుపు మందు పిచికారీ కారణంగా మొక్కజొన్న పంట పాడైందని రైతులు, వ్యవసాయాధికారి ఇచ్చిన సమాచారం మేరకు సాగులో ఉన్న మొక్కజొన్నను పరిశీలించారు. కలుపు మందు పిచికారీ చేసిన వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట మార్టూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కె.వి. శ్రీనివాసరావు, ఎ.ఓ. సుబ్బారెడ్డి, సహాయకులు దినేష్ పాల్గొన్నారు.



దెబ్బతిన్న మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న లాంఫాం శాస్త్రవేత్తలు

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

టంగుటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్లపాడులో నడుస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఎనిమిది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.27,440 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రకృతి, సంస్కృతి ప్రభుత్వ ప్రాధాన్యాలు

- ఈ దిశగానే పర్యాటక అభివృద్ధి
- రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్

సూళ్లూరుపేట/తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని సంస్కృతిని గుర్తుపెట్టుకోవడమే కాకుండా వాటి ద్వారా పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ఉద్దేశమని తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో సోమవారం జరిగిన మూడు రోజుల పక్షుల పండుగ ముగింపు సభలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వం పర్యాటకరంగాన్ని ప్రోత్సహిస్తుందని, అందులో భాగంగానే నాలుగేళ్లుగా నిలిచిపోయిన పక్షుల పండుగను మళ్లీ నిర్వహించామని తెలిపారు. ఎన్నో వేల కిలోమీటర్లు ప్రయాణించి ఈ ప్రాంతానికి వచ్చే విదేశీ వలసపక్షుల విన్యాసాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయన్నారు. సీఎం సూచనల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించామన్నారు.

● ఐదుగురు ఎమ్మెల్యేల హాజరు

ముగింపు సమావేశంలో గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, చీరాల ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, కురుగుండ్ల రామకృష్ణ, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎంఎం కొండయ్యలు పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి, చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్టు సెల్వం, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తానంకి నానాజీ, మాజీ మంత్రి పరసారత్నం, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, టూరీజం ఆర్డీ రమణప్రసాద్, ఆర్డీవో కిరణ్మయి, జిల్లా


కృతిశెట్టి స్టెప్పులు


సూళ్లూరుపేట కళాశాల మైదానంలో సోమవారం జరిగిన పక్షుల పండుగ ముగింపు సభలో జనం

జాతరలా ఫెస్టివల్!

- ఘనంగా ముగిసిన పక్షుల పండుగ
- భారీగా తరలివచ్చిన జనం

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల తరువాత మూడురోజులపాటు జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా ముగిసింది. తొలిరోజు ఏర్పాట్లలో తడబడినా మిగిలిన రెండు రోజులూ అన్ని విభాగాల అధికారులూ సమన్వయంతో సక్సెస్ చేశారు. ముఖ్యంగా సూళ్లూరుపేట ప్రభుత్వ కళాశాల మైదానంలో సాయంత్రాలు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు హుషారెత్తించాయి. సినీ నటులూ, గాయకులూ రావడంతో జనం పోటెత్తారు. మూడోరోజు సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వేలాదిగా పక్షుల పండుగకు తరలివచ్చారు. రంగురంగుల యూనిఫారాల్లో పిల్లలు సందడి చేశారు. నేలపట్టులో పక్షుల వీక్షణకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అటకానితిప్ప వద్ద కూడా ఆటలతో సందడిగా గడిపారు. బీవీపాలెం పడవల రేవు మూడో రోజు కూడా కిక్కిరిసిపోయింది. సూళ్లూరుపేట ప్రధాన వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద జనం బారులు తీరారు. ఈ ప్రాంతంలో జరిగే చెంగాళమ్మ జాతరను ఫ్లెమింగో ఫెస్టివల్ తలపించింది. మరోవైపు ఆటల్లోనూ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● ఉత్సాహంగా క్రీడలు

నిజానికి తొలిరోజు కురిసిన వర్షంతో ఆదివారం సాయంత్రం వరకు క్రీడలు జరగలేదు. నిర్వాహకులు ఆగమేఘాలమీద మట్టి, ఇసుక తోలి చదును చేసి క్రీడాప్రాంగణాన్ని సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచే కబడీ, వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆడారు. రాత్రి 7 గంటల వరకూ క్రీడా పోటీలు జరిగాయి.

ముగింపు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించేందుకు ప్రజలు పోటెత్తి వచ్చారు. సూళ్లూరుపేట కాలేజీ మైదానం నిండిపోయి, ప్రజలు బయటకూడా బారులు తీరారు. సినీరంగానికి చెందిన కళాకారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆపి సభను ప్రారంభించారు. ఇటువంటి సందర్భంలో ఎక్కువ సేపు ఉపన్యాసాలు మంచిది కాదనే ఉద్దేశంతో మంత్రి తర్వాత ప్రసంగించిన వారంతా సంక్షిప్త సందేశాలతో ముగించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పండుగ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఇక జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సైతం ఎమ్మెల్యే విజయశ్రీని అనుసరించి ముగించేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సైతం 'ఇప్పుడు మమ్మల్ని పట్టించుకునే పరిస్థితి జనాలకు లేదు' అంటూ ధన్యవాదాలతో ముగించారు. హీరోయిన్లు సంయుక్త మీనన్, కృతిశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంగ్లీ పాట హుషారెత్తించింది.


వేదికపై సంయుక్త మీనన్


పాటలు పాడుతున్న మంగ్లీ



వేణుగోపాలుడికి పూర్వ వైభవం

- ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం
- రూ.16.70 కోట్లతో టెండర్లు పిలిచిన దేవదాయ శాఖ
- రెండేళ్లలో పనులు పూర్తి చేసేలా లక్ష్యం

- వివరాలు 7లో..

రూ.86.21 కోట్ల మద్యం హాంఫట్!

పండుగ రోజుల్లో తెగతాగేశారు! ● అమ్మకాలు పెరిగినా రాబడి తక్కువే



నెల్లూరు(క్రైం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆరంభం నుంచే జిల్లాలో మందుబాబులు తెగ తాగేశారు. జనవరి 1వ తేదీ వేడుకల నుంచి సంక్రాంతి పండుగ ముగింపు వరకు రూ.86.21 కోట్ల మద్యం వ్యాపారం జరిగింది. అయితే, గత ఏడాదితో పోల్చుకుంటే అమ్మకాలు పెరిగినా రాబడి మాత్రం తక్కువగా వచ్చింది. ఇందుకు ప్రధాన కారణం కూటమి ప్రభుత్వంలో మద్యం ధరలు తగ్గించడమే. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు వైన్‌షాపులను ఏర్పాటు చేయడంతోపాటు మందుబాబులు అధికంగా సేవించే మద్యం ధరలను తగ్గించారు. ప్రధానంగా మ్యాన్స్‌హౌస్ వంటి బ్రాండ్ల ధరలను తగ్గించడంతోపాటు నాణ్యత కలిగిన పాత బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురావడం, రూ.99లకే క్వార్టర్ మద్యం అందుబాటులోకి తీసుకురావడంతో మందుబాబులు ఈ ఏడాది అధికంగా మద్యం సేవించినా రాబడి మాత్రం గత ఏడాదితో పోల్చుకుంటే తక్కువగానే ఉంది. 2024లో రూ.94.36 కోట్ల 1,07,811 ఐఎంఎల్ కేసులు, 25,930 బీర్ కేసుల విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది జనవరి 1 నుంచి 19వ తేదీ వరకు 1,16,952 ఐఎంఎల్ కేసులు, 34,034 బీర్ కేసులను విక్రయించారు. అయితే, రాబడి మాత్రం రూ.86.21 కోట్లు వచ్చింది.

అర్జీల్లో ఆక్రందన!

- ముగిసిన రెవెన్యూ సదస్సులు
- 731 గ్రామాల్లో 8,132 అర్జీల స్వీకరణ
- పరిష్కారమైనవి 2,617
- భూసమస్యలపైనే భారీగా ఫిర్యాదులు

నెల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూ సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో రెవెన్యూ సదస్సులను పరిశీలిస్తే అర్థమవుతుంది. రికార్డుస్థాయిలో 8,132 సమస్యలు ఈ సదస్సుల్లోనే వెలుగు చూశాయంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది. ఈ సదస్సుల వేదికగా గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ పనితీరు వేలెత్తి చూపిస్తోంది. ఎన్నడూ లేని విధంగా వైసీపీ హయాంలో భూసమస్యలు విపరీతమయ్యాయి. నాడు అధికార బలంతో సామాన్యుల భూములను వివాదంలోకి తీసుకెళ్లారు. విచ్చలవిడిగా భూరికార్డులు మార్చేయడం, ఖాళీగా ఉంటే ఆక్రమించేయడం వంటి అనేక సంఘటనలు నాడు వెలుగులోకి వచ్చాయి.

● క్యూ కట్టిన బాధితులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధుల వద్దకు బాధితులు బారులు తీరారు. ఈ పరిస్థితి చూసి చలించిపోయిన ప్రభుత్వ పెద్దలు భూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా డిసెంబరు

- మిగతా 6లో..


ఉదయగిరి మండలం బిజ్జంపల్లి సచివాలయంలో గత నెల 31న జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులకు అర్జీ ఇచ్చేందుకు ఎగబడుతున్న ప్రజలు (ఫైల్)

బీజేపీ జిల్లా సారథి ఎవరో!?

నామినేషన్లు దాఖలు చేసిన నలుగురు ● నేడు ప్రకటించనున్న అగ్రనేతలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా సారథి ఎవరన్నది మంగళవారం తెలిపోనుంది. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యకర్తల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. ఈ క్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుత పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డితోపాటు భరత్‌కుమార్ యాదవ్, బైరి శ్రీనివాసులు, మొగరాల సురేష్‌లు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్‌లు దాఖలు చేసే సమయంలో బీజేపీ జిల్లా కార్యాలయం కార్యకర్తలతో కోలాహలంగా మారింది.

'జేఈఈ మెయిన్స్'కు సర్వం సిద్ధం

● రేపటి నుంచి రెండు షిఫ్టులలో పరీక్ష

నెల్లూరు(విద్య), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరులోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, పొట్టేపాళెంలోని ఇయాన్ డిజిటల్ జోన్, తిరుపతి జిల్లా కోటలోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్‌కు అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఈ పరీక్షకు అడ్మిట్ కార్డులను జాతీయ పరీక్షల సంస్థ ఇప్పటికే విడుదల చేసిందని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టులలో పరీక్షలు జరుగుతాయన్నారు.

● కఠిన నిబంధనలు

పరీక్ష కేంద్రాల్లో నిబంధనలు కఠినంగా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఎన్‌టీఏ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసిన అడ్మిట్ కార్డు, ఆన్సర్‌షీట్‌పై అతికించేందుకు పాస్‌పోర్టు సైజ్‌ఫొటో, దరఖాస్తు చేసిన సమయంలో అప్‌లోడ్ చేసిన గుర్తింపు కార్డు ఒరిజినల్, బాల్ పాయింట్ పెన్, నీళ్లు బయటకు కనిపించే వాటర్ బాటిల్ తీసుకెళ్లాలని సూచించారు. అలాగే గేట్ మూసివేసే సమయం తరువాత పరీక్ష ప్రారంభం అయ్యే సమయానికి 30 నిమిషాల ముందు అభ్యర్థులను అనుమతించరన్నారు. అదేవిధంగా పరీక్ష రాసే విద్యార్థులు తమ ధ్రువీకరణను తెలిపే ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు తీసుకెళ్లాలన్నారు. 2 గంటల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

కడుపు... కోతే!!



- కాన్పుల్లో సిజేరియన్లకే ప్రాధాన్యం
- సుఖ ప్రసవానికి అవకాశం ఉన్నా సర్జరీకే మొగ్గు
- కాసుల కోసం ప్రైవేటు వైద్యుల నిర్వాకం
- రూ.వేల నుంచి లక్షల్లో వసూలు
- జిల్లాలో ఏటా 35 శాతం 'కోత' ప్రసవాలు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ పెరుగుతున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు

విడవలూరు మండలానికి చెందిన ఓ గర్భిణికి 20 రోజుల్లో నెలలు నిండుతున్నాయనగా కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ గర్భిణికి స్కానింగ్ తీయించగా ఉమ్మనీరు తక్కువగా ఉందని, వెంటనే సిజేరియన్ చేయాలని లేదంటే బిడ్డకు ప్రమాదని డాక్టర్ హెచ్చరించారు. అనంతరం ఆ గర్భిణికి సిజేరియన్ సర్జరీ చేశారు. ఇందుకు రూ.60 వేలు వసూలు చేశారు. తీరా స్కానింగ్ రిపోర్టును తెలిసిన మరో డాక్టర్‌కు చూపించగా ఉమ్మనీరు బాగుందని ఎలాంటి ఇబ్బందులు లేదని తెలుపడంతో మోసపోయామని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేసిన వైద్యురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

...ఇలా అవసరం లేకపోయినా ఒకటి కాదు రెండు కాదు జిల్లాలో వేలసంఖ్యలో సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. ప్రతి మహిళ జీవితంలో అపురూపమైన ఘట్టం తల్లికావడం. మరొకరికి జన్మనివ్వడమైనది అనిర్వచనీయ మైన అనుభూతి. ఇందుకోసం ప్రతి స్త్రీ ఎదురుచూస్తుంది. గర్భం దాల్చిన తర్వాత నవమాసాలు మోసి బిడ్డను ప్రసవిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో మినహా సాధారణంగా గర్భిణులందరికీ సుఖ ప్రసవమే(సాధారణ కాన్పు) చేయాలనేది ప్రభుత్వ నిబంధన. అయితే ప్రస్తుత కాలంలో ఎంతో మంది వైద్యులు సంపాదనే ధ్యేయంగా, కాసుల కక్కుర్తితో అవసరం ఉన్నా, లేకపోయినా 'కడుపు కోత' కోస్తున్నారు.

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ప్రసవాలను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా 42శాతం సిజేరియన్ సెక్షన్ డెలివరీలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలోనూ ఇదే పరిస్థితి. వైద్యులను దేవుళ్లగా చూసే సమాజంలో ప్రసవం కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే సుఖ ప్రసవం చేయాల్సిన ఆ వైద్య నారాయణులు ఏమాత్రం కనికరం లేకుండా సిజేరియన్ తప్పదంటూ 'కోత' కోస్తున్నారు. ప్రస్తుతం ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో 10 నుంచి 15 శాతం మాత్రమే సిజేరియన్లు అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. కానీ జిల్లాలో 35 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయి. వైద్యులు డబ్బుకే ప్రాధాన్యమిస్తూ, గర్భిణులను, వారి కుటుంబ సభ్యులను భయాందోళనకు గురిచేసి శస్త్రచికిత్సల ద్వారా కాన్పులు చేస్తున్నారు. ఇందుకోసం రూ.వేలు, లక్షలు వసూలు చేస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్ల సంఖ్య పెరగడం విచారించాల్సిన విషయం.

● ఏటా 12 వేలకుపైగా...

జిల్లా వ్యాప్తంగా ఏటా 40 వేలకుపైగా ప్రసవాలు జరుగుతున్నాయి. వీటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10వేల వరకు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో 30 వేలకుపైగా కాన్పులు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం లేక ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటున్నారు. ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి మరుసటి ఏడాది మార్చి వరకు జరిగే ప్రసవాలను వైద్య ఆరోగ్యశాఖ లెక్క కడుతోంది. ఈ లెక్కన ప్రసవాలలో సిజేరియన్‌లే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించింది. మొత్తం కాన్పుల్లో 35 శాతం సిజేరియన్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ లెక్కన ప్రతి సంవత్సరం 12 వేలకుపైగానే సిజేరియన్లు జరుగుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఆపరేషన్ సులభతరం కావడానికితోడు పెద్ద మొత్తంలో డబ్బు వస్తుండటంతో ఎక్కువ మంది వైద్యులు సిజేరియన్‌కే మొగ్గు చూపుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే గర్భిణుల ఆరోగ్యంపై సిజేరియన్ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. కాగా, నెల్లూరులోని జీజీహెచ్ ప్రసూతి విభాగంలో ప్రతినెల 350కిపైగా ప్రసవాలు జరుగుతుండగా ఇక్కడ కూడా ఎక్కువ సిజేరియన్లు చేస్తున్నట్లు సమాచారం.

● ఆసుపత్రులపై పర్యవేక్షణ ఏది..?

ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేపట్టే ప్రసవాలపై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. ఆయా ఆసుపత్రుల పనితీరును పరిశీలించి, కాన్పుల గణాంక రికార్డులు తనిఖీ చేసి, అవసరమైన వారికే సిజేరియన్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అప్పుడప్పుడూ ఆసుపత్రుల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి సిజేరియన్లు చేయవద్దని హెచ్చరిస్తున్నారేగానీ, సిజేరియన్లు చేస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోకపోవటంతో వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం కాన్పులు ఇలా...

సంవత్సరం	ప్రసవాలు	సాధారణ కాన్పులు	సిజేరియన్‌లు
2021- 22	41,387	26,804	14,583
2022- 23	43,523	27,128	16,395
2023- 24	44,886	33,638	11,228
2024- 25	20,462	11,411	9,051

(నవంబరు వరకు)

ఆత్మకూరుకు చెందిన ఓ గర్భిణి మూడో నెల నుంచి సామాజిక ఆసుపత్రిలో చూపించుకుంటోంది. అక్కడ స్కానింగ్ కూడా తీసి ఆరోగ్యం బాగుందని సాధారణ కాన్పు జరుగుతుందని వైద్యులు తెలిపారు. అయితే పురుడు కోసం ఆత్మకూరు పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి వైద్య పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉందని సిజేరియన్ చేయాల్సి వస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు బాగుందని చెప్పారని మొత్తుకున్నా సిజేరియన్‌కే వైద్యులు మొగ్గుచూపటంతో చేసేది లేక ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది.

చర్యలు తీసుకుంటాం

ప్రైవేట్ ఆసుపత్రుల్లోనే ఎక్కువగా సిజేరియన్లు జరుగుతున్న మాట వాస్తవమే.. ప్రభుత్వ కూడా సిజేరియన్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఏఏ ఆసుపత్రులు ఇలాంటి ఆపరేషన్లు ఎక్కువగా చేస్తున్నాయి, అపరేషన్ల అవసరమెంత అన్న కోణంలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అత్యవసరమైతే తప్ప సిజేరియన్ చేయరాదన్న నిబంధన ఉన్నా దీన్ని ఉల్లంఘించి శస్త్రచికిత్సలు చేస్తున్నార్న విమర్శలున్నాయి.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో







పిల్లల కేరింతలు..





పిట్టల కిలకిలలు..







కళకళలాడిన నేలపట్టు



ఘనంగా జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్

మూడు రోజులూ పోటెత్తిన జనం


చెరువు కట్టల మీద విద్యార్థుల కేరింతలూ.. చెరువులోని చెట్లమీద పిల్లపక్షుల కిలకిలలూ.. ఫ్లెమింగో ఫెస్టివల్ మూడోరోజున నేలపట్టు కళకళలాడింది. రకరకాల యూనిఫారాల్లో ఎటు చూసినా పిల్లలే సందడిగా కనిపించారు. చెరువులోని చెట్లమీద రకరకాల పక్షి పిల్లలు ముక్కులతో పొడుచుకుంటూ, రెక్కలు విప్పుకుని ఎగరడం నేర్చుకుంటూ, చెరువులో వాలి జలకాలాటలాడుతూ అలరించాయి. సెప్టెంబరు నుంచీ వివిధ దేశాల నుంచీ విడతలవారీగా వస్తున్న పక్షులు ఈ చెట్లమీద గూళ్లు పెట్టుకుని, సహచరులను ఆకర్షించి జతకట్టి, గుడ్లుపెట్టి పొదిగాయి. ఇప్పుడీ పిల్లలు రెండు నెలల వయసుకు చేరుకున్నాయి. బుజ్జి పిట్టల బొజ్జనింపి బువ్వపెట్టేందుకు అమ్మ పక్షులు ఆహారం వెతుకుతూ వెళ్లిపోయాయి. ఈ పిల్ల పిట్టలు ఎండకు రెక్కలార్చుకుంటూ, ముక్కులు పదును పెట్టుకుంటూ గడుపుతున్నాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌లు తమ కెమెరాల్లో బంధించారు.











ఉల్లాసంగా ఉత్సాహంగా పడవల్లో..



తడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : పక్షుల పండుగ చివరిరోజు సోమవారం పర్యాటకులతో పులికాట్ సరస్సు పులకించిపోయింది. పెద్ద సంఖ్యలో పర్యాటకులు విద్యార్థులు పడవ షికారుకు ఉత్సాహం చూపారు. కాళహస్తి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి పరిసర ప్రాంతాల నుంచి పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక బస్సుల్లో పడవ షికారుకు వచ్చారు. పులికాట్ తీరాన నీళ్లలో ఉత్సాహంగా గంతులు వేశారు. ఇక్కడి వేదికమీద స్థానిక విద్యార్థులతో పాటు కొందరు చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చివరిరోజున సాయంత్రం 6 గంటల వరకు పడవ షికారు జరిగింది.

పడవ షికారు అద్భుతం



పులి కాట్‌లో పడవలో తిరగడం ఆనందంగా ఉంది. ఎటు చూసినా నీళ్లే. ఇదే తొలిసారి నేను పడవ ఎక్కడం. నేలపట్టులో పక్షులను చూసి ఇక్కడికి వచ్చాం. ఎన్ని పక్షులో అక్కడ!

- తేజశ్విని, 6వ తరగతి, పెద్దకన్నలి, తొట్టంబేడు మండలం

సూళ్లూరుపేటలో సందడే సందడి

సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగ చివరిరోజు పర్యాటకులతో కళాశాల మైదానం సందడిగా కనిపించింది. పలు ప్రాంతాల విద్యార్థులు, పర్యాటకులు స్టాల్స్‌ను చూస్తూ ఎంజాయ్ చేశారు. ముఖ్యంగా షార్ రాకెట్‌లను చూస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం సైతం పర్యాటకుల కోసం పూర్తి స్థాయిలో బస్సులు ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ఆటోలే దిక్కుఅయ్యాయి. కళాశాల మైదానం చుట్టుపక్కల రోడ్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఆటల వేదికలా అటకానితిప్ప



పర్యావరణం కాపాడటంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓజిలి/సూళ్లూరుపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అటకానితిప్ప ప్రాంతంలో పక్షులను చూసేందుకు సోమవారం విద్యార్థులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సత్యవేడు, పల్లమాల, బాకరాపేట, పలమనేరు, చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి వందలాదిగా విద్యార్థులు తరలిరావడంతో అటకానితిప్ప కిటకిటలాడిపోయింది. ఇక్కడ పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశంలో ఆటల్లో పిల్లలు సందడిగా గడిపారు. పక్షుల ప్రదర్శనశాలలో పులికాట్, అటకానితిప్ప, నేలపట్టు, సమీప ప్రాంతాల విశిష్టతపై ప్రదర్శించిన ఫిల్మ్‌షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. విద్యార్థుల సందేహాలకు సిబ్బంది సమాధానాలు ఇచ్చి మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, పక్షులపై అవగాహన కల్పించారు. ఈ ప్రాంతానికి సమీపంలో పులికాట్‌లో నీరు ఎండిపోవడంతో పక్షులు దూరంగా వెళ్లిపోవడంతో సందర్శకులు ఒకింత నిరాశకు గుయ్యారు.

సంతోషంగా ఉంది



ఫ్లెమింగో ఫెస్టివల్‌కు రావడం వల్ల చాలా తెలుసుకున్నాం. అటకానితిప్పలో ఫిల్మ్‌షో చాలా బావుంది. బీవీపాళెం రేవులో పడవ ప్రయాణం వింత అనుభూతిని ఇచ్చింది.

- టి నందిని, 10వ తరగతి, ఇరుగుళం స్కూల్, సత్యవేడు మండలం.

అర్జీల్లో ఆక్రందన

(5వ పేజీ తరువాయి)

6 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 731 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులను పర్యవేక్షించడానికి ప్రతి మండలానికి జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ఆనంద్ నియమించారు. ప్రతి మండలంలో రోజుకొక గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులకు ప్రత్యేకాధికారులతోపాటు తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్వోలు పూర్తి రికార్డులతో హాజరయ్యారు. భూవివాదాలకు సంబంధించిన ప్రతి అర్జీని స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరించదగిన సమస్యలను వెంటనే పరిష్కరించారు. కాగా రెవెన్యూ సదస్సులు తొలివారంలో ఆశించిన స్థాయిలో జరగలేదు. వీటిపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువ అర్జీలు అందలేదు. అయితే ఆ తర్వాత జిల్లా ఉన్నతాధికారులు ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టడంతో స్పందన పెరిగింది. తొలి నాలుగు రోజుల్లో కేవలం 459 అర్జీలు మాత్రమే వచ్చాయి. అంటే సరాసరి రోజుకు 115 అర్జీలు మాత్రమే రాగా, ఆ తర్వాత రోజుకు సరాసరి 300 వరకూ అర్జీలు అందడం గమనార్హం.

● ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి

ఈ నెల 8వ తేదీనాటికి సదస్సులు ముగియగా, వచ్చిన అర్జీలన్నిటినీ ఆన్‌లైన్ చేసే ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో మొత్తం అందిన అర్జీలు 8,132గా తేలాయి. ఇందులో ఎక్కువగా ఆర్‌వోఆర్ (భూహక్కులు)కు సంబంధించినవే ఉన్నాయి. ఇవే సగానికిపైగా ఉండటం విశేషం. తమ భూమిని మరొకరు వారి పేర్లపైకి ఎక్కించుకున్నారని.. తమ పేర్లు ఉండాల్సిన చోట ప్రభుత్వం అని పెట్టి ఉన్నారని.. నోషనల్ ఖాతా అని చెప్పి నిషేధిత జాబితాలో చేర్చారని.. ఇలా పలురకాల భూరికార్డులకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయి. ఆ తర్వాత స్థానంలో అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన సమస్యలు, భూ హద్దులకు సంబంధించిన సమస్యలు నమోదయ్యాయి. వీటిలో ఇప్పటివరకు 2,617 అర్జీలను రెవెన్యూ అధికారులు పరిష్కరించగా, మరో 5,515 అర్జీలు పరిష్కార దశలో ఉన్నాయి. వీటిలో కొన్ని తహసీల్దార్ స్థాయిలో విచారణ జరుగుతుండగా, మరికొన్ని అక్కడ విచారణ పూర్తయి ఆర్‌డీవో స్థాయికి చేరాయి. ఈ అర్జీల పరిష్కారస్థితిని జేసీ కే కార్తీక్ నిరంతరం సమీక్షిస్తున్నారు. రెగ్యులర్‌గా టెలికాన్ఫరెన్స్‌లో ఆర్‌డీవోలు, తహసీల్దార్లతో మాట్లాడుతూ సూచనలిస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న వివాదాలు మినహా మిగిలిన వాటిని నెలలోపుగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● సాయిల్ కన్జర్వేషన్ ఏడీఏ శ్రీనివాసరావు

● ఉదయగిరిలో దుకాణాల తనిఖీ



గోదాములో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్ర యిస్తే కఠిన చర్యలు తప్పవని నెల్లూరు సాయిల్ కన్జర్వేషన్ ఏడీఏ శ్రీనివాసరావు ఎరువుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని క్రయ, విక్రయ రిజిస్టర్లను పరిశీలించి గోదాముల్లో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడు తూ వ్యాపారులు ఎమ్మార్పీ ధరకే ఎరువులను విక్రయించాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు తప్పనిసరిగా కొనుగోలు చేసిన వాటికి బిల్లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రయంలో వీరారెడ్డి, మల్లికార్జున, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన శాంతిభద్రతలు అందిస్తా

● నెల్లూరు నగర డీఎస్పీ సింధుప్రియ



బాధ్యతలు చేపడుతున్న సింధుప్రియ

నెల్లూరు (క్రైం), జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాలికల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు అందిస్తామని నెల్లూరు నగర డీఎస్పీ పెనర సింధుప్రియ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో ఆమె నగర డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. నగరంలోని సీఐలు ఆమెకు పుష్పగుచ్చాలు ఇచ్చి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా సింధుప్రియ మాట్లాడుతూ తనకు ఇదే తొలిపోస్టింగ్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు తాము తీసుకోను న్న చర్యలకు సహకరించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను, అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్యను డీఎస్పీ మర్యాద పూర్వకంగా కలిశారు.

ఉపాధిలో దొంగలు

● వార్షిక ఆడిట్‌తో వెలుగులోకి అక్రమాలు

● బాధ్యులపై సస్పెన్షన్ వేటు

నెల్లూరు (జడ్పీ), జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు పని కల్పించి, పట్టెడన్నం పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో దొంగలు పడ్డారు. పేదలకు ఇవ్వాల్సిన సొమ్మును గద్దల్లా తన్నుకుపోతున్నారు. కంచే చేను మేసింద న్న చందంగా పథకాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన సిబ్బందే చేతివాటం ప్రదర్శిస్తూ, అందినంత దోచుకుంటున్నారు. ఇలా ప్రతి సంవత్సరం జరుగుతూనే ఉంది. ఈ అక్రమాలు తర్వాతి ఏడాది నిర్వహించే ఆడిట్‌లో కొంత వరకు వెలుగు చూస్తున్న విషయం విదితమే. తాజాగా జిల్లాలోని సైదాపురం, వింజమూరు మండలాల్లో ఆడిట్ మొదలవగా భారీగా ఉపాధి సొమ్ము తినేయడాన్ని గుర్తించిన అధికారులు బాధ్యులపై సస్పెన్షన్ వేటు వేశారు.

12మందిపై వేటు

జిల్లాలో గతేడాది జరిగిన 'ఉపాధి' పనులకు సంబంధించి ఆడిట్ ప్రారంభమైంది. తొలి గా సైదాపురం మండలంలో అధికారులు ఆడిట్ నిర్వహించారు. ఆ మండలంలో రూ.8.87 కోట్ల పనులు జరగ్గా అందులో రూ.49 లక్షల మేర నిధులు తినేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఆ సొమ్ము రికవరీకి నోటీసులు జారీ చేయడంతోపాటు నిధులు తినేసిన ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఒక ఈసీ, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. అలాగే వింజమూరు మండలంలో రూ. 11కోట్ల మేర పనులు జరగ్గా రూ.13.75 లక్షల నిధులను తినేసినట్లు అధికారులు తేల్చారు. ఆ నిధుల రికవరీకి నోటీసులు జారీ చేయడమేకాక ఇద్దరు టీఏలు, ఒక ఈసీ, ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడి అవినీతికి ఉపాధి పథకం పనులే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం కావలి మండలంలో ఆడిట్ ప్రారంభమైంది. అలాగే అన్ని మండలాల్లోనూ ఆడిట్‌ను పూర్తిస్థాయిలో నిర్వహించనుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

చౌకిచర్ల పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

విడవలూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : విడవలూరు మండలం చౌకిచర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మధుసూదన్‌రావును సస్పెండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ కార్యదర్శి గతంలో కొడవలూరు మండలంలోని పెమ్మారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో అవకతవకలకు పాల్పడినట్లు కొందరు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

తాత్కాలికంగా చెక్కు పవర్ రద్దు

● కొడవలూరు : కొడవలూరు మండలంలో రేగడిచెలిక సర్పంచ్ చెక్ పవర్ ఆరునెలలపాటు రద్దు చేసినట్లు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఆర్‌పాలెం కార్యదర్శి విజయకుమార్ సస్పెండ్

● బిట్రగుంట : సీఆర్‌పాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్. విజయకుమార్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ఉత్తరులు జారీ చేశారు. అధికారుల తెలిపిన వివరాల మేరకు.. 2021-24లో కొడవలూరు మండలం రేగడిచిలక గ్రామంలో పని చేస్తున్నప్పుడు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

శివారుల్లోనే చెత్తకుప్పలు

- ప్రజారోగ్యానికి పొంచి ఉన్న ముప్పు
- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- దృష్టి సారించని అధికారులు

ఉలవపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు ఉలవపాడు, కరేడు మేజర్ పంచాయతీల్లో పారిశుధ్యం కొరవడింది. ప్రధానంగా ప్రధానరోడ్డు వెంట ఉన్న కూరగాయలు, పండ్లు అంగళ్లు, వ్యాపారులు, తోపుడు బండ్లపై టిఫిన్ సెంటర్లు నిర్వహించే వారంతా సాయంత్రానికి గ్రామశివారు రోడ్డు పక్కనే చెత్తంతా ఇష్టానుసారంగా పడేస్తుంటారు. ఉదయాన్నే పంచాయతీ పారిశుధ్య సిబ్బంది రెండు ట్రాక్టర్లతో దాన్ని ఎత్తి ఊరుబయటకు తరలిస్తున్నారు. గ్రామానికి దక్షిణం వైపు పెట్రోల్ బంక్ సమీపంలో రూ.8లక్షలతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో డంపింగ్‌యార్డ్ నిర్మించారు. ప్రస్తుతం ఇది వాడుకలో లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నది. సేకరించిన చెత్తను గ్రామానికి ఉత్తరం వైపు ఎంపీడీవో కార్యాలయంకు కూతవేటు దూరంలో జాతీయ రహదారి చిల్లాకాలువ బ్రిడ్జి కింద డంప్ చేసి తగలపెడుతున్నారు. అలాగే డంపింగ్ యార్డ్ బయట రోడ్డుకు ఇరువైపులా చెత్తను కుప్పలుకుప్పలుగా పోశారు. కరేడు మేజర్ పంచాయతీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సేకరించిన చెత్తను రామకృష్ణాపురం ఎస్టీ కాలనీకి దగ్గరలో డంప్ చేయడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో గ్రామాల శివారులో దుర్గంధం వెదజల్లుతుంది. వీటిలో కుళ్లి కూరగాయలతో పాటు ఇతర వ్యర్థాలను పారవేస్తుండటంతో కుళ్లి దుర్వాసతో ముక్కులు మూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు వాపోతున్నారు. అలాగే పొడి, తడి చెత్త బుట్టలు ప్రతి పంచాయతీకి వందల లెక్కన వచ్చాయి. కొన్ని ఎంపీడీవో కార్యాయం, మరికొన్ని కరేడు పాత పంచాయతీ కార్యాలయంలోని స్టోర్ రూం లకే పరిమితం అయ్యాయి. చెత్త సేకరణ రిక్షాలు నమూనాలుగా మిగిలిపోయాయి.


ఉలవపాడు శివారులోనే వేసిన చెత్తాచెదారం

భూముల రీ సర్వే మొదలు

జలదంకి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన చామదలలో సోమవారం ఉదయం రీ సర్వే డీటీ శ్యాంసన్, సర్వేయరు శోభన్, వీఆర్‌ఏ, వీఏఏలు ఈ రీసర్వేను మొదలుపెట్టారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేపట్టి భూ యజమానులు, ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. కేంద్రం ప్రవేశపెట్టిన స్వామిత్వ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే ప్రాజెక్ట్ పేరుతో సమగ్ర భూ సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రీసర్వే అంతా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టేందుకు ప్రభుత్వం అనేక జాగ్రత్తలు చేపట్టిందన్నారు. భూ యమానిని దగ్గర పెట్టుకుని రీ సర్వే కొలతలు తీసి సర్వే చేస్తామన్నారు. కార్యక్రమంలో భూ యజమానులు, నాయకులు దేవరపల్లి క్రిష్టారెడ్డి, మునగాల వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

- భూ రీసర్వేకు సహకరించాలి

బిట్రగుంట: భూ రీసర్వే కార్యక్రమంలో పని చేస్తున్న అధికారులకు రైతులు సహకరించాలని మండల తహసీల్దారు సురేష్‌బాబు అన్నారు. సోమవారం కోవూరుపల్లిలో రీసర్వే ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేరు శ్రీనివాసులు, మండల సర్వేయరు శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, నేతలు నాటక రాణి శీనయ్య, సుధీర్‌బాబు, రంగయ్య, వీఆర్వోలు దొరసానమ్మ, బాలనరసింహులు ఉన్నారు.


పొలంలో సర్వే చేస్తున్న అధికారులు



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దారు సురేష్‌బాబు

ట్రాఫిక్ రూల్స్‌ను తప్పక పాటించాలి


ప్రచారపత్రాలను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, ఆర్టీఓ టీవీఎన్ లక్ష్మి


సంగం: బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తున్న ఎంవీఐ రాములు, ఎస్ఐ రాజేష్

కందుకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతిఒక్కరూ పాటించడం సామాజిక బాధ్యతగా అలవర్చుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ప్రచార పత్రాలను సోమవారం ఆమె ఆర్టీఓ టీ వీఎన్.లక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 15వరకు జరిగే మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సీహెచ్ వీ బాలసుబ్రహ్మణ్యం, ఎంవీఐ సీహెచ్ రాంబాబు, సీఐ వెంకటేశ్వరరావు, ఏఎంవీఐ లక్ష్మీబాయి, ఎస్ఐలు సాంబశివరావు, బీటీ మహేంద్రనాయక్ పాల్గొన్నారు.

- కలిగిరి: పట్టణంలో విద్యార్థులతో కలిసి సీఐ వెంకట రమణ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఉమాశంకర్, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- సంగం: ఎంవీఐ రాములు, ఎస్ఐ రాజేష్‌తో కలిసి సంగం నుంచి మర్రిపాడు వరకు ముంబయి జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లను పరిశీలించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు, వెనుక కూర్చున్నవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, కారులో ప్రయాణంలో సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు.
- కావలి: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్లను ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ, ఆర్టీవో సుధాకర్ రెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందర రావులు ఆవిష్కరించారు. రహదారి భద్రతలపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం ముసునూరు జాతీయ రహదారి, కావలి బ్రిడ్జికూడలి సెంటర్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలపై చర్చించారు.


కావలి: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, ఆర్టీవో, ఎంవీఐ తదితరులు

మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాట్లపై అవగాహన

కొండాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 విద్యాసంవత్సరంలో ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాట్లపై సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో ఎంఈవో 1-2 రవికుమార్, ఆనందరావులు అవగాహన సమావేశం నిర్వహించారు. జీవో నెంబరు 117ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కొమ్మి, కొండాపురం, తూర్పుఎర్రబల్లి, సాయిపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

- ఉదయగిరి: జీవో నెంబర్ 117 ఉపసంహరణ, పాఠశాల సముదాయాల పునర్వ్యవస్థీకరణపై స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ప్రధానోపాధ్యాయుల అభిప్రాయ సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎనిమిది పాఠశాలల సముదాయాలకు గాను నాలుగు పాఠశాలల సముదాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలలు, హైస్కూల్స్ ఏర్పాటుపై ప్రతిపాదనలు పంపే విషయమై ఆర్‌జేడీ, డీఈవో వెబెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.
- కావలి టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేసేందుకే ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమం తలపెట్టిందని ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య తెలిపారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్ ఎంటీఎస్‌లు, ఐసీడీఎస్ సూపర్వైజర్లతో మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 6,7 తరగతుల పిల్లలు 30 మందికి తక్కువగా ఉంటే పాఠశాలను డీగ్రేట్ చేసి 1నుంచి 5తరగతుల బేసిక్ స్కూల్‌లో విలీనం చేయడం జరుగుతుందన్నారు. 6,7,8 తరగతుల పిల్లలు 60కంటే ఎక్కువమంది ఉంటే హైస్కూల్‌గా మారుతుందన్నారు.


కొండాపురం: మాట్లాడుతున్న ఎంఈవో-2 ఆనందరావు


ఉదయగిరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 శ్రీనివాసులు

ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సొంత స్థలం ఉండి కాలనీ ఇళ్లు కావలసిన వారు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఎంగౌస్‌మొహిద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మాట్లాడుతూ దరఖాస్తుదారులు భార్యా, భర్త ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాసు పుస్తకంను దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు స్థలానికి పొజిషన్, ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికేట్ మంజూరు చేస్తారన్నారు. తద్వార కేంద్రం సూచించిన యాప్‌లో నమోదు చేస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన ఎస్టీ కుటుంబాల నివాసాలకు కాలనీ ఇళ్లు మంజూరు చేస్తారన్నారు. ఎస్టీ కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఫర్నీచర్ వితరణ

ఉదయగిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కంభాల నరసమ్మ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు రమణమ్మ, నరసయ్యలు సోమవారం ఫర్నిచర్ వితరణ చేశారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డి, షేక్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయినులు ఆదిలక్ష్మీదేవి, ప్రశాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కావలి టౌన్, జనవరి 20: స్థానిక వెంగళరావునగర్‌లోని సంయుక్త సంస్థ కార్యాలయంలో పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. దాతలు కృష్ణయ్య ప్రభావతి దంపతుల సహకారంతో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ రోటరీక్లబ్ అధ్యక్షుడు దినేష్ పాల్గొని దాతలను అభినందించారు. ఆర్భాటాలకు నగదును వృథా చేసుకూడదన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, రఘుకుమార్ రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్ధారణపై ఇంటింటా సర్వే

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్ధారణపై ఇంటింటి సర్వే సర్వే ప్రారంభించారు. స్థానిక వైద్యాధికారి అశోక్ ఆధ్వర్యంలో తిరుమనతిప్ప కాలనీలో సర్వే చేశారు. సర్వే ఫిబ్రవరి 2వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అశోక్ పాల్గొన్నారు.

- కలిగిరి: క్రాకుటూరులో జరుగుతున్న కుష్ఠువ్యాధి క్యాంపెయిన్ సర్వేను వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు లెప్రసి(క్షయ) వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ క్షయ నిర్ధారిత పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనుమానిత కేసులుంటే వైద్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కలిగిరి: క్షయ నిర్ధారిత పరీక్ష నిర్వహిస్తున్న బిజ్జం గీతారెడ్డి

అధ్యాపకురాలికి జాతీయ ప్రతిభా అవార్డు

ఉదయగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు కప్పల పుష్పమ్మ సావిత్రి బాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణస్వామి తెలిపారు. ఆదివారం గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆడిటోరియంలో ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాకుడు నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో పుష్పమ్మ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు చెప్పారు.



అవార్డు అందుకుంటున్న పుష్పమ్మ

ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో షాలెట్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, పరిసరాల పరిశుభ్రతకు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

న్యూస్ బాక్స్

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

కావలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం రాహూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని కావలి, జలదంకి, కలిగిరి, కొండాపురం,దగదర్తి ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను సెల్:9959225643కు ఫోన్‌చేసి తెలపాలని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

అల్లూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం వీధిలోని కాలాపల్లి రామలింగేశ్వరరావు (36)మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కెఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు అంత్యక్రియల నిమిత్తం సోమవారం కుటుంబసభ్యులకు రూ.3వేలు అందజేశారు. ఫౌండేషన్ ఛైర్మన్ కందల రాజారెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం సాయం అందజేసినట్లు సభ్యులు తెలిపారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ

సంగం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ మందు ప్యాకెట్ల రూపంలో అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి శ్రీహరి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో మాట్లాడుతూ వరి వెన్నుదశలో ఉనప్పుడు ఎలుకలు కొట్టేస్తుంటాయని, నివారణకు ప్రభుత్వం రైతుసేవా కేంద్రాల ద్వారా ఉచితంగా మందు అందచేస్తుందని తెలిపారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ రఘునాథ్ అన్నారు. సోమవారం వాక్తన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి జాతీయ రహదారిపై బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ ప్రాముఖ్యతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్లలోకి దూసుకెళ్లిన కారు

అనంతసాగరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలైన సంఘటన ఉప్పలపాడు వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. సోమశిల వైపు నుంచి అనంతసాగరానికి వస్తున్న కారును అనంతపురం నుంచి పెంచలకోనకు వెళ్తున్న తుఫాన్ కారు ఢీకొంది. దీంతో పడమటి కంబపాడుకు చెందిన పెంచలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కార్లు చెట్లలోకి దూసుకెళ్లాయి.



నూరు శాతం లక్ష్య సాధనకు కృషి

రవిశంకర్‌రెడ్డి, ఏపీఎం

ఇంటర్వ్యూ...



సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల సభ్యుల నుంచి రుణ రికవరీ నూరు శాతం లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఏపీఎం ఎన్ రవిశంకర్‌రెడ్డి సోమవారం తెలిపారు.

? ఎన్ని పొదుపు సంఘాలున్నాయి. బ్యాంక్ లింకేజీ రుణాలిస్తున్నారా.

! 20 పంచాయతీల్లో 991 సంఘాలున్నాయి.వాటిలో 10,004మంది సభ్యులు ఉన్నారు. 2024-25లో 756 సంఘాలకు బ్యాంక్ లింకేజీ లక్ష్యం రూ. 31.5 కోట్లు.

? ఎన్ని సంఘాలకు రుణాలిప్పించారు. ఎంత శాతం రికవరీ ఉంది.

! 411సంఘాలకు ఇప్పటి వరకు 25.61కోట్ల మేర బ్యాంక్ లింకేజీలను మార్చి నెలాఖరులోపు పూర్తిచేస్తాం. రికవరీ 99.7శాతం ఉంది.

? స్త్రీనిధి కింద ఎంతమందికి రుణాలు ఇచ్చారు. రికవరీ శాతం ఎంత చేశారు.

! 1000 మంది సభ్యులకు రూ.5కోట్ల రుణం ఇవాలని లక్ష్యం. ఇప్పటివరకు 424 మందికి రూ.2.72కోట్ల మేర రుణాలు అందచేశాం. రికవరీ 93 శాతం ఉంది. ఒక్కొక్కరికి వారు ఏర్పాటుచేసే యూనిట్‌ను బట్టి రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఇచ్చాము.

ఇన్సూరెన్స్ చేయించుకున్న ప్రతిఒక్కరికీ పరిహారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేజర్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 'ముంచిన ముసురు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనంపై వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మండలవ్యవసాయశాఖ అధికారి శశిధర్ మాట్లాడుతూ చేజర్ల మండలంలో 736ఎకరాల వరకు మినుము పంట సాగు చేశారు. ఇప్పటికే తెగుళ్ల సోకిన పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసినట్లు తెలిపారు. అయితే పంటకు ఇన్సూరెన్స్ చేయించుకున్న ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా రంగు మారిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

కేవీకేలో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

కందుకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో నిరుద్యోగ యువతకు పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీపై 6రోజుల నైపుణ్య శిక్షణను సోమవారం ప్రారంభించారు. ఆత్మ సౌజన్యంతో నిర్వహించే శిక్షణకు కేవీకే హెడ్ డాక్టరు ప్రసాద్‌బాబు నేతృత్వంలో నిర్వహించిన శిక్షణలో ప్రకాశం జిల్లా వ్యవసాయాధికారి, ఆత్మ పీడీ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. దేశంలో పండిస్తున్న పండ్లు, కూరగాయల్లో వృథాతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై తగిన అవగాహన, మౌలిక సదుపాయాలు లేవన్నారు. అనంతరం ఆత్మ డీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడారు. శిక్షణ తీసుకున్న యువత పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా లేదా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రాజెక్టును సమర్పిస్తే సబ్సిడీ రుణాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ నిహారిక మాట్లాడారు. ఫుడ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ తీసుకుని విలువ ఆధారిత ఉత్పత్తులు జామ్, జెల్లీ, స్క్వాష్, పికెల్స్, సాస్, కేచప్, బిస్కెట్లు, కేకులు తయారు చేసి ఉపాధి పొందవచ్చన్నారు. శిక్షణకు హాజరైన యువతకు పదార్థాల తయారీపై బుక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు రవికుమార్, కేవీకే శాస్త్రవేత్త వెంకటేష్, అధ్యాపకులు అనూష, బాలూనాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆత్మ పీడీ శ్రీనివాసరావు

టీఆర్‌ఆర్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు

కందుకూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రం బోధనకు గెస్ట్ ఫ్యాకల్టీగా అర్హత కలిగిన వారు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ మ్యాథమ్యాటిక్స్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలైతే 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని ఆయన తెలిపారు. బోధనానుభవంతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. గంటకు రూ.400 చొప్పున నెలకు గరిష్ఠంగా రూ. 28వేలు వరకు వేతనం అందజేస్తామన్నారు. 27న ఉదయం 11గం టలకు జరిగే ఇంటర్వ్యూ, డెమోకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

కొండాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి: మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన మండల కార్యాలయంలో సాదాసీదాగా జరిగింది. మూడునెలల కాలంలో వెలుగు, విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పారిశుధ్యం, పశు సంవర్థకశాఖ, హౌసింగ్ తదితర శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఎంపీడీవో ఆదినారాయణ సమీక్ష నిర్వహించారు. గుడవళ్లూరు సర్పంచ్ బద్దిపూడి మాచర్ల మాట్లాడారు. జలజీవన్ మిషన్ పైపులైన్ల లీకేజీతో కొన్నిప్రాంతాల్లో మురుగుకుంటలను తలపిస్తున్నాయని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీ డీవో నుకోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ సద్వినియోగం చేసుకోండి

సంగం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిస్కమ్ డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సతీష్ కోరారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మండలంలో సుమారు రూ.3.5లక్షల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వెంటనే చెల్లించే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు పీఎం సూర్య ఘర్ పథకంలో నూరుశాతం రాయితీతో సౌర ఫలకలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఎస్టీ, ఎస్సీలు వారి ఆధార్ నెంబరు, విద్యుత్ సర్వీసు, మొబైల్ నెంబరు అందచేస్తే రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. తరువాత ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ మన్మధరావు ఉన్నారు.

ఆధార్ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేస్తాం

కందుకూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లలోపు చిన్నారులందరికీ ఆధార్‌సేవలను సంపూర్ణంగా అందించాలన్న లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. 21న కృష్ణబలిజసంఘం, బూడిదపాలెం దర్గా ఏరియా, 22న గుర్రం వారిపాలెం, సాయినగర్ 23న ఆదిఆంధ్ర కాలనీ, బూడిదపాలెం 24న యానాదిపాలెం, కోటకట్ట వీధిలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

- కావలి: పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు పిల్లల వివరాలను మీ పరిధిలోని సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీని క్రియేట్ చేస్తున్నారని అందులో వివరాలు సరాగి ఉండటం లేదన్నారు. ఈ సమస్యతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవన్నారు. ఐదేళ్ల పిల్లల ఆధార్ కార్డులను ఆధార్ సెంటర్‌లో తల్లితండ్రులు అప్‌డేట్ చేయించుకుని, ఫోన్ నంబర్లు అనుసంధానం చేయాలన్నారు.

ప్రజలు ఛీ కొట్టినా.. కాకాణికి బుద్ధిరాలేదు

కావలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా కాకాణికి బుద్ధిరాలేదని కావలి పట్టణ, బోగోలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ క్రిషోర్, మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో కోళ్లదిన్నె బాధితులతో కలిసి వారు మాట్లాడారు. నిత్యం రోగులతో కిటకిటలాడే కావలి ఏరియా వైద్యశాలలోకి కోళ్లదిన్నె వైసీపీ నేతలు మారణాయుధాలతో వచ్చి భయకంపితులు చేస్తుంటే ఆదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు, సానుభూతిపరులు అడ్డుకోవటం తప్పా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డిలకు లేదన్నారు. బాబూరావు, సుదీర్, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, దావులూరి దేవకుమార్, కోడూరు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకారెడ్డి, రావి విజయ్, హర్ష పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిషోర్‌బాబు, నాగేశ్వరరావు, జ్యోతి బాబురావు

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

కావలి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న తాగునీటి సమస్యకు ప్రస్తుత తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ శాశ్వత పరిష్కారం చూపారు. కార్యాలయం ముందు ఉన్న పాడుబడిన మంచినీటి బావిలో పూడికను తీయించారు. బావిపై ఇనుప మెస్ వేయించి బావికి విద్యుత్ మోటారు బిగించి పైపులైన్ల ద్వారా కార్యాలయంలోకి నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బావి చుట్టూ ప్లాట్‌ఫాం నిర్మించారు.